www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



బుధవారం | 16-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 108 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి రా.9.02 తదుపరి సప్తమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర తె.4.50 తదుపరి రేవతి, వర్జ్యం: మ.3.00-4.32, దుర్ముహూర్తం: ఉ.11.55-12.47, అమృతఘడియలు: రా.12.13-1.45, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.53, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## డిప్యూటీ సీఎం భట్టికి లీగల్ నోటీసు..

రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై భట్టి వ్యాఖ్యల మీద రాంచందర్‌రావు అభ్యంతరం

3 రోజుల్లో క్షమాపణ చెప్పాలి

లేదంటే క్రిమినల్ కేసు ఎదుర్కోవాలని హెచ్చరిక

3

## విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావు
# ఆస్తులు చూస్తే అవాక్కే!

### మార్కెట్ విలువ రూ.500 కోట్లపైనే

హైదరాబాద్‌లోని మోకిలలో 6,500 చదరపు గజాల స్థలం

నగరం శివార్లలో 11 ఎకరాల సాగు భూమి

జహీరాబాద్‌లో 2 కేవీ సోలార్ పవర్ ప్రాజెక్టు

బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, కోకాపేట, బేగంపేటల్లో నాలుగు ఫ్లాట్లు, ఖరీదైన ప్రాంతాల్లో నాలుగు ఇళ్ల స్థలాలు

కోదాడ, వరంగల్‌లో అపార్టుమెంట్లు, కొండాపూర్‌లో విల్లా

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలక పాత్ర పోషించిన మురళీధర్, ఆయన బంధువుల ఇళ్లల్లో ఏసీబీ సోదాలు

ఉదయం అదుపులోకి.. సోదాలు.. సాయంత్రానికి అరెస్టు

ఆయన ఆస్తులన్నీ అక్రమార్జనగా గుర్తించాం

బంగారం, బ్యాంకు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాలను ఇంకా వెల్లడించాల్సి ఉంది: ఏసీబీ డీజీ





మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్ రావు ఇంట్లో సోదాలు జరుపుతున్న ఏసీబీ సిబ్బంది; మురళీధర్ (ఫైల్)

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోనే అత్యంత ఖరీదైన ప్రాంతం మోకిలలో 6,500 చదరపు గజాల స్థలం! అంటే.. దాదాపు ఎకరంన్నర! హైదరాబాద్ శివార్లలో 11 ఎకరాల పొలం! హైదరాబాద్ సహా తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు! అపార్టుమెంట్లు! ఫైవ్‌స్టార్ లగ్జరీ విల్లాలు! సెలబ్రిటీ ప్రాజెక్టుల్లో కోట్ల రూపాయల విలువైన ఫ్లాట్లు! ఇవన్నీ కాకుండా ఓ సోలార్ పవర్ ప్రాజెక్టు కూడా! కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకంగా వ్యవహరించిన విశ్రాంత ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) సి.మురళీధర్ రావు ఆస్తుల్లో ఇవి కొన్ని మాత్రమే! ఆయన ఆస్తుల మార్కెట్ విలువ రూ.500 కోట్లను దాటిపోవచ్చని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులే అంచనా వేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో

మిగతా 9వ పేజీలో...

● ట్యాపింగ్.. లిక్కర్.. చెట్టపట్టాల్

### శ్రవణ్‌రావు దుబాయ్ ఫ్లాట్‌లో.. ఏపీ లిక్కర్ స్కాం నిందితుల మకాం

ఆ ఫ్లాట్ కేంద్రంగానే నడిచిన లిక్కర్ దందా

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్

అతనికి లిక్కర్ స్కాం ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డితో సంబంధాలు

ఆ సొమ్ముతో రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారం

9



1. మేడిగడ్డ
2. ఇచ్చంపల్లి
3. దుమ్ముగూడెం

## రిజర్వాయర్
# ఇచ్చంపల్లిలోనే!

### గోదావరి-కావేరి అనుసంధానం కోసం నిర్మించాలి

అక్కడి నుంచే 200 టీఎంసీల తరలింపు.. ఇచ్చంపల్లికి రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం

సీఎంల భేటీలో ఎజెండాగా చేర్చాలని లేఖ.. 100 మీటర్లతో నిర్మిస్తే మేడిగడ్డకు ప్రత్యామ్నాయం

గతంలో అభ్యంతరం తెలిపినా.. గోదావరి-బనకచర్లకు కౌంటర్‌గా తాజాగా తెరపైకి!

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు సమాంతరంగా ఇచ్చంపల్లిలో రిజర్వాయర్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఇచ్చంపల్లి రిజర్వాయర్ నుంచే గోదావరి-కావేరి అనుసంధానం చేపట్టాలని, ఈ రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ నుంచి 200 టీఎంసీల నీటిని తరలించడానికి వీలుగా అవసరమైన ఆర్థిక సహాయం ఏఐబీపీ/పీఎం కేఎస్‌వై నుంచి చేయాలని కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నిర్వహించే సమావేశపు ఎజెండాలో దీనిని చేర్చాలని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ కూడా రాశారు. ఇచ్చంపల్లిపై ప్రభుత్వం నెల రోజులుగా సమాలోచనలు జరుపుతున్న విషయం తెలిసిందే. తాజాగా గోదావరిపై ఎగువన తెలంగాణ ప్రాజెక్టులు కట్టుకుంటే తమకు అభ్యంతరాల్లేవని ఏపీ సీఎం చంద్రబాబు కూడా ప్రకటించారు. మరోవైపు గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కింద

మిగతా 13వ పేజీలో...

### ఎజెండాలో బనకచర్ల వద్దు

సీఎంల భేటీ ఎజెండాపై తెలంగాణ అభ్యంతరం

చర్చించే అంశాలను సవరించాలని కేంద్రానికి లేఖ

జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, పీపీఏ అభ్యంతరాల ప్రస్తావన

13

## ఇద్దరు కేజీబీవీ విద్యార్థినుల
# ఆత్మహత్య

మరో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఒకేరోజు 3 ఘటనలు.. అన్నీ కేజీబీవీల్లోనే!

తరగతి గదిలో ఉరివేసుకున్న ఒక విద్యార్థిని.. ఇంట్లో మరో అమ్మాయి ఉరి

పాఠశాల భవనంపై నుంచి దూకిన ఇంకో విద్యార్థిని

మానసిక ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థుల బలవన్మరణాలు

తీవ్ర ఆందోళనలో తల్లిదండ్రులు

14


## భార్యాభర్తల పంచాయితీలో ఘర్షణ

కత్తులు, కర్రలతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న ఇరు కుటుంబాలు

ఇద్దరు మృతి.. నలుగురికి గాయాలు

పెద్దపల్లి జిల్లాలో ఘటన

14



లెక్చరర్లు నరేంద్ర, సందీప్, వారి మిత్రుడు అనూప్

## విద్యార్థినిపై ఇద్దరు లెక్చరర్ల అత్యాచారం

ఆ వీడియోలతో బెదిరించి ఆమెపై వారి స్నేహితుడు కూడా అఘాయిత్యం

కర్ణాటకలోని దక్షిణకన్నడ జిల్లాలో ఘోరం

మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన బాధితురాలు.. నిందితుల అరెస్టు

ప్రొఫెసర్ వేధింపులతో ఆత్మాహుతికి యత్నించిన యువతి మృతి

2

ఒడిసాలోని బాలాసోర్‌లో ఘటన

విచారణకు నలుగురితో యూజీసీ కమిటీ

# సురక్షితంగా భూమికి శుక్లా

### 18 రోజుల యాక్సియం-4 మిషన్ విజయవంతం

షెడ్యూల్ ప్రకారం పసిఫిక్ మహాసముద్రంలో దిగిన డ్రాగన్ క్యాప్సూల్.. నలుగురు వ్యోమగాములూ క్షేమం

మరో 7 రోజులు వారంతా పునరావాస కేంద్రంలోనే!

ఆనందంతో కంటతడి పెట్టిన శుభాన్షు తల్లిదండ్రులు

హృదయపూర్వక స్వాగతం పలికిన రాష్ట్రపతి ముర్ము

అంకితభావం, ధైర్యసాహసాలతో శుభాన్షు కోట్లాది మంది కలలకు స్ఫూర్తిగా నిలిచారన్న ప్రధాని మోదీ



డ్రాగన్ క్యాప్సూల్ నుంచి బయటకు వస్తున్న శుభాన్షు



శుభాన్షు శుక్లా తల్లిదండ్రుల భావోద్వేగం

న్యూఢిల్లీ, జూలై 15: భారత కీర్తిపతాకను అంతరిక్షంలో సగర్వంగా ఎగురవేసిన వాయుసేన కెప్టెన్, వ్యోమగామి శుభాన్షు శుక్లా.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి క్షేమంగా భూమికి తిరిగొచ్చారు! యాక్సియం-4 మిషన్‌లో భాగంగా మరో ముగ్గురు వ్యోమగాములు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోష్ ఉజ్నైన్‌స్కీ (పోలండ్), టిబోర్‌కాపు (హంగరీ)తో కలిసి జూన్ 26న ఐఎస్ఎస్‌కు చేరుకున్న శుక్లా.. 18 రోజులపాటు అక్కడ పలు ప్రయోగాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. నిర్ణీత షెడ్యూలు ప్రకారం.. ఆ నలుగురితో కూడిన డ్రాగన్ క్యాప్సూల్ (దాని పేరు గ్రేస్) భారత కాలమానం ప్రకారం

మిగతా 2వ పేజీలో...

## సీపీఐ నేత
# దారుణ హత్య

### సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చందు నాయక్‌పై కాల్పులు

హైదరాబాద్‌లోని మలక్‌పేటలో ఘటన

కారులో వచ్చి ఐదురౌండ్ల కాల్పులు జరిపిన నలుగురు దుండగులు

అక్కడికక్కడే చందునాయక్ మృతి

ఆర్థిక లావాదేవీల నేపథ్యంలోనే హత్య?



చందు నాయక్ (ఫైల్)

చాదర్‌ఘాట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చందు నాయక్ (50) దారుణహత్యకు గురయ్యారు. స్థానికులు, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం మలక్‌పేట పరిధిలోని శాలివాహన నగర్ పార్కు వద్ద చందు నాయక్ వాకింగ్ చేస్తుండగా కారులో నలుగురు దుండగులు

మిగతా 9వ పేజీలో...



మారెల్లి అనిల్ (ఫైల్)

## కాపు కాచి.. కాల్చి చంపి..

కాంగ్రెస్ మెదక్ జిల్లా ఎస్సీ సెల్ నేత మారెల్లి అనిల్ దారుణ హత్య

సోమవారం రాత్రి మెదక్ జిల్లాలో ఘటన

అనిల్‌పైకి తుపాకీతో దుండగుల కాల్పులు

అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న కారు

తొలుత యాక్సిడెంట్‌గా భావించిన పోలీసులు

పోస్టుమార్టం సమయంలో బుల్లెట్ గాయాలు గుర్తించిన వైద్యులు

14

రియల్ ఎస్టేట్ వివాదాలే హత్యకు కారణమనే అనుమానాలు

## డ్రగ్స్ దందాలో..
# పోలీసుల పిల్లలు

ఇంటెలిజెన్స్ ఎస్పీ కుమారుడు రాహుల్ తేజ, సైబరాబాద్ ఏఆర్ డీసీపీ కొడుకు మోహన్‌లను అరెస్టు చేసిన ఈగల్

డ్రగ్స్ వ్యవహారంలో మల్నాడు కిచెన్ సూర్యతోపాటు ఇప్పటి వరకు పది మంది అరెస్టు

సూర్య కాల్ లిస్టులో సెలబ్రిటీలు, రాజకీయ నేతల పిల్లలు?



హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ విక్రయాలు, కొనుగోళ్లలో సెలబ్రిటీలతోపాటు.. పోలీసు అధికారుల పిల్లల పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. 24 గంటల్లోనే డ్రగ్స్ డీల్స్‌కు సంబంధించి ఇద్దరు పోలీసు అధికారుల పుత్ర రత్నాలను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ వింగ్- ఈగల్ బృందాలు అరెస్టు చేశాయి. ఇలా అరెస్టయిన వారిలో.. మల్నాడు కిచెన్ యజమాని సూర్యతో కలిసి డ్రగ్స్ దందాలో క్రియాశీలంగా ఉన్న ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ వేణుగోపాల్‌రావు కుమారుడు రాహుల్ తేజ, సైబరాబాద్ ఏఆర్ డీసీపీ సంజీవ్ కుమారుడు మోహన్ ఉన్నారు. నిజానికి రాహుల్ తేజపై గత ఏడాది నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో

మిగతా 14వ పేజీలో...



## ఇస్లామిక్ విద్యా బోధన
# తప్పేమీ కాదు!

వేదాలు, ఉపనిషత్తుల బోధనకూ అభ్యంతరం అవసరం లేదు

రాజకీయ పార్టీలు విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తే స్వాగతిస్తాం

మైనారిటీలకు రాజ్యాంగ రక్షణలు

మతచిచ్చు, కులచిచ్చు.. రెండూ ప్రమాదకరమైనవే: సుప్రీంకోర్టు

ఎంఐఎం గుర్తింపును రద్దు చేయాలన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, జూలై 15: ఎంఐఎం పార్టీ గుర్తింపును రద్దు చేయాలన్న ఓ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. తిరుపతి నరసింహ మురారి అనే వ్యక్తి తరఫున దాఖలైన ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్,

మిగతా 9వ పేజీలో...

# పెట్టుబడులతో తరలిరండి



ఐకార్ బయోలాజిక్స్ ప్రతినిధులతో సీఎం రేవంత్, మంత్రులు వివేక్, దుద్దిళ్ల

పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

పారిశ్రామిక విధానాలను మరింత మెరుగుపరుస్తాం

రాయితీలు, అనుమతుల్లో సానుకూల వాతావరణం

ప్రభుత్వాలు మారినా కొనసాగేలా విధానాలు

బల్క్ డ్రగ్, డేటా సెంటర్ల కేంద్రంగా హైదరాబాద్

పొరుగు రాష్ట్రాలతో కాదు.. ప్రపంచంతోనే పోటీ

జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

### గవర్నర్ వద్దకు ఆర్డినెన్స్ ఫైలు

ఆమోదం తర్వాత ఆర్డినెన్స్ జారీ

అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42%పై ఉత్తర్వులు

14

మేడ్చల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పారిశ్రామిక విధానాలను మరింత మెరుగుపర్చుకుంటూ తెలంగాణను పెట్టుబడులకు నిలయంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తామని, పెట్టుబడులతో ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా తుర్కపల్లి

మిగతా 13వ పేజీలో...

# కీచక లెక్చరర్లు

- విద్యార్థినిపై ఇద్దరు అధ్యాపకుల అత్యాచారం
- ఆ వీడియోలతో వారి స్నేహితుడి బ్లాక్ మెయిలింగ్
- కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో దారుణం


నరేంద్ర, సందీప్, అనూప్


బెంగళూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై ఇద్దరు లెక్చరర్లు, వారి మిత్రుడు అత్యాచారానికి పాల్పడి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా మూడబిదరెలో ఈ దారుణం జరిగింది. బాధితురాలు తల్లిదండ్రుల సాయంతో మహిళా కమిషన్‌ను ఆశ్రయించడంతో నిందితులపై పోలీసులు చర్యలు చేపట్టారు. మూడబిదరెలోని ఓ ప్రతిష్ఠాత్మక కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ నరేంద్ర, బయాలజీ లెక్చరర్ సందీప్‌లతోపాటు వారి మిత్రుడు అనూప్‌ను మంగళవారం బెంగళూరు మారతహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఫిజిక్స్ లెక్చరర్ నరేంద్ర బాధిత విద్యార్థినికి నోట్స్ ఇచ్చే విషయంలో సహకరించాడు. ఈ క్రమంలో ఫోన్ ద్వారా ఆమెతో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. తర్వాత విద్యార్థినిని మూడబిదరె నుంచి బెంగళూరు మారతహళ్లిలోని తన మిత్రుడు అనూప్ గదికి తీసుకువచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. కొన్ని రోజుల తర్వాత బయాలజీ లెక్చరర్ సందీప్ కూడా ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె వ్యతిరేకించడంతో నరేంద్రతో కలసి ఉన్న ఫొటోలు, వీడియోలు తన వద్ద ఉన్నాయని బెదిరించాడు. అతను కూడా బాధితురాలిని అనూప్ గదికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. కొన్ని రోజుల తర్వాత అనూప్ కూడా.. నరేంద్ర, సందీప్‌లతో తన గదిలోకి వచ్చినప్పుడు రికార్డయిన సీసీటీవీ ఫుటేజీని బయటపెడతానంటూ బాధితురాలిని బెదిరించి అనూప్ కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ముగ్గురి నుంచి వేధింపులు తీవ్రం కావడంతో బాధితురాలు విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపి మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ సూచన మేరకు మారతహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

## ప్రొఫెసర్ వేధింపులతో విద్యార్థిని ఆత్మాహుతి

- ఒడిసాలోని బాలాసోర్‌లో ఘటన
- నలుగురు సభ్యులతో యూజీసీ కమిటీ

న్యూఢిల్లీ, జూలై 15: ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తట్టుకోలేక బీఈడీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కాలేజీ క్యాంపస్‌లోనే ఆత్మాహుతికి పాల్పడ్డారు. ఒడిసాలోని బాలాసోర్‌లో ఉన్న ఫకీర్ మోహన్(అటానమస్) కాలేజీలో జరిగిందీ దారుణం. కాలేజీలోని విద్యా విభాగాధిపతి సమీరా కుమార్ సాహు తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు ఆరోపించారు. అయినప్పటికీ ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోకపోవడంతో కాలేజీ క్యాంపస్‌లోనే శనివారం ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. బాధితురాలిని ఎయిమ్స్-భువనేశ్వర్‌కు తరలించగా సోమవారం రాత్రి మృతి చెందారు. ఘటనపై యూజీసీ స్పందించింది. వాస్తవాలు గుర్తించేందుకు నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. గురు గోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ ప్రొఫెసర్, యూజీసీ సభ్యుడు రాజ్‌కుమార్ మిట్టల్ నేతృత్వంలోని ఈ కమిటీలో యూజీసీ మాజీ సభ్యురాలు సుష్మా యాదవ్, గుజరాత్ యూనివర్సిటీ మాజీ వీసీ నీరజా గుప్తా, యూజీసీ సంయుక్త కార్యదర్శి అషిమా మంగ్లా సభ్యులుగా ఉన్నారు.

## లోకం తీరు




అణు, జీవ, రసాయన

## దాడులపైనా నిఘా!

- 6 రక్షణ వ్యవస్థలను నౌకాదళానికి అందించిన డీఆర్‌డీవో

న్యూఢిల్లీ, జూలై 15: భారత నౌకాదళం అమ్ముల పొదిలో అణు, జీవ, రసాయన ప్రమాదాలను సైతం గుర్తించి, అరికట్టే వ్యవస్థలు వచ్చి చేరాయి. స్వదేశీ పరిజ్ఞానంతో అత్యంత ఆధునిక సాంకేతికతను వినియోగించి రూపొందించిన ఆరు రక్షణ వ్యవస్థలను నౌకాదళానికి డీఆర్‌డీవో అందించింది. వీటిలో అణు, జీవ, రసాయన రక్షణ వ్యవస్థలు ఉన్నాయని, ఇవి వ్యూహాత్మక జాతీయ భద్రతలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని డీఆర్‌డీవో వెల్లడించింది. అదేవిధంగా నౌకాదళ సిబ్బంది గుణాత్మక అవసరాలకు ఇవి ఎంతగానో తోడ్పడనున్నాయని తెలిపింది. ఈ వ్యవస్థలను నౌకాదళ ప్రధాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అడ్మిరల్ శ్రీరాం అమూర్‌కు డీఆర్‌డీవో చైర్మన్, డీడీఆర్‌డీ సెక్రటరీలు అందించారు.

ఇవీ 6 వ్యవస్థలు

1) గామా రేడియేషన్ ఏరియల్ సర్వైవలెన్స్ సిస్టమ్(జీఆర్‌ఏఎస్‌ఎస్): తేలికపాటి గామా రేడియేషన్ మాడ్యూల్‌ను వినియోగించి రూపొందించిన ఈ వ్యవస్థ అణు స్థావరాలు, రేడియేషన్ ఉన్న ప్రాంతాల్లో సైతం వైమానిక రేడియలాజికల్ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది.

2) ఎన్విరాన్‌మెంటల్ సర్వైవలెన్స్ వెహికల్(ఈఎస్‌వీ): సంభావ్య ప్రమాదకర వాతావరణాల్లో కూడా అణు, జీవ, రసాయన ఆయుధాలను, దాడులను గుర్తిస్తుంది.

3) వెహికల్ రేడియలాజికల్ కంటామినేషన్ మానిటరింగ్ సిస్టమ్(వీఆర్‌సీఎంఎస్): అణుకలుషిత, రేడియలాజికల్‌గా ప్రమాదకరమైన వాతావరణ పరిస్థితుల్లో పనిచేసే వాహనాలు, సిబ్బందిపై రేడియేషన్ ప్రభావాన్ని గుర్తిస్తుంది. అదేవిధంగా సర్వే చేసేందుకు ఉపయోగపడుతుంది.

4) అండర్ వాటర్ గామా రేడియేషన్ మానిటరింగ్ సిస్టమ్(యూజీఆర్‌ఎంఎస్): నీటి అడుగున గామా రేడియేషన్ స్థాయిలను అంచనా వేసి, డేటా బేస్ స్టేషన్‌కు చేరవేస్తుంది. పోర్టులు, తీరప్రాంతాలు, నేవీ కార్యకలాపాల్లో భద్రతకు దోహదపడుతుంది.

5) డర్ట్ ఎక్స్‌ట్రాక్టర్ అండ్ క్రాస్ కంటామినేషన్ మానిటర్(డీఈసీసీఓఎం): ప్రమాదకర పదార్థాలను బదిలీ చేసే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. జీవ, రసాయన, రేడియాలజీ ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ఇది ఉపయోగపడుతుంది. పాదరక్షల నుంచి కూడా కలుషితాలను సంగ్రహిస్తుంది.

6) ఆర్గాన్ రేడియాక్టివిటీ డిటెక్షన్ సిస్టమ్(ఓఆర్‌డీఎస్): మానవ అవయవాలలో రేడియోధార్మికత స్థాయిలను గుర్తిస్తుంది.

## క్యాన్సర్ సహా 71 ఔషధాల ధరల ఖరారు

న్యూఢిల్లీ, జూలై 15: క్యాన్సర్ సహా.. 71 రకాల ఔషధాల ధరలను కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఇందులో మెటాస్టాటిక్ రొమ్ము క్యాన్సర్, అలర్జీలు, మధుమేహం వంటి వ్యాధుల చికిత్సలకు వినియోగించే ఔషధాలున్నాయి. ఈ మేరకు జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల సంస్థ(ఎన్‌పీపీఏ) మంగళవారం ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఫార్మసీల్లో ధరల పట్టీలను ప్రదర్శించాలని ఆ నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. అందులో కొన్ని ముఖ్యమైన ఔషధాల ధరలు ఇలా ఉన్నాయి. రిలయెన్స్ లైఫ్ సైన్సెస్ తయారు చేసే ట్రాస్టుజుమాబ్ ఇంజెక్షన్ ధర ఒక్కో వైల్‌కి రూ.11,966గా ఉంది. దీన్ని మెటాస్టాటిక్ బ్రెస్ట్ క్యాన్సర్, గ్యాస్ట్రిక్ క్యాన్సర్ చికిత్సలో వినియోగిస్తారు. పెప్టిక్ అల్సర్ చికిత్సలో వాడే క్లారిత్రోమైసిన్, ఎసోమెప్రజోల్, అమోక్సిసిల్లిన్‌ల కాంబినేషన్ మాత్ర ధర(ఒక్కోటి)ను రూ.162.5గా నిర్ణయించారు. దీన్ని టోరెంట్ ఫార్మా కంపెనీ తయారు చేస్తుంది. లైఫ్ సేవింగ్‌లో భాగంగా వాడే సెఫ్ట్రియాక్సోన్, డిసోడియం ఎడిటేట్, సల్బాక్టామ్ కాంబినేషన్ల ఇంజెక్షన్ వైల్ ధరను రూ.626గా నిర్ణయించారు. ఇదే కంపోజిషన్‌తో వైకెమ్ కంపెనీ తయారు చేసే ఇన్ఫ్యూషన్ సొల్యూషన్ ఇంజెక్షన్ ధరను ప్రతి వైల్‌కి రూ.515.50గా ఖరారు చేశారు. మధుమేహ చికిత్సలో ఉపయోగించే.. సిటాగ్లిప్టిన్ కలిగి ఉన్న 25 రకాల ఔషధాల ధరలు, ఎంపాగ్లిఫ్లోజిన్ కలిగి ఉన్న ఇతర షుగర్ ఔషధాల ధరలను కూడా తాజా నోటిఫికేషన్‌లో నిర్ణయించారు.

## సమోసా, జిలేబిలపై లేబుళ్లు వేయాలనలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 15: దేశంలో ప్రసిద్ధ చిరుతిళ్లయిన సమోసా, జిలేబీ వంటి ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుళ్లు పెట్టాలని చెప్పలేదని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. వీధి వ్యాపారులు విక్రయించే చిరుతిళ్లను లక్ష్యంగా చేసుకొని ఎలాంటి ఆదేశాలూ జారీ చేయలేదని మంగళవారం తెలిపింది. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించేలా ప్రజల్ని ప్రోత్సహించడానికే ప్రభుత్వ ఆఫీసులు, స్కూళ్లు, ఇతర కార్యాలయాల్లో 'చక్కెర, నూనె బోర్డులు' ఏర్పాటు చేయాలని, రోజువారీ తీసుకునే ఆహార పదార్థాల్లో ఉండే కొవ్వు, చక్కెర శాతం వంటి సమాచారాన్ని డిజిటల్ బోర్డుల్లో ప్రదర్శించాలని సూచించినట్లు పేర్కొంది.

## తేజస్ యుద్ధ విమానాల తయారీలో ముందడుగు

బెంగళూరు, జూలై 15: తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఎంకే-1ఏ ఉత్పత్తిలో కీలక ముందుడుగు పడింది. తేజస్ తయారీలో కీలకమైన ఎఫ్-404 ఇంజన్ల డెలివరీ మళ్లీ మొదలైంది. ఈ యుద్ధ విమానాలను తయారు చేస్తున్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)కు అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ) సంస్థ సుదీర్ఘ విరామం తర్వాత రెండో ఇంజన్‌ను అందించింది. జీఈ నుంచి వచ్చే ఏడాది మార్చిలోగా 12 ఇంజన్లను డెలివరీ తీసుకోవాలని హాల్ భావిస్తోంది. మొత్తం 99 ఇంజన్ల కోసం భారత్ 2021లో జీఈతో ఒప్పందం చేసుకుంది. అయితే.. వరుస అవాంతరాల కారణంగా ఇంజన్ల డెలివరీ ఆలస్యమవుతూ వస్తోంది. ఇప్పుడు డెలివరీ ప్రారంభం కావడంతో ఈ ఏడాది చివరిలోగా మరో పది ఇంజన్లు భారత్‌కు రావొచ్చని భావిస్తున్నారు. భారత వైమానిక దళం తమకు 83 తేజస్ ఎంకే-1ఏ యుద్ధ విమానాలు కావాలని హాల్‌కు ఆర్డర్ ఇచ్చింది.

# సురక్షితంగా భూమికి శుక్లా

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం (జూలై 14న) సాయంత్రం 4.45 గంటలకు ఐఎస్ఎస్ నుంచి విడివడింది. ఆ తర్వాత కొద్ది సేపటికే.. ఐఎస్ఎస్ చుట్టూ ఉండే 200 మీటర్ల 'కీప్ అవుట్ స్పియర్'ను.. 4 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే అప్రోచ్ ఎలిప్సాయిడ్‌ను దాటేసి.. గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో భూమి బాట పట్టింది. దాదాపు 22.5 గంటల ప్రయాణం తర్వాత.. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు (అమెరికా సమయం ప్రకారం తెల్లవారుజామున 2.31 గంటలకు) కాలిఫోర్నియాలోని శాన్‌డియాగో తీరానికి సమీపాన పసిఫిక్ మహాసముద్రంలో దిగింది. 3.07 గంటలకు.. తాము బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నామని మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ క్యాప్సూల్ నుంచే రేడియో సందేశం పంపారు. అప్పటికే ఆ ప్రాంతంలో సిద్ధంగా ఉన్న స్పేస్ ఎక్స్ రికవరీ నౌక 'షానన్' సిబ్బంది.. 3.10 గంటలకు పీపీఈ కిట్లు ధరించి చిన్నచిన్న పడవల్లో ఆ క్యాప్సూల్ వద్దకు వెళ్లి ప్రమాదకరమైన వాయువులు ఏవీ లేవని నిర్ధారించుకున్నారు. 3.15 గంటలకు దాన్ని నిదానంగా షానన్ నౌక వద్దకు తీసుకొచ్చారు. 3.30 గంటలకు.. తాళ్ల సహాయంతో క్యాప్సూల్‌ను నౌకలోకి తీసుకెళ్లారు. నిర్ణీత తనిఖీల అనంతరం.. 3.49 గంటలకు గ్రేస్ క్యాప్సూల్ నుంచి తొలుత మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ బయటకు వచ్చారు. 3.52 గంటలకు అందులోంచి శుక్లా బయటకొచ్చారు. తర్వాత మిగతా ఇద్దరూ వచ్చారు. ఇన్ని రోజులుగా రోదసిలో భార రహిత స్థితిలో ఉండడంతో.. వారు నడవడానికి ఇబ్బందిపడ్డారు. క్యాప్సూల్ నుంచి ర్యాంపు మీదుగా నౌకలోకి జారిన ఆ నలుగురినీ అక్కడున్న సిబ్బందే జాగ్రత్తగా పైకి లేపి, నెమ్మదిగా నడిపించుకుంటూ లోపలికి తీసుకెళ్లారు. ఆ సమయంలో వారు నలుగురూ నవ్వుతూ, చేతులు ఊపుతూ వెళ్లారు. అక్కడ ముందే సిద్ధంగా ఉన్న వైద్యులు.. రోదసి నుంచి తిరిగి వచ్చే వ్యోమగాములకు చేసే వైద్యపరీక్షలన్నీ వారికి చేశారు. అనంతరం వారిని హెలికాప్టర్‌లో తీరానికి తీసుకొచ్చారు. భూమ్మీద జీవనానికి అలవాటుపడడానికి వీలుగా వారం రోజులపాటు వారిని పునరావాస కేంద్రంలో ఉంచనున్నారు.


డ్రాగన్ క్యాప్సూల్ నుంచి బయటకు వస్తున్న శుభాన్షు శుక్లా

### 310 భూప్రదక్షిణలు

ఐఎస్ఎస్‌లో ఉన్న 18 రోజుల్లో శుభాన్షు శుక్లా బృందం భూమి చుట్టూ 310 ప్రదక్షిణలు చేసింది. 300కు పైగా సూర్యోదయాలను, సూర్యాస్తమయాలను చూసింది. మొత్తం 1.3 కోట్ల కిలోమీటర్లు ప్రయాణించింది. 1.3 కోట్ల కిలోమీటర్లంటే.. భూమికి, చంద్రుడికి మధ్య ఉన్న దూరానికి 33 రెట్ల దూరంతో సమానం.

### ఆనందబాష్పాలు..

డ్రాగన్ క్యాప్సూల్ రాకను లైవ్‌లో వీక్షించిన శుక్లా కుటుంబసభ్యులు.. అది సురక్షితంగా పసిఫిక్ మహాసముద్రంలో దిగగానే కరతాళ ధ్వనులతో తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఆ సమయంలో శుభాన్షు తల్లి ఆశా శుక్లా, తండ్రి శంభు దయాళ్ శుక్లా, సోదరి శుచి మిశ్రా ఆనందంతో కంటతడి పెట్టారు. "మా అబ్బాయి క్షేమంగా తిరిగొచ్చాడు. ఇందుకు దేవుడికి కృతజ్ఞతలు" అని ఆశా గద్గద స్వరంతో చెప్పారు. డ్రాగన్ క్యాప్సూల్ తిరుగుప్రయాణం మొదలవగానే.. తాము ఆంజనేయ స్వామి గుడికి వెళ్లామని, అక్కడ సుందరకాండ పారాయణ చేశామని ఆమె అంతకు ముందు మీడియాకు తెలిపారు. చరిత్రలో తనదంటూ ఒక పేరు లిఖించుకున్న తమ కుమారుణ్ని చూసి గర్విస్తున్నామని చెప్పారు. ఇక.. భూమ్మీదికి తిరిగొచ్చిన శుక్లా బృందానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హృదయపూర్వక స్వాగతం పలికారు. శుభాన్షు శుక్లా క్షేమంగా భూమికి తిరిగి రావడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. దేశప్రజలందరితో కలిసి తాను కూడా ఆయనకు స్వాగతం పలుకుతున్నానని చెప్పారు. శుక్లా తన అంకితభావం, ధైర్యసాహసాలతో కోట్లాదిమంది కలలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. భారతదేశం తలపెట్టిన మానవ సహిత రోదసియాత్ర గగన్‌యాన్ దిశగా ఈ మిషన్‌ను కీలక మైలురాయిగా పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జితేంద్ర సింగ్ తదితరులు శుక్లా క్షేమంగా తిరిగి రావడం పట్ల సంతోషం వెలిబుచ్చారు. ఇది దేశప్రజలందరికీ గర్వకారణమైన ఘట్టమని పేర్కొన్నారు. దేశ గౌరవాన్ని శుక్లా ఇనుమడింపజేశారని.. మన వ్యోమగాములు, శాస్త్రవేత్తల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారని అమిత్ షా ప్రశంసించారు. శుక్లా రోదసిలోకి వెళ్లడమే కాక.. భారతదేశ ఆకాంక్షలను కొత్త ఎత్తులకు తీసుకెళ్లారని రాజ్‌నాథ్ కొనియాడారు. ఇక.. ఈ మిషన్‌లో భాగంగా అనుకున్న ప్రణాళిక ప్రకారం శుభాన్షుశుక్లా ఐఎస్ఎస్‌లో ఏడు ప్రయోగాలు నిర్వహించినట్టు ఇస్రో వెల్లడించింది.

## నిమిషప్రియ మరణశిక్ష వాయిదా

న్యూఢిల్లీ, జూలై 15: యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిషప్రియకు ఊరట లభించింది. మరణ శిక్ష అమలును యెమెన్ ప్రభుత్వం వాయిదా వేసినట్లు భారత విదేశాంగ వర్గాలు మంగళవారం వెల్లడించాయి.వాస్తవానికి నిమిషప్రియకు బుధవారం మరణ దండనను అమలు చేయాల్సి ఉండగా.. చివరిక్షణంలో దీన్ని వాయిదా వేసినట్లు తెలిపాయి. హతుడి కుటుంబ సభ్యులతో పరస్పర ఆమోదయోగ్య పరిష్కారం చేసుకోవడానికి నిమిషప్రియ కుటుంబ సభ్యులకు మరికొంత సమయం ఇవ్వాలంటూ భారత ప్రభుత్వం యెమెన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతూనే ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఆ ప్రయత్నాల వల్లే, స్థానిక అధికారులు నిమిషప్రియ మరణ శిక్షను వాయిదా వేసినట్లు వివరించాయి. దీనిపై ఆమె భర్త టామీ థామస్ హర్షం వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం, ఇతర సంస్థలు చేసిన ప్రయత్నాల వల్లే ఇది సాధ్యమైందని అన్నారు.

## 5 ఏళ్లు దాటాక పిల్లల ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

- 7 ఏళ్లు దాటినా చేయకపోతే డీ యాక్టివేట్

బాల ఆధార్ తీసుకున్న పిల్లలు ఐదేళ్ల తర్వాత తప్పనిసరిగా వేలిముద్రలు, కనుపాపలు, ఫొటో అప్‌డేట్ చేయాలని, లేకపోతే వారి ఆధార్ డీ యాక్టివేట్ అవుతుందని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ పేర్కొంది. ఐదేళ్ల లోపు పిల్లలకు బయోమెట్రిక్, ఐరిస్ అవసరం లేకుండా కేవలం ఫొటో మాత్రమే తీసుకొని యూఐడీఏఐ బాల ఆధార్ ఇస్తోంది. అటువంటి పిల్లలు ఏడేళ్ల దాటక మునుపే తప్పనిసరి వారి బయోమెట్రిక్, ఐరిస్, ఫొటోను వారి దగ్గరలోని ఆధార్ కేంద్రాలలో అప్‌డేట్ చేసుకోవాలని వారి ఆధార్‌లో నమోదై ఉన్న ఫోన్ నెంబర్‌కు యూఐడీఏఐ సందేశాలు పంపించింది. ఐదు నుంచి ఏడేళ్ల లోపు పిల్లలు ఆధార్ అప్‌డేట్ చేసుకుంటే ఉచితమని, ఏడేళ్లు దాటిన పిల్లలకు రూ.100 చెల్లించాలని తెలిపింది.

## బోయింగ్ విమానాల్లో ఇంధన మీటపై.. ముందే హెచ్చరించిన యూకే

న్యూఢిల్లీ, జూలై 15: అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి ఇంధన నియంత్రణ మీటలో లోపాలే కారణమని తేలిన నేపథ్యంలో.. యూకేకు చెందిన పౌర విమానయాన సంస్థ(సీఏఏ) కీలక ప్రకటన చేసింది. ఆ ప్రమాదానికి నాలుగు వారాల ముందే ఇంధన మీటల విషయంలో హెచ్చరికలను జారీ చేసినట్లు గుర్తుచేసింది. 787 డ్రీమ్‌లైనర్ సహా.. ఐదు రకాల బోయింగ్ విమానాల్లో ఇంధన మీటలపై మే 15న ఓ నోటీసును జారీ చేసినట్లు వివరించింది. అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) నిర్వహించిన ఎయిర్ వర్తీనెస్ డైరెక్టివ్(ఏడీ)లో కూడా ఆయా విమానాల్లో ఇంజన్ ఇంధన 'షటాఫ్ వాల్వ్ యాక్టివేటర్స్' గురించి హెచ్చరికలు జారీ అయినట్లు తెలిపింది. ఈ వాల్వ్‌లకు రోజువారీ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించినట్లు పేర్కొంది.

## రూ.60వేల కోట్లతో 1000 ఐటీఐల పునర్వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ, జూలై 15: దేశవ్యాప్తంగా కల 3,000 ఐటీఐల్లో వెయ్యి ఐటీఐలను పునర్వ్యవస్థీరిస్తామని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఎంత్రపెన్యూర్‌షిప్ శాఖ మంత్రి జయంత్ చౌదరి చెప్పారు. ఇందు కోసం రూ.60 వేల కోట్ల నిధులను కేటాయించాలని గత మే నెలలో జరిగిన క్యాబినెట్ సమావేశం నిర్ణయించిందని మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్యాభివృద్ధి దినోత్సవం సందర్భంగా మీడియాకు తెలిపారు. ఐటీఐల నిర్వహణకు 2018లో నూతన మార్గదర్శకాలు జారీ చేసిన తర్వాత.. గత ఆరేళ్లలో ఆయా సంస్థల్లో 4.5 లక్షల సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వ స్ఫూర్తి నింపేందుకే ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు జయంత్ చౌదరి తెలిపారు. రెండేళ్లుగా తీసుకున్న చర్యలతో 2024లో ఐటీఐల్లో అడ్మిషన్లు 11% పెరిగాయన్నారు. ఐటీఐల అప్‌గ్రేడేషన్ విషయమై రాష్ట్రాలతో కలిసి పని చేయాల్సి ఉంటుందన్నారు.

# 'నాన్ వెజ్' పాలకు నో!

**భారత్, అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఓ కొలిక్కి?**

- చాలా వరకు భారత ఉత్పత్తులపై 10% కనీస సుంకం.. కొన్నింటిపై కాస్త అధికం
- అమెరికా నుంచి వచ్చే ఉత్పత్తులపై 5 నుంచి 8 శాతం వరకు భారత్ సుంకాలు

న్యూఢిల్లీ, జూలై 15: ట్రంప్ సుంకాల గోల వేళ భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి రంగం సిద్ధమైంది. ఇరుదేశాల మధ్య సుదీర్ఘంగా జరుగుతున్న చర్చలు తాజాగా ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. చాలా వరకు ఉత్పత్తుల విషయంలో ఇంతకుముందే పరస్పరం సానుకూలత వ్యక్తమైనా.. వ్యవసాయ, పాడి ఉత్పత్తులకు అనుమతి, సుంకాల తగ్గింపుపై భారత్ గట్టి నిలబడింది. భారత్‌లో ఈ రంగాలపై ఆధారపడిన కోట్లాది మంది ప్రయోజనాలు దెబ్బతింటాయని స్పష్టం చేసింది. ముఖ్యంగా అమెరికా నుంచి 'నాన్ వెజ్' పాల దిగుమతిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని పేర్కొంది. అమెరికాలో ఆవులు, గేదెలకు కోళ్లు, చేపలు, ఇతర పశువులకు సంబంధించి వ్యర్థ భాగాలు, కొవ్వులతో తయారు చేసిన పదార్థాలను ఆహారంగా వేస్తుంటారు. భారత్‌లో పాలను శాఖాహారంలో భాగంగా తీసుకుంటారు. ఈ క్రమంలో జంతు పదార్థాలను తినే ఆవులు, గేదెల నుంచి వచ్చే 'నాన్ వెజ్' పాలు, పాల పదార్థాలు ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధమని భారత్ వాదించింది. ఈ క్రమంలో కేవలం ప్రాసెస్ చేసిన పాడి ఉత్పత్తుల దిగుమతులకే అంగీకరించింది. వాటిపైనా 'జంతు సంబంధిత ఆహారం' వాడలేదనే ధ్రువీకరణ తప్పనిసరి అని స్పష్టం చేసింది. అమెరికా నుంచి పాలు, పాల పదార్థాల దిగుమతికి గేట్లు తెరిస్తే.. భారత్‌లోని రైతులకు ఏటా రూ.1.03 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతుందని ఎస్‌బీఐ తాజా నివేదికలో అంచనా వేసింది.

### భారత్‌పై 11.5శాతం..అమెరికాపై 7%


భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ఇరుదేశాల ఉన్నతాధికారులు కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నారు. వాణిజ్యం, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి నేతృత్వంలోని భారత బృందం పలుమార్లు అమెరికాలోని వాషింగ్టన్ వెళ్లి చర్చలు జరిపింది. ఈ క్రమంలో మధ్యంతర ఒప్పందానికి తుదిరూపం వచ్చినట్టు సమాచారం. దీనిపై ఇరుదేశాల ఉన్నతాధికారులు వారం, పది రోజుల్లో సంతకాలు చేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు ప్రచురించింది. ఆ వివరాల ప్రకారం...



- చాలా వరకు భారత ఉత్పత్తులపై 10% కనీస సుంకానికి భారత్ అంగీకరించింది. అయితే కొన్ని రకాల ఉత్పత్తులపై గంపగుత్తగా కాకుండా.. కాస్త తక్కువ, ఎక్కువగా వేయాలని ప్రతిపాదించింది. దీనికి అమెరికా అంగీకరించడంతో భారత్‌పై సుంకాలు సగటున 11.5 శాతం అవుతాయని అంచనా. అమెరికా నుంచి వచ్చే ఉత్పత్తులపై భారత సుంకాలు 5-8 శాతం వరకు.. సగటున 7% ఉంటాయని అంచనా.
- యాపిల్స్, బ్లూబెర్రీస్, బ్లాక్ బెర్రీస్, కొన్ని రకాల ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలతోపాటు, పలు అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు భారత్ అంగీకరించింది. అయితే జన్యుమార్పిడి ఉత్పత్తులకు మాత్రం ఎట్టిపరిస్థితుల్లో అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

# సావర్కర్ గురించి తెలుసుకోవాలని రాహుల్‌ను ఆదేశించలేం!

- పిటిషనర్ దాఖలు చేసిన పిల్‌ను చదవాలని ఆయనకు సూచించలేం
- బాంబే హైకోర్టు స్పష్టం..పిల్ కొట్టివేత


లఖ్‌నవూలోని ప్రజాప్రతినిధుల కోర్టులో రాహుల్

ముంబై, జూలై 15: విపక్షనేత రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా దాఖలైన ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని బాంబే హైకోర్టు కొట్టివేసింది. హిందూత్వ సిద్ధాంతకర్త వినాయక్ సావర్కర్ గురించి రాహుల్ పరిపక్వత లేని, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేశారని, తద్వారా పిటిషనర్ హక్కులను ఉల్లంఘించారని ఆరోపిస్తూ కోర్టులో 'అభినవ్ భారత్ కాంగ్రెస్' వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్ ఫడ్నిస్ పిల్ దాఖలు చేశారు. సావర్కర్‌పై రాహుల్‌కు ఉన్న జ్ఞాన శూన్యతను తొలగించుకునేందుకుగాను పిటిషన్‌ను చదవాలంటూ ఆయన్ను ఆదేశించాలని పిల్‌లో పంకజ్ కోరారు. ఈ వ్యాజ్యాన్ని మంగళవారం బాంబే హైకోర్టు విచారించింది. సావర్కర్ గురించి అజ్ఞానాన్ని తొలగించుకునేందుకు పిల్‌లోని కంటెంట్‌ను చదవాలని రాహుల్ గాంధీని ఎలా ఆదేశించగలం? అని పిటిషనర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. రాహుల్ భవిష్యత్తులో ప్రధాని అయితే విధ్వంసం సృష్టిస్తారని పిల్‌లో పంకజ్ ఆరోపించారు. దీనికి ధర్మాసనం.. "మాకైతే తెలియదు. రాహుల్ ప్రధాని అవుతారని మీకు తెలుసా?" అని ప్రశ్నించింది. ఇదిలా ఉండగా, పరువు నష్టం దావాలో రాహుల్‌కు లఖ్‌నవూలోని స్థానిక ఎంపీ-ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆయన స్వయంగా అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు అలోక్ వర్మ ముందు హాజరయి బెయిల్ పత్రాలను సమర్పించారు. వరుసగా అయిదు వాయిదాలకు హాజరు కాకపోవడంతో కోర్టు వారెంటు జారీ చేసింది. దాంతో ఆయన కోర్టుకు స్వయంగా హాజరయి బెయిల్ పత్రాలను అందజేశారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా 2022లో రాహుల్ మీడియాతో మాట్లాడుతూ "భారత్ జోడో యాత్ర ఎందుకని అడిగేవారు చైనా సైనికులు మన సైనికులను ఎందుకు కొట్టారని ఒక్కసారి కూడా అడగడం లేదు" అని వ్యాఖ్యానించారు. అయితే, దెబ్బలు తిన్నారనడం భారత సైనికులను అవమానపరచడమేనని పేర్కొంటూ బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాత్సవ పరువు నష్టం దావా వేశారు.

ఖరీదైన ఆహారం ఖైదీల

## ప్రాథమిక హక్కేమీ కాదు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ


న్యూఢిల్లీ, జూలై 15: జైళ్లలో ఖైదీలకు ఖరీదైన, ఇష్టమైన ఆహారం పెట్టకపోవడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందికి రాదని మంగళవారం సుప్రీంకోర్టు తెలిపింది. వికలాంగులైన ఖైదీలకు కూడా ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఖరీదైన ఆహారం, తమ కోసం ప్రత్యేకంగా చేసే ఆహారం కావాలని ఖైదీలు డిమాండు చేయలేరని ధర్మాసనం తెలిపింది. ప్రతి ఖైదీకి తగినంత, బలవర్ధకమైన, ఆరోగ్యకరమైన ఆహారం పెట్టడం వరకే ప్రభుత్వాల బాధ్యత ఉంటుందని పేర్కొంది. ఆస్తి వివాదంలో జైలు శిక్ష అనుభవిస్తున్న న్యాయవాది ఎల్.మురుగనాథం చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తాను బెకర్ మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధితో బాధపడుతున్నానని, ప్రతి రోజూ తనకు ప్రొటీన్లు అధికంగా ఉండే గుడ్లు, మాంసం ఇవ్వాలని ఆయన కోరారు.

## స్వర్ణ మందిరానికి బాంబు బెదిరింపు

అమృత్‌సర్, జూలై 15: సిక్కుల పవిత్ర స్థలం స్వర్ణ మందిరంపై బాంబు దాడులు చేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి హెచ్చరికలు వచ్చాయి. 24 గంటలకన్నా తక్కువ వ్యవధిలో ఈ-మెయిళ్లు రావడంతో అధికారులు అప్రమత్తమయి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ రెండు ఈ-మెయిళ్లలోనూ ఆర్‌డీఎక్స్ వినియోగం, పేలుడు సంభవించే సమయాన్ని ప్రస్తావించారు. దీనిపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# ఆధ్యాత్మికతతో కాదు.. ప్రకృతిపై ప్రేమతో..

- అడవిలో మేము సంతోషంగానే ఉన్నాం
- 20 దేశాల్లో అలాగే గడిపాం: రష్యా మహిళ నీనా


ఇద్దరు పిల్లలతో రష్యా మహిళ నీనా

బెంగళూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో జీవించేందుకు తాను ఇష్టపడతానని రష్యా మహిళ నీనా కుటీనా(40) తెలిపారు. తాను, తన ఇద్దరు పిల్లలు ప్రకృతిలో సంతోషంగా ఉన్నామని, అయితే తమ గురించి మీడియాలో తప్పుగా ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. ఆధ్యాత్మికత ప్రేరణతోనే తాను ఇలా చేస్తున్నానని అనడం సరికాదని, తాను ప్రకృతిని మాత్రమే ప్రేమిస్తానని ఆమె స్పష్టం చేశారు. ఉత్తర కన్నడ జిల్లా గోకర్ణ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ గుహ వద్ద ఇద్దరు పిల్లలతో నివసిస్తున్న ఆమెను కర్ణాటక పోలీసులు ఇటీవల బయటకు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తుమకూరులోని ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్(ఎఫ్ఆర్ఆర్ఓ)లో ఉంటున్న ఆమె.. ఓ న్యూస్ చానల్‌తో మాట్లాడారు. తన పిల్లలు ప్రాయ(6), అమా(4)తో కలిసి అటవీ ప్రాంతంలోని గుహలో ప్రశాంతంగా గడిపామని అన్నారు. తాను చనిపోదలచుకోలేదని, అలాగే తన పిల్లలను చంపేందుకు ఇక్కడకు తీసుకురాలేదని స్పష్టం చేశారు. తన పిల్లలు అడవిలో చాలా సంతోషంగా గడిపారని అన్నారు. బంకమట్టితో ఎన్నో బొమ్మలు చేశామని, వాటికి రంగులు వేశామని వివరించారు. గ్యాస్ ఉపయోగించే వంట చేశామని తెలిపారు. కొన్నేళ్లుగా తాము 20 దేశాల్లో ఇదే తరహాలో గడిపామని అన్నారు. 2017 నుంచి తాము ఆ గుహలో ఉన్నామనేది అబద్ధమని కొట్టిపారేశారు. పోలీసులకు తమ పాత పాస్‌పోర్ట్‌లు దొరికాయని, వాటిని పరిశీలించలేదని తెలిపారు. తన పెద్ద కుమారుడు మృతిచెందాక వీసా పొందడం సాధ్యం కాలేదని, ఈలోగా భారత్ వీసా గడువు ముగిసిందని తెలిపారు. 2017 తర్వాత నాలుగు దేశాలు తిరిగామని చెప్పారు. తన వద్ద టెలిగ్రాం చానెల్ ఉందని, తాము ఆ గుహలో ఏం చేశామనేది రికార్డు చేసి అందులో పోస్టు చేశామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
## రెవెన్యూ (భూసేకరణ) శాఖ

కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 19(1) మరియు
తెలంగాణ రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి
కలెక్టర్ / అదనపు కలెక్టర్ / రాజస్వ మండలాధికారి కోదాడ
(భూసేకరణ)

**ఫారం - 7**
**(రూఢీ ప్రకటన)**

జిల్లా కలెక్టర్ సూర్యాపేట ఫైల్ నెం.ఇ/763/2025 తేది.10.07.2025
రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నెం.ఎ/419/2025 తేది.08.07.2025
కోదాడ
గెజిట్ నెం.32/2025 తేది.10.07.2025

తెలంగాణ ప్రభుత్వం, సూర్యాపేట జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు R-9 లిఫ్ట్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ & సి.ఏ.డి. ఇరిగేషన్ డివిజన్ నెం.4 కోదాడ, సూర్యాపేట జిల్లా గారు మునగాల గ్రామము మరియు మండలం ఇచ్చిన రిక్విజేషన్ లేఖ సంఖ్య ఇఇ/ఐడి4/కోదాడ/ఏఇఇ(టి)/2024-25/83 యం. తేది. 29.03.2025 ప్రకారం ఈ దిగువ షెడ్యూల్ లో నిర్దిష్ట పరచిన సూర్యాపేట జిల్లా, మునగాల గ్రామము మరియు మండలం లోని సర్వే నెంబర్ 98, 102, 286, 288, 289, 306, 307, 308, 325, 326, 324, 323, 322, 359 & 321లలో విస్తీర్ణం యం 3-30.50 గుంటలు భూములు ప్రజా ప్రయోజన నిమిత్తము అనగా మునగాల గ్రామము మరియు మండలం నందు R-9 లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయుటలో భాగముగా హై ప్యావెన్ ఏరియా ఆయకట్టు కోసం ప్రత్యేక ప్రెజర్ మెయిన్ అవసరమైనదని భావించినందున, భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 19(1) అనుసరించి భూసేకరణ నిమిత్తము రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరావాస పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణ సవరణ చట్టం) 2016 చట్టం 21 ఆఫ్ (2017) ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 (చాప్టర్ (2)లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్ 3 - ప్రకారం సెక్షన్ 10-A ఆహారభద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.

కావున సూర్యాపేట జిల్లా, మునగాల గ్రామము & మండలం పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 98, 102, 286, 288, 289, 306, 307, 308, 325, 326, 324, 323, 322, 359 & 321లలో విస్తీర్ణం యం 3-30.50 గుంటలు భూమి R-9 లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు అవసరమైనదని ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

**గ్రామం: మునగాల** **మండలం: మునగాల** **జిల్లా: సూర్యాపేట**

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | భూమి స్వభావం రకము | భూమి రకము | సేకరించు విస్తీర్ణం | పట్టాదారు పేరు / ఆసక్తి గల వ్యక్తుల పేరు / చిరునామా | అనుభవదారు | సరిహద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు/నిర్మాణాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | | | | 9 |
| 1 | 98 | పట్టా | ఖుష్కి | 0-18.50 | వాగిరెడ్డి సైదిరెడ్డి తండ్రి రాంరెడ్డి; కేతావత్ హరిలాల్ తండ్రి రాంజి; కేతావత్ లక్ష్మణ తండ్రి వీర్యా | వాగిరెడ్డి సైదిరెడ్డి తండ్రి రాంరెడ్డి (0-09.50); కేతావత్ హరిలాల్ తండ్రి రామానుజ (0-04.50); కేతావత్ లక్ష్మణుడు తండ్రి వీర్యా (0-04.50) | 99/1 | 95/3 | 286/2 | 102/48 | |
| 2 | 286 | పట్టా | ఖుష్కి | 1-02 | -; చేతం మాణిక్యమ్మ భర్త సత్యనారాయణ రెడ్డి; చేతం లక్ష్మారెడ్డి తండ్రి సత్యనారాయణరెడ్డి; చేతం రామిరెడ్డి తండ్రి సత్యనారాయణ రెడ్డి; చేతం బ్రహ్మానందరెడ్డి తండ్రి కోటి రెడ్డి; చేతం బ్రహ్మానందరెడ్డి తండ్రి కోటి రెడ్డి; చింత అరుణ, భర్త సైది రెడ్డి; చేతం హనుమ రెడ్డి తండ్రి సత్యనారాయణరెడ్డి | కేతావత్ లక్ష్మణుడు తండ్రి వీర్యా (0-01); చేతం మాణిక్యమ్మ భర్త సత్యనారాయణ రెడ్డి (0-07); చేతం లక్ష్మారెడ్డి తండ్రి సత్యనారాయణరెడ్డి (0-18); చేతం రామిరెడ్డి తండ్రి సత్యనారాయణ రెడ్డి (0-07); చేతం బ్రహ్మారెడ్డి తండ్రి కోటిరెడ్డి (0-15); చేతం బ్రహ్మారెడ్డి తండ్రి కోటిరెడ్డి (0-30); చింత రమణ, భర్త సైదిరెడ్డి (0-05); చేతం హనుమ రెడ్డి తండ్రి సత్యనారాయణ రెడ్డి (0-05) | 286/1 | 286/4 | 287 | 285 | |
| 3 | 102 | పట్టా | ఖుష్కి | 0-07 | - | పోతిరెడ్డి అచ్చమ్మ భర్త వెంకట్ రెడ్డి (0-07) | 98/1 | 102/4 | 93/2 | 102/1 | |
| 4 | 288 | పట్టా | ఖుష్కి | 0-30 | చేతం వీరమ్మ, భర్త హనుమాన్ రెడ్డి; -; -; చేతం వీరారెడ్డి తండ్రి లింగారెడ్డి; -; -; గుండాలపల్లి గోపాల్ రెడ్డి తండ్రి వెంకటరెడ్డి | చేతం వీరమ్మ భర్త వెంకట్ రెడ్డి (0-06.50); గుండ్లపల్లి శంకర్ కుమార్ తండ్రి గోపాల్ రెడ్డి (0-03); చేతం పద్మమ్మ, భర్త లింగారెడ్డి (0-08); చేతం వీరారెడ్డి, తండ్రి లింగారెడ్డి (0-02); మారగాని వెంకటేశ్వర్లు తండ్రి సర్వయ్య (0-01.50); గుండం కృష్ణారెడ్డి తండ్రి రంగారెడ్డి (0-01); గుండాలపల్లి గోపాల్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి (0-08) | 288/3 | 288/1 | 286/3 | 289/3 | |
| 5 | 289 | పట్టా | ఖుష్కి | 0-09 | చేతం గోవింద రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి; గుండం కృష్ణా రెడ్డి తండ్రి రంగారెడ్డి | చేతం గోవిందరెడ్డి తండ్రి వెంకటరెడ్డి (0-05); గుండం కృష్ణా రెడ్డి తండ్రి రంగారెడ్డి (0-04) | 289/3 | 289/1 | 288/2 | 290 | |
| 6 | 306 | పట్టా | ఖుష్కి | 0-11 | గుండ్లపల్లి శంకరకుమారి భర్త గోపాలరెడ్డి | గుండ్లపల్లి శంకర కుమారి, భర్త గోపాల రెడ్డి (0-11) | 306/3 | 306/1 | 306/3 | 306/1 | |
| 7 | 307 | పట్టా | ఖుష్కి | 0-03.50 | గుండ్లపల్లి నాగమణి భర్త గరువరెడ్డి | గుండ్లపల్లి నాగమ్మ భర్త గరువ రెడ్డి (0-03.50) | 307/3 | 307/1 | 308/1 | 307/1 | |
| 8 | 308 | పట్టా | ఖుష్కి | 0-08 | -; తొగరు సీతారాములు, తండ్రి సైదయ్య; చేతం వర్షమ్మ, భర్త వెంకట్ రెడ్డి | గోపిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి (0-01); తొగరు సీతారాములు తండ్రి సైదయ్య (0-04); చేతం వర్షమ్మ భర్త వెంకట్ రెడ్డి (0-03) | 308/1 | 308/3 | 308/1 | 307/1 | |
| 9 | 325 | ప్రభుత్వ | ఖుష్కి | 0-01 | ప్రభుత్వ భూమి | ప్రభుత్వ భూమి (బంజర్) | 308/1 | 324/1 | 325/1 | 326/1 | |
| 10 | 326 | ప్రభుత్వ | ఖుష్కి | 1-03.50 | ప్రభుత్వ భూమి | ప్రభుత్వ భూమి (బంజర్) | 308/1 | 324/3 | 325/1 | 326/1 | |
| 11 | 321 | ప్రభుత్వ | ఖుష్కి | 0-03 | ప్రభుత్వ భూమి | అర్ అండ్ బి రోడ్డు (ప్రభుత్వ భూమి) | 321/1 | 321/2 | 317 | 359/1 | |
| 12 | 322 | పట్టా | ఖుష్కి | 0-08.50 | [illegible]; - | [illegible] (0-06); [illegible] (0-02.50) | 323 | 322/1 | 322/3 | 322/1 | |
| 13 | 323 | పట్టా | ఖుష్కి | 0-06.50 | ఉప్పుల సుశీల భర్త ప్రతాప్ రెడ్డి; దేవరం వెంకట్ రెడ్డి తండ్రి రామయ్య; యలక నారిరెడ్డి తండ్రి లచ్చయ్య | ఉప్పుల సుశీల భర్త ప్రతాపరెడ్డి (0-04); దేవరం వెంకట్ రెడ్డి తండ్రి నారిరెడ్డి (0-02.50); యలక నారిరెడ్డి, తండ్రి లచ్చిరెడ్డి (0-02) | 324/1 | 322 | 320 | 308 | |
| 14 | 324 | పట్టా | ఖుష్కి | 0-10 | గుండ్లపల్లి వెంకట నారాయణరెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి; గుగులోతు రామకోటి, తండ్రి మస్య | గుండ్లపల్లి వెంకట నారాయణరెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి (0-07); గుగులోతు రామ కోటి తండ్రి మంగ్య (0-03) | 325/1 | 324/3 | 224/1 | 324/3 | |
| | మొత్తం | | | 3-30.50 | | | | | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూ సేకరణ పై వచ్చిన అభ్యంతరాలు పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు రానందున పునరావాసం కల్పించుటలేదు

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, ప్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూ సేకరణ చేయు భూములు యొక్క నమూనా భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి కోదాడ లేదా కలెక్టర్ కార్యాలయం నందు కార్యాలయపు పనివేళల నందు చూసుకొనవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి కోదాడ | సం/- అదనపు కలెక్టర్ సూర్యాపేట | సం/- జిల్లా కలెక్టర్ సూర్యాపేట

DIPR RO. NO.386/LA-PP/ADVT/PUBLICATION/2025-26

# కాంగ్రెస్‌వి రిజర్వేషన్ రాజకీయాలు

## బీసీల ఓటు బ్యాంకు కోసం నాటకాలు.. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ సర్కార్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- అత్యధిక జడ్పీల్లో గెలుపే లక్ష్యం: కిషన్‌రెడ్డి



అవుశాపూర్ సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

హైదరాబాద్/ఘట్‌కేసర్ రూరల్/కోదాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ పేరుతో ప్రజల చెవిలో పువ్వు పెట్టే ప్రయత్నం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఓటు బ్యాంకు కోసమే కాంగ్రెస్ రిజర్వేషన్ నాటక మాడుతోందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు అందులో 10 శాతం మతపరమైన రిజర్వేషన్లను కలపాలని చూస్తోందని.. ఇది బీసీలకు వ్యతిరేక చర్య అని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగాల్లో మతపరమైన 4 శాతం రిజర్వేషన్లను బీజేపీ గతంలోనే వ్యతిరేకించిందని గుర్తుచేశారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మునిసిపాలిటీ పరిధిలోని అవుశాపూర్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత కోసం మంగళవారం నిర్వహించిన పార్టీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో రాంచందర్‌రావు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే, కాంగ్రెస్ సర్కారు కూడా అవినీతి, ప్రజావ్యతిరేక పాలనను కొనసాగిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వాలు పంచాయతీ వ్యవస్థలను నిర్వీర్యం చేశాయని మండిపడ్డారు. పార్టీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు కదలాలంటే నాయకులు కలిసికట్టుగా ముందు కెళ్లాలన్నారు. బీజేపీ ప్రభుత్వం రావాలన్న ఆకాంక్ష ప్రజల్లో ఉందని, ఇప్పుడు కూడా పార్టీ సిద్ధం కాకపోతే పొరపాటు నాయకులదేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై ఈ నెల 18 నుంచి 20 వరకు జిల్లా స్థాయి, 21 నుంచి 23 వరకు మండల స్థాయి వర్క్‌షాప్‌లు.. 25, 26 తేదీల్లో పోలింగ్ బూత్ బైఠక్‌లు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అత్యధిక జిల్లా పరిషత్‌లు కైవసం చేసుకునేందుకు పార్టీ నేతలంతా ఐక్యంగా పనిచేయాలని కోరారు. సమష్టిగా పని చేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని పార్టీ నేతలకు ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్న వారినే ప్రజలు గెలిపిస్తారని ఆయన పేర్కొన్నారు.

### వ్యక్తిగత దూషణలు సరికాదు

రాజకీయ నాయకులు వ్యక్తిగత దూషణలకు దిగకుండా విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను మంగళవారం సూర్యాపేట జిల్లా కోదాడలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

### భట్టికి రాంచందర్‌రావు లీగల్ నోటీసు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రాంచందర్‌రావు లీగల్ నోటీసులిచ్చారు. రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై భట్టి చేసిన వ్యాఖ్యలను రాంచందర్‌రావు తీవ్రంగా పరిగణించారు. తనపై నిరాధార ఆరోపణలు చేసినందుకు 3 రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రూ.25 కోట్లకు పరువునష్టం దావా వేస్తానని, క్రిమినల్ కేసులూ ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

# బిల్లులు రాక మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలింపు.. పరిస్థితి విషమం
- కరీంనగర్ జిల్లా లక్ష్మీదేవిపల్లిలో ఘటన





ఆస్పత్రిలో రవి, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి

గంగాధర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల బిల్లులు ఏళ్ల తరబడి నిలిచిపోవడంతో మనస్తాపానికి గురైన మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ తాళ్ల విజయలక్ష్మి తన పదవీ కాలంలో అప్పులు చేసి గ్రామంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లను నిర్మించారు. వాటికి సంబంధించిన రూ.11 లక్షల బిల్లులు ప్రభుత్వానికి సమర్పించి మూడున్నరేళ్లు గడిచినా మంజూరు చేయడంలేదు. అప్పులిచ్చిన వారు అడుగుతుండడంతో గతంలో పది గుంటల భూమితో పాటు బంగారాన్ని కుదువపెట్టి విజయలక్ష్మి కొందరికి చెల్లించారు. మిగతా అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో ఆందోళన చెందిన సర్పంచ్ విజయలక్ష్మి భర్త రవి సోమవారం గడ్డి మందు గుళికలు మింగారు. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, అప్పులు, మరో వైపు వడ్డీలు కట్టలేక తన భర్త మనోవేదనతో ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని, ప్రభుత్వం తమ బాధలు అర్థం చేసుకుని పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజయలక్ష్మి కోరారు.



తెలంగాణ ప్రభుత్వం
**పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం, పిఆర్ డివిజన్ : ఆర్మూర్

NIT No.105 to 175/2025-26 | **ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన** | తేది: 15.07.2025

**మొత్తం పనులు:** (71) పనుల పేర్లు: నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ ప్రదేశాలలో సీసీ రోడ్లు మరియు డ్రైన్ల నిర్మాణం కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి - మొత్తం ECV: రూ.345.00 లక్షలు. టెండరుదారులు టెండరు షెడ్యూలును 22.07.2025 ఉ.10.30 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు చివరి తేదీ ప్రతీ NIT ఆన్‌లైన్‌లో ప్రచురణ తేదీ నుండి (7) పనిరోజులు. తదుపరి వివరాలను ఆన్‌లైన్‌లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పిఆర్ డివిజన్, ఆర్మూర్
DIPR RO No.5039PP/CL/ADVT/1/2025-26, Dt. 15.07.2025





# విద్యా రంగం, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గిస్తూ విద్యను ఉద్యోగయోగ్యంగా మార్చడంలో విప్లవాత్మక మార్పు తీసుకువస్తున్న "ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టిస్"

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు మారిపోతున్నాయి. ఉద్యోగాల స్వభావం, అవసరమైన నైపుణ్యాలూ వేగంగా మారుతున్నాయి. భారత్ లాంటి దేశంలో ఇది మరింత కీలకం. ఎందుకంటే ప్రతి సంవత్సరం 1 కోటి నుంచి 1.2 కోట్ల యువత ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. ఈ 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' మనకు గొప్ప అవకాశమే. కానీ ఈ అవకాశాన్ని దేశ అభివృద్ధిగా మలచుకోవాలంటే, విద్యా వ్యవస్థే కీలకం. విద్యార్థులు కొత్త అవకాశాలకు సిద్ధంగా ఉండేలా శిక్షణ ఇవ్వగలిగితేనే అది సాధ్యమవుతుంది. 2030 నాటికి భారత్‌ను 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే, ఆ లక్ష్యాన్ని చేరగల నైపుణ్యాలతో కూడిన యువతరం అవసరం.

భారతదేశంలో ఉద్యోగయోగ్యతపై తాజా గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. వీబాక్స్ సంస్థ, ఏఐసిటిఈ, సిఐఐ, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సహకారంతో విడుదల చేసిన ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2025 ప్రకారం 2019 లో 47.28 శాతం ఉన్న ఉద్యోగయోగ్యత శాతం 2025 నాటికి 54.81కి చేరింది. ఇది కొంత పురోగతే. కానీ ఇంకా 45 శాతానికి పైగా లోటు ఉంది. అంటే అనేక మంది పట్టభద్రులలో పరిశ్రమలకు అవసరమైన ప్రాక్టికల్ నైపుణ్యాలు ఉండడం లేదు. వారికి ఇండస్ట్రీ అనుభవం దొరకడం లేదు. అందుకే ఆధునిక ఉద్యోగాలకు సరిపడే నైపుణ్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక పాత విద్యా విధానాలు వేగంగా మారుతున్న టెక్నాలజీ, పరిశ్రమ అవసరాలకు తగినట్టుగా మారలేకపోతున్నాయి.

మన విద్యార్థులు పాఠాలు బాగా చదవడమే కాదు, జీవితంలో ముందుకు వెళ్లేందుకు అవసరమైన ఇండస్ట్రీ రెడీ నైపుణ్యాలు కూడా కలిగి ఉండాలంటే మనం ఏం చేయాలి?

2020 లో తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం, విద్యార్థుల్ని ఉద్యోగాల అవసరాలకు తగ్గట్టు తయారు చేయాలంటే స్కిల్ బేస్డ్ లెర్నింగ్ ని మరియు విద్యా సంస్థలను పరిశ్రమలతో కలసి పనిచేయమని ప్రోత్సహించింది. దీనినే దృష్టిలో ఉంచుకుని, దేశంలో ఉన్న ఉన్నత విద్య నియంత్రణ సంస్థలు అయిన యూజీసీ, ఏఐసిటిఈ "ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్" మోడల్‌ను ప్రవేశపెట్టాయి. దీనివల్ల పరిశ్రమల అనుభవం నేరుగా తరగతుల్లోకి వస్తుంది. చదువుకి ఉద్యోగానికి మధ్య ఉన్న గ్యాప్ తగ్గే అవకాశం ఉంటుంది.

### ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ అంటే ఏంటి?

ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ అనేది పరిశ్రమల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న నిపుణుల కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన పాత్ర. వీరిని ఉన్నత విద్యా సంస్థలు నియమించుకుంటాయి. వీరు తరగతుల్లో బోధనతో పాటు విద్యార్థులకు కెరీర్ మార్గనిర్దేశం చేస్తారు. వీరి ప్రత్యేకత ఏంటంటే వీరి దగ్గర పరిశ్రమలలో పని చేసిన అనుభవంతో పాటు అధునాతన టెక్నాలజీలలో ప్రాక్టికల్ స్కిల్స్ ఉంటాయి. ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ గా నియమించబడాలంటే పరిశ్రమల్లో గణనీయమైన అనుభవం ఉండాలి. పెద్ద సంస్థల్లో కీలక పదవుల్లో పని చేసిన అనుభవం ఉండాలి. లేకపోతే స్టార్టప్‌లు ప్రారంభించడం, పేటెంట్లు నమోదు చేయడం వంటి ఇన్నోవేషన్ ఫీల్డ్‌లో నిరూపించుకున్నవాళ్ళు కూడా ఈ పాత్రకు అర్హులు. అసోసియేట్ లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ పోస్టులకు కూడా అనుభవానికి తగిన ప్రమాణాలు ఉంటాయి. ముఖ్యంగా ఎవరిని ఎంచుకున్నా, వారు తరగతుల్లోకి అసలైన అనుభవాన్ని తీసుకొచ్చే వాళ్లే అయి ఉండాలి.

ఉదాహరణకు పిహెచ్డీ చేసి, ప్రముఖ టెక్ కంపెనీల్లో పదేళ్లకుపైగా డేటా సైన్స్ అల్గోరిథమ్స్ రూపొందించిన అనుభవజ్ఞుడు 'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్'గా విద్యార్థులకు విలువైన ప్రాక్టికల్ విజ్ఞానం అందించగలడు. అదే విధంగా, కేవలం బి.టెక్ పూర్తిచేసి, ఏడు సంవత్సరాల పాటు మిషన్ లెర్నింగ్ రంగంలో చక్కటి అనుభవం పొందిన ఇంజనీర్ కూడా 'అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్'గా, నేటి తరం టెక్ టాలెంట్‌ని సిద్ధం చేయగలడు. ఇందులో విశేషం ఏంటంటే ఆవిష్కరణకు కూడా గౌరవం ఉంది. ఐదు పేటెంట్లు కలిగి ఉండి, ఏదైనా సంస్థలో (స్టార్టప్ సహా) కనీసం అయిదేళ్లు పని చేసిన ప్రొఫెషనల్‌కు కూడా ఈ అవకాశం లభిస్తుంది. అంటే, సాధించిన పని ముఖ్యం సాంప్రదాయ డిగ్రీలు మాత్రమే కాకుండా.

### ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ ముఖ్య ఉద్దేశాలు, అమలు విధానం

టెక్నికల్ కోర్సులకు సంబంధించి ఏఐసిటిఈ నిబంధనల ప్రకారం, ఒక విద్యాసంస్థలో మొత్తం ఫ్యాకల్టీ పదవులలో 20 శాతం వరకు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్‌గా నియమించవచ్చు. ఇందులో 5 శాతం స్థానాలు మహిళల కోసం ప్రత్యేకంగా కేటాయించారు. ఈ విధానంతో విద్యలో వైవిధ్యాన్ని ప్రోత్సహించడమే కాకుండా పరిశ్రమలలో ఉన్న తాజా అనుభవాన్ని తరగతుల్లోకి తీసుకురావాలన్న లక్ష్యాన్ని స్పష్టం చేస్తుంది. ఇదొక అదనపు అవకాశం మాత్రమే. ఇవి మౌలిక బోధనా సిబ్బందికి బదులుగా కాదు. ఇదిలా ఉండగా, వీరికి పారితోషికాన్ని పరిశ్రమలు లేదా విద్యా సంస్థలు చెల్లించవచ్చు. గౌరవానుకూలంగా పనిచేసే అవకాశాన్ని కూడా కల్పించవచ్చు.

పరిశ్రమల్లో అనుభవం ఉన్న నిపుణులను విద్యా వ్యవస్థలోకి నిర్మితంగా, ఫలితాలపైన దృష్టి పెట్టే రీతిలో తీసుకురావడమే ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ మోడల్ ఉద్దేశం. ఈ విధానంతో విద్యాసంస్థలు పరిశ్రమ నైపుణ్యం కలిగినవారిని తరగతుల్లోకి తీసుకుని విద్యార్థులకు అసలైన ప్రయోజనం కలిగించగలుగుతాయి. ఫలితంగా విద్యా రంగం–పరిశ్రమల మధ్య ఉన్న గ్యాప్ తగ్గుతుంది.



ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ పాత్రలో ఉన్నవారు విద్యా పాఠ్యాంశాల్లో నిజజీవితానికి తగ్గట్టుగా మార్పులు తీసుకువస్తారు. ప్రస్తుతం పరిశ్రమల్లో ఏమవుతోంది? రాబోయే రోజుల్లో ఏం కావాలి? అనే దానికి అనుగుణంగా కోర్సులను తీర్చిదిద్దుతారు. ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి వేగంగా మారుతున్న రంగాల్లో వీరి పాత్ర కీలకం. కేస్ స్టడీలు, ప్రాక్టికల్ అనుభవాల ద్వారా నేర్పే శైలి వీరి ప్రత్యేకత. దాంతో విద్యార్థుల్లో పని చేయగల నైపుణ్యాలు, ఆలోచించే శక్తి పెరుగుతుంది. మార్కెట్‌లో ఎక్కడ లోపాలున్నాయో వారికి స్పష్టంగా తెలుస్తుంది కాబట్టి విద్యార్థుల్లో ఆవిష్కరణలు, స్టార్టప్ ఆలోచనలను ప్రోత్సహిస్తారు. అంతేకాదు పరిశ్రమల్లో వీరికి ఉన్న వారి సంబంధాలు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్‌ల అవకాశాలను పెంచుతాయి. పాఠాలు చెప్పడమే కాకుండా కెరీర్‌లో ఎలా ముందుకు వెళ్లాలి అనే దానిపై తగిన మార్గనిర్దేశం చేస్తారు.

### భవిష్యత్తు ఏంటి?

అకాడెమియా మరియు ఇండస్ట్రీ మధ్య ఉన్న గ్యాప్‌ను తగ్గించేందుకు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ మోడల్ చక్కటి మార్గంగా కనిపిస్తున్నా దీని అమలు మాత్రం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ఆశాజనకంగా ఉన్నప్పటికీ, కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. విద్యాసంస్థల్లో అవగాహన పెంచేందుకు యూజీసీ, ఏఐసిటిఈ తరచూ సెషన్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాయి. ఫ్లెక్సిబుల్ టిమింగ్స్, హైబ్రిడ్ మోడల్స్, పరిశ్రమల సహకారంతో హానరేరియమ్ ఇస్తే, టాప్ ఇండస్ట్రీ నిపుణులు బోధన రంగంలోకి వచ్చేలా తోడ్పడుతాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమల సంస్థలు గ్రాంట్లు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ భాగస్వామ్యాల ద్వారా మరింత ప్రోత్సాహం కల్పించవచ్చు.

దేశ ఆర్థిక పరిస్థితి వేగంగా మారుతున్న నేపథ్యంలో భారత ఉన్నత విద్యా వ్యవస్థలో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ మోడల్ ఒక కీలక మలుపుగా నిలుస్తోంది. దీన్ని పూర్తిస్థాయిలో ప్రయోజనకరంగా మార్చాలంటే, దీన్ని విద్యాసంస్థలు దీర్ఘకాలిక భాగస్వామ్యంగా చూడాలి. ఇలా చేస్తే విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుంది. థియరీ మరియు ప్రాక్టీస్ మధ్య ఉన్న గ్యాప్ తగ్గుతుంది. విద్యార్థులకు, బోధన సిబ్బందికి దీర్ఘకాల ప్రయోజనం ఉంటుంది. ఫలితాలపైనే ఆధారపడే నేటి విద్యా వ్యవస్థలో, పరిశ్రమ అనుభవం గల నిపుణులతో నిర్మితంగా పనిచేయడం వలన విద్యాసంస్థలు బలంగా, పరిశ్రమలకు సన్నద్ధంగా, భవిష్యత్తుపై దృష్టి పెట్టేలా ఎదుగుతాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## చిచ్చురేపిన నివాళి!

'కశ్మీర్ అమరవీరుల దినోత్సవం' సందర్భంగా నివాళులు అర్పించేందుకు నక్షబంద్‌సాహిబ్ స్మశానవాటికకు వెళ్ళిన జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను పోలీసులు అడ్డుకోవడంతో ఆయన గేటుదూకి మరీ లోపలకు పోయిన దృశ్యాలు మాధ్యమాల్లో విస్తృతంగా కనిపిస్తున్నాయి. 22మంది అమరుల సమాధులపై గులాబీరేకులు చల్లి ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ లెఫ్టినెంట్ గవర్నర్‌పై విరుచుకుపడ్డారు. తనను ఆదివారమంతా గృహ నిర్బంధంలో ఉంచారని, సోమవారం కూడా అడ్డుకోవడానికి ప్రయత్నించారని ఆరోపించారు. 'వాళ్ళు' మమ్మల్ని బానిసలు అనుకుంటున్నారు, మా చేతుల్లో జెండా చింపేయాలని కూడా చూశారు అన్నారాయన. ఈ ఉదంతం వెనుక ఉన్న చారిత్రక ఘట్టాలమీద ఎవరి అభిప్రాయాలు, అభ్యంతరాలు వారికి ఉండవచ్చును కానీ, ఓ ముఖ్యమంత్రికి ఇటువంటి పరిస్థితి ఎదురుకావడం అమితాశ్చర్యం కలిగిస్తుంది.

ఒక్కమాటలో చెప్పుకోవాలంటే, గవర్నర్ అనధికారిక ఆదేశాల మేరకు ఆదివారం కశ్మీర్ లోయలో ఆంక్షలు అమలైనాయి. నివాళిని నిలువరించేందుకు లోయలోని నాయకులను గృహనిర్బంధం చేశారు. పోలీసు కాపలాతో పాటు, గేట్లు లాక్‌చేశారు, బారికేడ్లు పెట్టారు, సీసీ కెమెరాల్లో ప్రతీక్షణం పర్యవేక్షిస్తూ, ఏ నాయకుడూ తమ కళ్ళుకప్పి తప్పించుకోవడానికి వీల్లేకుండా చాలాచర్యలు తీసుకున్నారు. ప్రధానంగా ఒమర్ అబ్దుల్లాను బయటకు రానివ్వకుండా మరిన్ని జాగ్రత్తలు పడ్డారు. దీనితో, అసలు రోజున నివాళులర్పించలేక పోవడంతో మర్నాడు వేర్వేరుమార్గాల్లో అబ్దుల్లాలు బయటకువచ్చి అనుకున్నది చేశారు. ఫరూఖ్ అబ్దుల్లా ఆటోలో వచ్చారని, కొందరు మంత్రులు స్కూటర్లువాడారని వార్తలు వచ్చాయి. కబరస్థాన్‌కు పోయే దారులన్నీ అధికారులు మూసేయడంతో, ముఖ్యమంత్రి కొంతదూరం నడిచి, ఆఖరుకు గేటు ఎక్కాల్సివచ్చింది.

గవర్నర్ పెత్తనానికి హద్దూపద్దూ లేకపోతోందనీ, అర్థంపర్థంలేని చర్యలతో అనవసరపు వివాదాలు రేపుతున్నారని ఒమర్ అంటున్నారు. కానీ, కేంద్రప్రభుత్వ దూతగా, తమ ఎజెండాకు అనుగుణంగానే సిన్హా ఈ చర్యకు దిగారు. మహారాజా హరిసింగ్‌కు చెందిన డోగ్రా బలగాలు ఆయన పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నవారిపై కాల్పులు జరిపిన 1931జూలై 13ఘటన కశ్మీర్ చరిత్రలో కీలకమైనది. హరిసింగ్ పాలనకు వ్యతిరేకంగా కశ్మీరీలను కూడగడుతున్న అబ్దుల్ ఖదీర్‌ఖాన్‌ను దేశ ద్రోహం నేరంపై శ్రీనగర్‌జైల్లో విచారిస్తున్నప్పుడు, అక్కడకు చేరిన ఐదు వేలమంది ప్రజలపై సైన్యం కాల్పులు జరిపిన ఈ ఘట్టం తరువాతే హరిసింగ్ ఎన్నికలకు సిద్ధపడ్డారని అంటారు. జూలై 13ను అమరుల దినంగా నిర్వహించే సంప్రదాయాన్ని షేక్ అబ్దుల్లా ఆరంభిస్తే, ఎవరు అధికారంలో ఉన్నా కొనసాగింది. ఆర్టికల్ 370రద్దుతో కశ్మీర్ తన స్వయం ప్రతిపత్తినీ, రాష్ట్రహోదానీ కోల్పోయిన ఈ ఆరేళ్ళకాలంలో నివాళి నిలిచిపోయింది, ప్రభుత్వ అధికారిక సెలవుల జాబితానుంచి కూడా ఆ రోజు తొలగిపోయింది. బదులుగా హరిసింగ్ పుట్టిన రోజునూ, భారతదేశంతో విలీన ఒప్పందం చేసుకున్నరోజునూ సెలవు దినాలుగా చేర్చారు. ఆరేళ్ళతరువాత, ఇప్పుడు పేరుకైనా ఓ ప్రజా ప్రభుత్వం ఉన్నది కనుక, 'బ్రిటిష్‌వారి తొత్తుమీద సామాన్యుడు తిరుగుబాటు చేసిన ఈ సందర్భాన్ని మా జలియన్‌వాలాబాగ్' అంటూ ఈ నాయకులు ఆ నివాళి కార్యక్రమం పునరుద్ధరించేందుకు ప్రయత్నించారు, కేంద్రప్రభుత్వ దూతదానిని అడ్డుకున్నారు.

మరో ఆరేళ్ళలో నూరేళ్ళవుతున్న నేపథ్యంలో, మహారాజా హరిసింగ్‌కు వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని ప్రజల మస్తిష్కాల నుంచి చెరిపివేయాలన్న ఇటువంటి ప్రయత్నాలవల్ల ఫలితం ఉండదు. ఎవరిని స్మరించుకోవాలో, ఎవరిని వదిలించుకోవాలో ప్రజలకు తెలుసు. నివాళిని నిరోధించే ఈ ప్రయత్నం వెనుక భద్రతాకారణాల కంటే, చరిత్రను తిరగరాసే ప్రయత్నం ప్రధానంగా కనిపిస్తున్నది. గతవారం శ్రీనగర్‌లో శ్యామాప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను ఆరంభిస్తూ, రెండేళ్ళపాటు ఆయన సైద్ధాంతిక ప్రచార కార్యక్రమం ప్రభుత్వపరంగా నిర్వహించబోతున్నట్టు ప్రకటించిన గవర్నర్, మరోపక్కన వందేళ్ళనాటి చరిత్రను ప్రజలు మరిచిపోవాలని కోరుకుంటున్నారు. పహల్గాం దారుణాన్ని నివారించక, ఒక యుద్ధానికి పరోక్షంగా కారకుడైన మనోజ్ సిన్హా ఇటువంటి చిన్నాచితకా వివాదాలకు దూరంగా ఉంటే ఆయన పరువుతోపాటు, కేంద్రప్రభుత్వం గౌరవం కూడా నిలబడుతుంది.

# మోదీ వారసుడిపై చర్చ అవసరమా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

డెబ్బైతొమ్మిదేళ్ల ట్రంప్ ఉదయాన్నే ఏ ట్వీట్ చేస్తారా అని ప్రపంచమంతా ఎదురు చూస్తుందని, కొద్ది పదాల్లో ఆయన వెల్లడించే అభిప్రాయాలు ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు, ప్రభుత్వాల విధానాలనూ ప్రభావితం చేస్తున్నాయని విదేశాంగ వ్యవహారాల నిపుణుడు ఒకరు వ్యాఖ్యానించారు. పెద్ద నోట్ల రద్దును ప్రకటించి అరగంటలో భారత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసిన, వ్యవస్థలపై పట్టుబిగించిన నరేంద్రమోదీకి వచ్చే సెప్టెంబర్‌లో 75 ఏళ్లు నిండనున్నాయి. పరిపూర్ణ ఆరోగ్యవంతుడుగా కనిపించే మోదీ గురించి తెలియని భారతీయుడు ఇప్పుడు ఈ దేశంలో ఎక్కడా ఉండడు. అయిదుసార్లు రష్యా అధ్యక్షుడుగా గెలిచిన 74 ఏళ్ల పుతిన్ వర్తమాన ప్రపంచ శక్తిమంతమైన నాయకుల్లో ఒకరు. 75 సంవత్సరాలు ఇప్పటికే నిండిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇవాళ క్వాంటం వ్యాలీ గురించి మాట్లాడుతున్నారు. ప్రభుత్వ విధానాలే దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దుతాయని, 70 సంవత్సరాల వయసులో ప్రధాని అయిన పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు అమలు చేయాలని నిర్ణయించకపోతే ఇవాళ దేశం అభివృద్ధి పథంలో పయనిస్తూ ఉండేది కాదని మంగళవారం చంద్రబాబు ఢిల్లీలో పీవీ స్మారకోపన్యాసం వెలువరిస్తూ చెప్పారు. దేశ రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసేందుకు నాయకుల వయసుతో నిమిత్తం ఉండదని, ప్రజల అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగా నాయకులు క్రియాశీలంగా ఉన్నంతకాలం వారు తమ రాజకీయ జీవితంలో కొనసాగుతూనే ఉంటారని చెప్పేందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

అయినప్పటికీ ప్రజా జీవనంలో ఉన్నవారు 75 సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఇతరులకు అవకాశం కల్పించాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవల అన్నమాటలు తీవ్ర చర్చను ఎందుకు ప్రేరేపిస్తున్నాయి? రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అంటే బీజేపీ మాతృసంస్థ. బీజేపీలో ఉన్న అగ్రనాయకులంతా 'సంఘ్' నుంచి వచ్చినవారే. 'ఒక్కసారి స్వయం సేవకుడైతే జీవితాంతం స్వయం సేవకుడే' అని దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి సగర్వంగా ప్రకటించారు. గత ఏప్రిల్ తుదినాళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగపూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయానికి వెళ్లినప్పుడు స్వయం సేవకులను ఉద్దేశించి మాట్లాడుతూ 'మనం..' అనే పదాన్ని ఉపయోగించారు. తాను స్వయం సేవకుడిని కాదని మోదీ ఎప్పుడూ అనలేదు.

ఇంతకూ మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై చర్చిస్తున్నది ఎవరు అన్నది ప్రధానం. భాగవత్ అలా ప్రకటించగానే కాంగ్రెస్ నేతలు సంబరపడిపోయారు. తన మనుగడకు మోదీ ఎంత ప్రమాదకరమో కాంగ్రెస్ భావిస్తున్నందు వల్లే ఆ పార్టీ నాయకులు సంబరాన్ని ప్రకటించారనడంలో అతిశయోక్తి లేదు. 2014లో మోదీ ప్రధానిగా ఎన్నికైనప్పటి నుంచీ కాంగ్రెస్ జీవన్మరణ సంఘర్షణ చేస్తూనే ఉన్నది. ఒకో రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోతూ వస్తోంది. మోదీని ఢీకొనడానికి బలమైన రాజకీయ కార్యాచరణ ఎలా నిర్మించాలా అన్న విషయం కాంగ్రెస్ నేతలకు అంతుపట్టడం లేదు. మోదీనే కాదు, ఆయన మూలంగా విస్తరిస్తోన్న భావజాలాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ భావజాలం కాంగ్రెస్ కానీ, ఇతర ప్రతిపక్షాలు కానీ, వామపక్ష మేధావులు కానీ ఇంకా సమకూర్చుకోవాల్సి ఉన్నది. అందువల్ల తాము ఓడించలేని మోదీని సంఘ్ పరివార్ పక్కకు తప్పిస్తుందని ఆశపడడంలో అర్థం లేదు. మోదీ ఉన్నా, లేకపోయినా మోదీ ఒక మహాశక్తిగా రూపొందడానికి కారణమైన భావజాలాన్ని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు శక్తులు ఎలా ఎదుర్కోగలవా అని సామాజిక విశ్లేషకులు ఆలోచిస్తున్నారు. 82 ఏళ్లు నిండిన మల్లికార్జున ఖర్గేని పార్టీ అధ్యక్షుడుగా, 78 ఏళ్ల వయసులో సోనియాను రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగిస్తున్న కాంగ్రెస్ ఇతర పార్టీల నేతల వయసు గురించి మాట్లాడడం అసమంజసంగానే ఉంటుంది.

మోదీ స్వయం సేవకుడే. అంతమాత్రాన మోహన్ భాగవత్ వ్యక్తం చేసిన అభిప్రాయం మోదీకి కూడా వర్తిస్తుందని అనడానికి వీల్లేదు. బహుశా, భాగవత్ స్వయంగా తన గురించి ఈ అభిప్రాయం వ్యక్తం చేసి ఉండవచ్చు. ఆయనకు కూడా సెప్టెంబర్‌లోనే 75 ఏళ్లు పూర్తి కానున్నాయి. గత ఏప్రిల్‌లో మోదీ నాగపూర్‌కు వెళ్లినప్పుడు ఆయనను పదవీ విరమణ చేయమని సంఘ్ అడిగిందని శివసేన నేత సంజయ్ రౌత్ చెప్పారు. మోదీ త్వరలో పదవీవిరమణ చేస్తారని, అమిత్ షాకు అధికారం అప్పజెబుతారని గత ఏడాది ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ ఊహాగానం చేశారు. అసలు బీజేపీ వ్యవహారాలపై మాట్లాడే హక్కు వారికేమున్నది?

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే కేజ్రీవాల్, సంజయ్ రౌత్ వ్యాఖ్యానించినప్పుడు అమిత్ షా, దేవేంద్ర ఫడణవీస్ వంటి నేతలు వెంటనే ఖండించారు. 75 సంవత్సరాలు దాటినంత మాత్రాన మోదీ పదవీ విరమణ చేయాలన్న నిబంధన ఏమీ లేదని వారు స్పష్టం చేశారు. గమనార్హమేమిటంటే మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందిస్తూ మోదీని సంఘ్ ఇంటికి పంపాలనుకుంటున్నదని వ్యాఖ్యానిస్తే బీజేపీ నేతలు ఎవరూ మాట్లాడలేదు. అంతా నీరవ నిశ్శబ్దం నెలకొన్నది. అయినప్పటికీ భాగవత్ వ్యాఖ్యలు మోదీకి వర్తిస్తాయని చెప్పేందుకు వీల్లేదు. ఎందుకంటే సంఘ్ పెద్దల వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఎవరూ వ్యాఖ్యానించే అవకాశం ఏ మాత్రం లేదు. ఇది సంఘ్‌లోనూ, పార్టీలోనూ అందరూ పాటించే క్రమశిక్షణ. సంఘ్ పెద్దలు ఏ వ్యాఖ్యలు చేసినా అది తమ అంతర్గత వ్యవహారమని వారు భావిస్తారు. అంతేకాదు, మోదీ పది సంవత్సరాలకు పైగా అధికారంలో ఉన్నా, బీజేపీలో ఎక్కడా ఆయనకు వ్యతిరేకంగా రణ గొణ ధ్వనులు వినిపించలేదు. మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయాన్నీ బీజేపీ నేతలు ఆమోదించారు. 75 సంవత్సరాలు దాటాయన్న పేరుతో అడ్వాణీ, మురళీమనోహర్ జోషి వంటి వారిని మార్గదర్శక మండలిలో చేర్చినా ఎవరూ ప్రశ్నించలేదు. ఆనందీబెన్, సుమిత్రా మహాజన్ వంటి వారిని విశ్రాంతి తీసుకొమ్మని చెప్పినా అలా ఎందుకు అని అడిగినవారు లేరు. ముఖ్యమంత్రులుగా ఉన్న సీనియర్లను తప్పించి అనామకులను నియమించినా మోదీని ధిక్కరించినవారు కనపడలేదు. మోదీ–షా ప్రవేశపెట్టిన అధిష్ఠాన సంస్కృతి అంతకంతకూ బలోపేతమవుతోంది.




మోదీనీ, ఆయన మూలంగా విస్తరిస్తోన్న భావజాలాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ సైద్ధాంతిక శక్తిని కాంగ్రెస్ కానీ, ఇతర ప్రతిపక్షాలు కానీ, వామపక్ష మేధావులు కానీ ఇంకా సమకూర్చుకోవాల్సి ఉన్నది. భారతదేశంలో ఏ ప్రభంజనమూ శాశ్వతంగా కొనసాగిన దాఖలాలు లేవు. ఆవశ్యకత, ఉపయుక్తత ఉన్నంతకాలమూ మోదీ కొనసాగుతారనడంలో సందేహం లేదు. భవిష్యత్తును ఆయన వయసుతో నిమిత్తం లేకుండా ప్రజలు నిర్ణయిస్తారు.

అంతేకాక, వయసు పెరిగిందన్న పేరుతో మోదీని పక్కకు తప్పిస్తే ఆయన కంటే బలమైన నేత లభిస్తారన్న గ్యారంటీ ఏమిటి? మోదీ వారసుడిని సంఘ్ మాత్రమే నిర్ణయిస్తుందన్న విషయంలో రెండో ఆలోచనకు తావు లేదు. లాల్‌కృష్ణ అడ్వాణీ కరాచీ వెళ్లి దేశ విభజనకు కారకుడైన పాకిస్థాన్ సంస్థాపకుడు మహమ్మదాలీ జిన్నాను ప్రశంసిస్తే ఆయనను పక్కకు తప్పించింది సంఘ్ కాదా? వాజపేయి తర్వాత రెండుసార్లు అవకాశం లభించినా బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు అడ్వాణీ విఫలమైతే, ఆయన స్థానంలో ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్రమోదీని రంగంలోకి దించింది సంఘ్ కాదా? ఒకసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ రోజువారీ నిర్ణయాల్లో సంఘ్ కలుగచేసుకోకపోవచ్చు. అయినా ఇవాళ ప్రతి మంత్రిత్వశాఖలోను, విభాగాల్లోను, అనుబంధ సంస్థల్లోనూ సంఘ్‌కు సంబంధించినవారు రకరకాల పదవుల్లో నియమితులవుతున్నారన్న విషయాన్ని కాదనగలమా? ఇంతెందుకు ఎన్నికలు జరుగుతున్న సమయంలో బీజేపీ గెలుపొందేందుకు రకరకాల సంస్థల ద్వారా సంఘ్ తనవంతు ప్రయత్నాలు చేయడం, లబ్ధిదారుల వద్దకు వెళ్లడం నిజం కాదా? సంఘ్ పెద్దల్ని మచ్చిక చేసుకుంటే తమ పనులు సులభంగా అవుతాయని, ఏ పదవి రావాలన్నా సంఘ్ ఆశీర్వాదాలు అవసరమని బీజేపీ నేతలు కూడా భావిస్తున్నారు. అందువల్ల సంఘ్ లేనిది బీజేపీ లేదు, బీజేపీ లేనిది సంఘ్ లేదనేది కఠోర వాస్తవం. ఆర్‌ఎస్‌ఎస్‌ను బలహీనం చేయకుండా బీజేపీని దెబ్బతీయలేమని ఇటీవల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఒకరు అంగీకరించారు. రాహుల్‌గాంధీ కూడా తన ప్రధాన దాడిని సంఘ్‌పై ఎక్కుపెడుతున్నారు.

మోదీ స్థానంలో మరో నేత ఇప్పట్లో అధికారం చేపట్టే అవకాశాలు అనుమానమే. సంఘ్ ఇప్పటికే మోదీకి ప్రత్యామ్నాయంగా మరో నేతను సిద్ధం చేసిందని చెప్పడానికి ఆధారాలు ఏమీ లేవు. నిజానికి సంఘ్ ఎప్పుడూ వ్యక్తుల ఆధారంగా ఆలోచన జరపదని ఆ సంస్థ పెద్దలు అనేకసార్లు సూచించారు. వ్యక్తుల ఆధారంగా పార్టీలు అధికారంలోకి రావని, ఆ నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల ఆధారంగా పార్టీలు అధికారంలోకి వచ్చే వాతావరణం ఏర్పడుతుందని, ఆ సమయంలో క్రియాశీలంగా ఉన్న ఒక వ్యక్తి అవకాశాలు అందిపుచ్చుకుంటారని సమాజ చలన సూత్రాలు చెబుతున్నాయి. అందువల్ల మోదీ స్థానంలో నితిన్ గడ్కరి, యోగి ఆదిత్యనాథ్‌ల గురించి చర్చ జరుగుతున్నా అది కేవలం ఊహాగానాలపై ఆధారపడిన చర్చ మాత్రమే. కాకపోతే బీజేపీపై ఆర్‌ఎస్‌ఎస్ పట్టు మరింత బిగుస్తోందని చెప్పేందుకు ఆధారాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల నియామకంలో సంఘ్ పాత్ర స్పష్టంగా కనపడుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడి నియామకం విషయంలో కూడా బీజేపీ, సంఘ్ పెద్దలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

ఎందుకంటే బీజేపీ ఇప్పటికే పదేళ్లకు పైగా అధికారంలో ఉన్నది. ఈ పదేళ్ల కాలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాలు, ఫలితాలపై అంతటా చర్చ జరుగుతోంది. రానున్న సంవత్సరాల్లో భారత రాజకీయాల్లో, సామాజిక జీవనంలో బీజేపీ, సంఘ్ ప్రభావాన్ని కొనసాగించడం అనేది చాలా కీలకమైన విషయం. బీజేపీని మరింత చైతన్యవంతం చేయగల, పటిష్ఠపరచగల పార్టీ అధ్యక్షుడు ప్రస్తుతం అవసరం. ఈ కారణంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడి నియామకం ఇప్పుడు యాంత్రికంగా జరిగే నిర్ణయం కాకపోవచ్చని ఆ పార్టీ నేతలే ఊహిస్తున్నారు. హిందుత్వ ఆధారంగా బీజేపీ చేసిన ప్రచారం, దానికి తోడుగా అవలంబించిన రాజకీయాలు, ప్రతిపక్షాలను బలహీనం చేసేందుకు అనుసరించిన విధానాలు ఎల్లవేళలా విజయవంతం కాకపోవచ్చు. భారతదేశంలో ఏ ప్రభంజనమూ శాశ్వతంగా కొనసాగిన దాఖలాలు లేవు. మోదీ ఆవశ్యకత, ఉపయుక్తత ఉన్నంతకాలమూ ఆయన కొనసాగుతారనడంలో సందేహం లేదు. మోదీ భవిష్యత్తును ఆయన వయసుతో నిమిత్తం లేకుండా ప్రజలు నిర్ణయిస్తారు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

## పద్యనాటకంలో పాలమూరు ఝురి

బస్సు చక్రాలు పల్లెలకు పరిచయం లేని కాలంలో ఎడ్లబండ్లపై నాటక సమాజాన్ని తరలించి గ్రామాలకు రంగస్థలాన్ని ఆయన పరిచయం చేశారు. నాటకమే జీవితంగా నడయాడి హార్మోనియం మెట్లపై పద్యరాగాలను శ్వాసిస్తూ అర్ధ శతాబ్ది పాటు దక్షిణ తెలంగాణ నాటక రంగాన్ని చకచ్చకితం చేసిన సరస్వతీ వరప్రసాదుడు వరకవుల నరహరిరాజు. నాటకాలు రాయడంతో పాటు, పద్యాలకు రాగాల సొబగులద్ది, ఎందరో నటులను రంగస్థలానికి పరిచయం చేసిన ఈ నాటక కళాకారుడు జూన్ 20న తన జీవన రంగస్థలం నుండి నిష్క్రమించారు.

నరహరిరాజు 1949లో వీరభద్రరాజు, సుగుణమ్మ దంపతులకు గద్వాలలో జన్మించారు. తండ్రి 1940వ దశకంలో రాయలసీమ ప్రాంతం, అనంతపురం నుండి గద్వాలకు వలస వచ్చి అక్కడి సంస్థానాధీశుల ప్రాపకంలో హరికథ కళాకారుడిగా రాణించారు. స్వాతంత్ర్యానంతరం గద్వాల సంస్థానంలోని కవుల, కళాకారుల ఉనికి ప్రశ్నార్థకంగా మారిన రోజుల్లో వీరభద్రరాజు మరణించారు. కుటుంబ పోషణకు అన్న సత్యనారాయణరాజు హరికథలను ప్రదర్శిస్తూ తోడుగా తమ్ముడు నరహరిరాజును తీసుకువెళ్ళేవారు. ఇలా బాల్యంలోనే హరికథా కళ పరిచయం కావడంతో నరహరిరాజు తన విద్యాభ్యాసానికి 3వ తరగతిలోనే స్వస్తి చెప్పి హరికథ కళాకారుడిగా, హార్మోనియం వాదకుడిగా రూపొందారు. రెండవ అన్న జగన్నాథరాజు ప్రధాన కథకుడిగా, నరహరిరాజు సంగీతకారుడిగా హరికథలను ప్రదర్శించి వరకవుల ద్వయంగా గుర్తింపు పొందారు. నరహరిరాజు తరగతి గదుల్లో పెద్దగా చదవకపోయినా కవుల సహవాసంతో ప్రబంధకావ్యాలను, భారత, రామాయణాలను, చదివారు. హార్మోనియం సంగీత వాద్యంలో సాధన చేశారు. సాహిత్య అభినివేశం, సరిగమల నైపుణ్యం తదనంతర కాలంలో పద్యనాటకకర్తగా, నాటక సంగీత దర్శకుడిగా రంగస్థలంపై అడుగు మోపేందుకు విశేషంగా దోహదం చేశాయి. 1977లో తొలిసారి కొడంగల్ కేంద్రంగా స్థానిక ఉద్యోగులు పాత్రధారులుగా 'కృష్ణాంజనేయ యుద్ధం' నాటకాన్ని ప్రదర్శించారు. కొడంగల్‌లో కళాశాల అధ్యాపకులుగా ఉన్న కాతోజు వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్ ఆయన వెన్నంటి నిలిచారు. ఈ ప్రదర్శన విజయవంతం కావడంతో నరహరిరాజు వెనుదిరిగి చూడలేదు.



ఉమ్మడి పాలమూరు జిల్లాలో పద్యనాటకానికి ప్రాణం పోసిన ఘనత వరకవుల నరహరిరాజుకు దక్కుతుంది. ఒకే పద్యానికి వివిధ రాగాలను సృష్టించడంలో ఆయన సిద్ధహస్తులు. కళాకారుల స్వర సామర్థ్యానికి తగ్గట్టుగా రాగాలను కూర్చి భావ ప్రాధాన్యం తగ్గకుండా నరహరిరాజు సంగీతాన్ని అందించేవారు.

మహబూబ్‌నగర్ జిల్లా డోకూరు గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని ఎందరో ఔత్సాహికులకు పద్యనాటకాలలో శిక్షణనిచ్చి, తన సంగీత దర్శకత్వంలో పలు నాటకాలను ప్రదర్శించారు. ఆయన నిర్దేశకత్వంలో 'మిత్ర కళానాట్యమండలి' ప్రభవించి పాలమూరు నాటక రంగ వెలుగులకు పునాది వేసింది. భీమాచారి, వి.నారాయణ, రామలింగయ్య వంటి ఎందరినో పద్యనాటక రంగంలో ఉత్తమ శ్రేణి నటులుగా ఆయన తీర్చిదిద్దారు. ఇదే పరంపరలో వందలాది కళాకారులు ఆయన దగ్గర శిక్షణ పొంది రంగస్థలానికి పరిచయమయ్యారు.

నరహరిరాజు ఒకే పద్యానికి వివిధ రాగాలను సృష్టించడంలో సిద్ధహస్తులు. కళాకారుల స్వర సామర్థ్యానికి తగ్గట్టుగా రాగాలను కూర్చి భావ ప్రాధాన్యం తగ్గకుండా సంగీతాన్ని అందించేవారు. సరిగ్గా 25 సంవత్సరాల క్రితం మహబూబ్‌నగర్ టౌన్ హాలులో 'కృష్ణాంజనేయ యుద్ధం' నాటకాన్ని ప్రయోగాత్మకంగా అందించి తనదైన ముద్ర వేశారు. కాతోజు వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో శంకర్‌గౌడ్ కృష్ణుడిగా, విరివింటి పరశురాం ఆంజనేయుడుగా నటిస్తే హృద్యమైన పద్యాలతో, అభినయ ప్రధానంగా సాగిన ఈ నాటకంలో నరహరిరాజు తన సంగీత విశ్వరూపాన్ని ప్రదర్శించారు. ఒక ఆసక్తికరమైన విషయమేమిటంటే బలిజేపల్లి లక్ష్మీకాంతం వ్రాసిన 'సత్యహరిశ్చంద్ర' నాటకం ఆయన సంగీత దర్శకత్వంలో నాలుగు దశాబ్దాలపాటు వందలాది ప్రదర్శనలకు నోచుకున్నది. ఇది అతిశయోక్తి కాదు. గయోపాఖ్యానం, శ్రీకృష్ణతులాభారం, శ్రీకృష్ణరాయబారం, చింతామణి, బాలనాగమ్మ, మధుసేవ వంటి పలు ప్రసిద్ధ నాటకాలనూ ఆయన ప్రదర్శించారు. మహబూబ్‌నగర్ వేదికగా 2000లో జనతా సేవా సమితి సంస్థను స్థాపించి, నాటక రంగంలో తన వారసుడిగా కుమారుడు దూర్వాసరాజును 'విప్రనారాయణ' నాటకం ద్వారా పరిచయం చేసి నూటయాభైకి పైగా ప్రదర్శనలిప్పించారు.

1985లో వచనంలో ఉన్న 'బొబ్బిలియుద్ధం' నాటకానికి నరహరిరాజు తొలిసారి పద్యాలు రాసి రచయితగా నాటక రంగానికి పరిచయమయ్యారు. తన సృజనకు మరింత పదునుపెట్టి తర్వాత కాలంలో 'స్వామి వివేకానంద', 'భద్రాద్రి రామదాసు చరితం', 'వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర', 'అన్నమయ్య', 'ఏకాదశి మహాత్మ్యం', 'మహాకవి కాళిదాసు', 'సత్యాగ్రాహి' వంటి 15కు పైగా పద్య, సాంఘిక నాటకాలు వ్రాసి నాటకకర్తగా గుర్తింపు పొందారు. అదేవిధంగా స్నేహసుధ, ప్రసన్నభారతి, కరుణాభారతి వంటి 10కి పైగా పద్యకావ్యాలను రచించారు. తెలంగాణ మలిదశ ఉద్యమానికి పూర్వమే తెలంగాణ మాండలికంలో వ్రాసిన 'జర్రా ఇనుకోండ్రి మా నాయనా' పద్య కవిత్వం ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. నాటకకర్తగా, సంగీత దర్శకుడిగా నరహరిరాజు అర్ధశతాబ్దం పాటు తెలుగునాట అనేక వేదికలపై పద్య నాటకాలను ప్రదర్శించి నాటక రంగంలో తన కీర్తి పుటను సుస్థిరం చేసుకున్నారు. నాటక రంగానికి అందించిన సేవలకు గాను 2015లో తెలుగు విశ్వవిద్యాలయం, 'కీర్తి పురస్కారం'తో నరహరిరాజును సత్కరించింది. 1986లో నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'కళానీరాజన' పురస్కారం, జె.పి.ఎన్.సి. వారి ప్రతిభా నగదు పురస్కారం, ఇతర కళాసంస్థల సత్కారాలను ఆయన అందుకున్నారు.

ముఖ్యంగా పాలమూరు జిల్లాలో పద్యనాటకానికి ప్రాణం పోసిన ఘనత నరహరిరాజుకు దక్కుతుంది. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ఆయన మునివేళ్ళు హార్మోనియం మెట్లపై నాట్యం చేస్తుంటే రంగస్థలం హోరెత్తిపోయేది. అలాంటి ప్రతిభామూర్తి లేని లోటు నేడు స్పష్టంగా కనిపిస్తుంది. ఇప్పుడు పద్య నాటకం, నాటక రంగం ఓ పెద్ద దిక్కును కోల్పోయింది.

● డా. జే. విజయకుమార్ జీ
అధ్యక్షులు, తెలంగాణ థియేటర్ రీసెర్చ్ సెంటర్

## పతనమవుతున్న నైతిక విలువలు

ప్రజలకు ప్రశాంతమైన, గౌరవప్రదమైన, ఉన్నత విలువలతో కూడిన జీవితం నేడు ఊహకందని విషయంగా మారింది. అడుగడుగునా ఆవహించిన నేరమయ సంస్కృతి నాగరిక సమాజాన్ని వెక్కిరిస్తోంది. ప్రజల్లో నైతిక విలువలు నానాటికీ పతనమైపోతున్నాయి.

సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ యువకుడు బెంగళూరులో పనిచేస్తూ ఆన్‌లైన్ జూదానికి అలవాటు పడ్డాడు. సుమారు రూ.15 లక్షల అప్పు చేశాడు. రుణదాతల ఒత్తిడి పెరగడంతో కొద్దిరోజుల కిందటే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీలోని సత్యసాయి జిల్లాలో ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగుల్లో రూ. 6 లక్షలు పోగొట్టుకుని రైలు కింద పడి ఉసురు తీసుకున్నాడు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటకు చెందిన ఓ బాలుడు ఆన్‌లైన్ బెట్టింగుకు తల్లి బ్యాంకు అకౌంటు లింక్ చేసి, రూ. 36 లక్షలు పోగొట్టుకున్నాడు. పాలకుర్తిలో ఓ ఇంటర్ విద్యార్థిదీ ఇదే కథ. అతడి తండ్రి భూమి అమ్మగా వచ్చిన రూ.18 లక్షలను బ్యాంకులో భద్రపరిచాడు. తన ఫోన్ నెంబర్‌కు బ్యాంక్ అకౌంట్‌కు లింక్ చేసి ఉండడంతో, ఆ విద్యార్థి బెట్టింగుల్లో రూ. 18 లక్షల పోగొట్టుకున్నాడు. తండ్రి మందలిస్తాడనే భయంతో ఆత్మహత్య చేసుకున్నాడు. కష్టపడకుండానే త్వరగా డబ్బు సంపాదించాలన్న పేరాశ యువతను ఆన్‌లైన్ బెట్టింగుల వైపు నడిపిస్తోంది. టెలిగ్రామ్ లింకులు, సోషల్ మీడియా ప్రకటనల ద్వారా చాలామంది బెట్టింగ్ యాప్స్ వలలో పడుతున్నారు. ఇలా ఆన్‌లైన్ జూదంలో సర్వం కోల్పోయి తెలంగాణలో నెల రోజుల వ్యవధిలోనే ఆరుగురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. వివాహ బంధంలోనూ నైతిక విలువలు క్షీణిస్తున్నాయి. వివాహేతర సంబంధాల కారణంగా భార్యాభర్తలు ఒకరినొకరు కడతేర్చుకునే పరిస్థితులు దాపురించాయి.




ఇటీవలి కాలంలో విలువల్లేని కొన్ని సినిమాలు, పలు టీవీ ఛానెళ్లలో ప్రసారమవుతున్న హాస్య కార్యక్రమాలు (ఆ పేరుతో ద్వంద్వార్థాలు, వెకిలి వేషాలు), పలు ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు.. యువతలో నైతిక, కుటుంబ విలువలను దిగజార్చి, వారిలో హింసాత్మక ప్రవృత్తిని ప్రేరేపిస్తున్నాయి. పిల్లలు గంటల తరబడి ఫోన్లకు అతుక్కుపోతుండడంతో వారిలో మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. వారి మనస్తత్వమే మారిపోతోంది. క్రమంగా యువత గంజాయి, మత్తు మందులకు బానిసలై నేరగాళ్లుగా తయారవుతున్నారు. మన రాష్ట్రంలో సగటున ఒక వ్యక్తి రోజుకు ఆహారానికి రూ. 80 ఖర్చు చేస్తే.. తాగుడుకు 158 రూపాయలు ఖర్చు చేస్తున్నాడని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి! ఈ విషసంస్కృతిని బద్దలుకొట్టి సామాజిక చైతన్య స్ఫూర్తి రగిలించేలా కళా సృజనలు, రచనలు, కళాయాత్రల రూపకల్పన జరగాలి. అందుకోసం బలమైన సాంస్కృతిక ఉద్యమ నిర్మాణం చేయాల్సిన కర్తవ్యం ప్రభుత్వంతో పాటు ప్రజా రచయితలు, కవులు, కళాకారుల భుజస్కంధాలపై ఉంది. ప్రపంచాన్ని బలప్రయోగంతో కాదు, భావాలతోనే జయించాలి.

○ భూపతి వెంకటేశ్వర్లు
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం

## 130 ఏళ్లు... సాధ్యమేనా?

టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తన 90వ పుట్టినరోజు సందర్భంగా తాను ఇంకా 40 సంవత్సరాలు అంటే 130 ఏళ్ళు బతుకుతానని ఏ ఆధారాలతో సెలవిచ్చారో తెలియదు. బహుశా ఆయన పాటించే ఆరోగ్య సూత్రాలను బట్టి తన జీవితకాలాన్ని నిర్ణయించుకున్నారేమో. ఆశీర్వచనం చేసేటప్పుడు పెద్దలు 'శతమానం భవతి' అంటారు. శతం అంటే నూరు, మానం అంటే ఇరవై అంటే నూట ఇరవై పున్నములన్న మాట. ఈ వేదోక్తమయిన ఆశీర్వాదం కూడా వాస్తవరూపం దాల్చడం లేదు. ఎందుకంటే ఆరోగ్య సూత్రాలను పద్ధతి ప్రకారం ఎవరూ పాటించలేరు కాబట్టి. యోగా గురువు రామ్‌దేవ్ బాబా ఎప్పుడో ఓ సందర్భంలో తాను 200 సంవత్సరాలు జీవిస్తానని అన్నట్టు గుర్తు. ఇప్పుడు కొత్తగా కృత్రిమ మేధను ఉపయోగించి జీవనకాలాన్ని 150 ఏళ్ళకు పెంచుకోవచ్చని చెబుతున్నారు. ఎన్నాళ్ళు బతికినా మంచాన పడక, ఎవరి చేతా సేవలు చేయించుకోకుండా అనాయాస మరణాన్ని కోరుకోవాలి. అయినా దానికి కూడా పెట్టి పుట్టాలంటారు.

– డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి
సికింద్రాబాద్


వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

## 'సింగరేణి' మెడికల్ కోటా 50 శాతానికి పెంచాలి

సింగరేణిలోని 'సిమ్స్' మెడికల్ కాలేజీలో ఉద్యోగుల పిల్లలకు ప్రస్తుతం 5 శాతం కోటా సీట్లను అమలు చేస్తున్నారు. కానీ ఈ కోటాను 50 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది. రామగుండంలోని 'సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ & సైన్సెస్' (SIMS)లో మొత్తం 150 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. వీటిలో 23 సీట్లు ఆలిండియా కోటాకు అధికారులు కేటాయించారు. మిగిలిన 127 సీట్లలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు 5 శాతం.. అంటే కేవలం 7 సీట్లు మాత్రమే కేటాయిస్తున్నారు! దీనివల్ల సింగరేణి ఉద్యోగుల పిల్లలకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. ఈ వైద్య విద్యాసంస్థలో నియత ప్రాతిపదికన, 'నీట్ మెరిట్' ఆధారంగా మాత్రమే విద్యార్థుల ఎంపిక జరుగుతోంది. సిమ్స్‌లో తమ పిల్లలకు కనీసం 15–25 శాతం కోటా అవసరమని సింగరేణి ఉద్యోగ సంఘాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

సింగరేణిలో సుమారు 42 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. గనుల్లో నిత్యం ప్రమాదకరమైన పనులు చేస్తూ, సంస్థ అభివృద్ధికే తమ జీవితాల్ని అంకితం చేశారు. వారి పిల్లలకు వైద్య విద్యలో మరిన్ని అవకాశాలు కల్పించడం న్యాయం మాత్రమే కాదు, అది ప్రభుత్వ బాధ్యత కూడా.

SIMS ఏర్పాటు కోసం 'ఎస్‌సీసీఎల్' గతంలో సుమారు రూ. 500 కోట్లకు పైగా తన సీఎస్‌ఆర్ నిధుల నుంచి ఖర్చు పెట్టింది. అంత పెట్టుబడి పెట్టినందుకైనా వారికి ప్రతిఫలం ఇవ్వాలని సింగరేణి ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. స్థానికులైన వారి పిల్లలు సిమ్స్‌లో వైద్యవిద్యను అభ్యసించి, తిరిగి ఆ ప్రాంతంలోనే సేవ చేస్తే, గ్రామీణ వైద్యరంగం బలోపేతమవుతుంది. స్థానిక వనరులతోనే సేవలను సమర్థంగా అందించగలిగే అవకాశముంటుంది.




నీట్ వంటి కఠినమైన పరీక్షలకు సంబంధించిన పోటీతో వారి పిల్లల్లో స్ఫూర్తితో పాటు విద్యా ప్రమాణాలు మెరుగవుతాయి. ఈ కోటా పెంపుతో అనేక ప్రయోజనాలున్నాయి. అయితే ఈ సీట్ల పెంపు డిమాండ్ శాతం పలు రకాలుగా ఉంది. ప్రస్తుతం కోటా శాతం సీట్ల సంఖ్య 150. ప్రస్తుతం సింగరేణి పిల్లలకు ఇస్తున్న కోటా 5 శాతం (7 సీట్లు). ఉద్యోగ సంఘాల డిమాండ్ ప్రకారం చూస్తే 15 శాతం (22 సీట్లు). నియోజకవర్గం/MLAల సిఫార్సుల మేరకు 25 శాతం (37 సీట్లు), కుటుంబ సంక్షేమానికి సరైన ప్రాతినిధ్యం వహించేలా నిర్ణయిస్తే 50 శాతం (75 సీట్లు) కేటాయించవలసి ఉంటుంది.

అయితే ఇలా సీట్ల కోటా పెంచడం వల్ల అనేక సవాళ్లు తలెత్తుతాయి. కానీ వాటికి పరిష్కార మార్గాలున్నాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. కుల, ఇతర కోటాలతో కలిపి 50శాతం మించకూడదు. కొత్త కోటాను అమలుచేసేటప్పుడు జాతీయ చట్టాల ప్రకారం కచ్చితంగా అమలు చేయాలి. ఎస్‌సీసీఎల్ కోటాలోనూ నీట్ మెరిట్‌ను తప్పనిసరిగా అనుసరించాలి. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ ఉప-వర్గీకరణనూ వర్తింపజేయవచ్చు. సామాజిక న్యాయభావన పరంగా చూస్తే.. ఇతర సామాజిక వర్గాలవారు ఈ కోటా పెంపును అన్యాయంగా భావించే అవకాశం ఉంది. అందుకే దశలవారీగా అమలు చేయడం ద్వారా సామాజిక సమతుల్యతను సాధించవచ్చు.

కోటా సీట్ల ఎంపిక పారదర్శకంగా ఉండాలి. ఉద్యోగుల పిల్లలు అనే అర్హత నిర్ధారణకు ఎస్‌సీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరి చేయాలి. నీట్ ర్యాంక్ ఆధారంగా స్పష్టమైన ఎంపిక వ్యవస్థ ఉండాలి. ఈ కోటా పెంపును దశలవారీగా అమలు చేయాలి. ఉదాహరణకు.. వైద్య విద్య మొదటి సంవత్సరం: 15 శాతం కోటా (2025), రెండో సంవత్సరం: 30 శాతం (2026), మూడో సంవత్సరం: 50 శాతం (2027) అమలు చేయడం ఉత్తమం. ఈ దశలవారీ పెంపు ద్వారా సమర్థతను పరిశీలించి, సామాజిక ప్రశాంతతను కాపాడవచ్చు.

ఈ కోటా అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని విషయాలు దృష్టిలో ఉంచుకోవాలి. ఆరోగ్యశాఖ ద్వారా ప్రత్యేక జీవో జారీ చేయించాలి. ఎస్‌సీసీఎల్ యాజమాన్యం, ఉద్యోగ సంఘాలతో సంప్రదించి నిబంధనలు రూపొందించాలి. నియంత్రణ కోసం 'మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ'లను ఏర్పాటు చేయాలి. ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా అభ్యర్థుల వివరాలు, ఎంపికల వివరాలను వెబ్‌సైట్‌లో ప్రచురించాలి.

సింగరేణి సంస్థ తెలంగాణ అభివృద్ధికి సుదీర్ఘకాలంగా చురుకైన భాగస్వామి. వారి కుటుంబాల అభివృద్ధికి ఈ మెడికల్ కోటా 50 శాతం పెంపుతో.. వైద్య విద్యార్థులకు సమాజం పట్ల తమ కర్తవ్యాన్ని నిర్వర్తించినట్లవుతుంది. స్థానిక యువతలో వైద్యవిద్యపై ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థుల్లో స్ఫూర్తిని, సమాజానికి సేవ చేసే తత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ కోటా పెంపుతో కేవలం విద్యావకాశాలే కాదు.. ఒక ప్రాంతీయ న్యాయానికి, సేవల పట్ల సమాజ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది.

■ దాసారపు శ్రీనివాస్
కన్వీనర్, కోల్‌బెల్ట్ డాక్టర్స్ ఫోరమ్



కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ

# 19న రైల్వే మంత్రి రాక?

- కోచ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలించనున్న అశ్విని వైష్ణవ్
- ఏర్పాట్లను పరిశీలించేందుకు రేపు జీఎం పర్యటన
- అయోధ్యపురంలో జోరుగా సాగుతున్న పనులు

కాజీపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే కోచ్ ప్యాక్టరీ పనులను పరిశీలించేందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ నెల 19న కాజీపేటకు రానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ గురువారం కాజీపేటలో పర్యటించనున్నారు. జీఎం గురువారం ఉదయం స్పెషల్ రైలులో సికింద్రాబాద్‌లో ఉదయం 9.15 గంటలకు బయలుదేరి 11 గంటలకు కాజీపేట రైల్వేస్టేషన్‌కు చేరకుంటారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం జరిగే అయోధ్యపురానికి వెళ్లనున్నారు. కోచ్‌ఫ్యాక్టరీ పనులు, మిషనరీల ఏర్పాటు, వ్యాగన్, కోచ్, ఎలక్ట్రిక్ ఇంజన్‌లు, మెమో రైలు కోచ్‌ల విడిభాగాలు ఏర్పాటు స్థలాలు, ప్లాట్‌ఫారాలు, రైల్వే ట్రాక్‌ల నిర్మాణం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీంచనున్నారు. అనంతరం రైల్వే లోకోపైలెట్‌ల కార్యాలయం పరిశీలిస్తారు.

కాగా, రైల్వే జీఎం, రైల్వే మంత్రి పర్యటన సమాచారంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. కోచ్‌ఫ్యాక్టరీలో పనులు స్పీడందుకున్నాయి. జీఎం పర్యటన సందర్భంగా కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభం తేదీ ఖరారయ్యే అవకాశాలు ఉన్నట్లు రైల్వే అధికారులు చర్చించుకుంటున్నారు. కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం, తదితర అంశాలపై జీఎం బ్రీఫింగ్ ఇచ్చిన తర్వాత రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కాజీపేట పర్యటన తేదీని అధికారికంగా ప్రకటిస్తారని రైల్వే అధికారులు అంటున్నారు. రైల్వే మంత్రి వెంట కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కూడా వస్తారని తెలిసింది.

# నగరంలో ఏసీబీ కలకలం

**రిటైర్డు ఈఎన్‌సీ మురళీధర్ కుమారుడి కంపెనీ కార్యాలయంలో సోదాలు**



సహస్ర ఇన్‌ఫ్రా కంపెనీలో డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

వరంగల్ క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ న్యూశాయంపేటలోని నీటి పారుదల శాఖ రిటైర్డు ఈఎన్‌సీ మురళీధర్ కుమారుడు అభిషేక్‌కు చెందిన సహస్ర ఇన్‌ఫ్రా కంపెనీలో ఏసీబీ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో రిటైర్డు ఈఎన్‌సీ మురళీధర్‌ను ఆదాయానికి మించిన ఆస్తుల విషయంలో ఏసీబీ అధికారులు మంగళవారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఈ క్రమంలో హనుమకొండలో ఆయన కుమారుడికి సంబంధించిన కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక పరమైన పలు అంశాలపై వివరాలు సేకరించినట్లుగా తెలుస్తోంది. కీలక డాక్యుమెంట్లను సైతం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను వివరణ కోరగా సేకరించిన సమాచారాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.




# 'స్థానిక' పోరుకు సన్నాహాలు

- తగ్గిన 14 ఎంపీటీసీ స్థానాలు
- పెరిగిన 4 జడ్పీటీసీ స్థానాలు
- సిద్ధమవుతున్న బ్యాలెట్ బాక్సులు
- ఓటర్ల సంఖ్యలోనూ మార్పు
- స్థానాల వారీగా మ్యాపులు

హనుమకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అయితే అంతకుముందు ముందు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరపాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుండడంతో ఆ మేరకు జిల్లా యంత్రాంగాలు కూడా ఏర్పాట్లు చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు, వాటి పరిధిలోని ఓటర్ల వివరాలను ఉన్నికల సంఘం సేకరించింది. ఉమ్మడి జిల్లాలో ఈ మధ్య కాలంలో కొత్త మండలాలు, కొత్త మునిసిపాలిటీలు ఏర్పాటయ్యాయి. కొత్త మునిసిపాలిటీల్లో కొన్ని గ్రామాలు విలీనమయ్యాయి. దీనితో ఉమ్మడి జిల్లాలో అదనంగా నాలుగు జడ్పీటీసీ స్థానాలు పెరిగాయి. 14 ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఉమ్మడి జిల్లాలో మొదట్లో 71 జడ్పీటీసీ స్థానాలు ఉండగా కొత్తగా 4 పెరిగి 75కు చేరుకున్నాయి. ఎంపీటీసీ స్థానాలు 14 తగ్గాయి. మొత్తం 792 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటి సంఖ్య 778కి చేరుకున్నది. ఈ మార్పులు చేర్పులకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ అయింది. మారిన స్థానాలను బట్టే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల మార్పులు చేర్పుల వల్ల ఓటర్ల సంఖ్యలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. తాజాగా తేలిన ఓటర్ల సంఖ్యను బట్టి అధికారులు బ్యాలెట్ బాక్సులను, పోలింగ్ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యేనాటికి అన్ని ఏర్పాట్లతో సర్వసన్నద్ధంగా ఉండేలా జిల్లా యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి

### హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లా పరిధిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మార్పులేమి జరగలేదు. వాటి సంఖ్య యథాతదంగా ఉంది. ఈ జిల్లాలో మొత్తం 12 జడ్పీటీసీ, 129 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లాలో కొత్తగా

(మిగతా 8లో..)


### ఓటర్ల సంఖ్యలో మార్పు

మార్పులు, చేర్పులకు ముందు ఉమ్మడి జిల్లాలో మొత్తం 22,45,553 మంది ఓటర్లు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 3,72,646, వరంగల్ జిల్లాలో 3,85,163, జనగామ జిల్లాలో 4,01,115, మహబూబాబాద్ జిల్లాలో 5,51,999, ములుగు జిల్లాలో 2,31,052 , జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3,03,556 మంది ఓటర్లు ఉన్నారు. కొత్త మండలాలు, కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటయి జడ్పీటీసీలు పెరిగి, ఎంపీటీసీలు తగ్గడం వల్ల ఓటర్ల సంఖ్య కూడా మారనున్నదని అధికారులు చెబుతున్నారు. ఈ ఓటర్ల వివరాలకు సంబంధించిన తుది జాబితా త్వరలోనే విడుదల కానున్నది.

### ఉమ్మడి జిల్లాలో మారిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల సంఖ్య

### రిజర్వేషన్లపై ఉత్కంఠ

బీసీల రిజర్వేషన్లు పెరగనున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయదలుచుకున్న ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొన్నది. కొత్త రిజర్వేషన్ విధానం వల్ల ఏ స్థానాలు ఏ సామాజిక వర్గానికి వెళతాయోననే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ఇది వరకే బీసీ జనాభా గణన చేసిన ప్రభుత్వం శాసన సభలో ఆమోదించి పార్లమెంట్‌కు నివేదించింది. చట్టం అమలైతే బీసీ రిజర్వేషన్ల సంఖ్య పెరగడంతో పాటు ఇతర వర్గాల సీట్లు తగ్గే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి..

- భర్తను చంపిన భార్య
- వర్ధన్నపేట మండలం భావానికుంట తండాలో ఘటన
- కుటుంబ కలహాలే కారణం



జాటోత్ బాలాజీ (ఫైల్)

వర్ధన్నపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : భర్తకు కూల్‌డ్రింక్‌లో విషం కలిపి ఇచ్చి చంపిన ఘటన వర్ధన్నపేట పట్టణ పరిధిలో జరిగింది. ఎస్సై చందర్ కథనం ప్రకారం.. వర్ధన్నపేట పట్టణ పరిధిలోని భావానికుంట తండాకు చెందిన జాటోత్ బాలాజీ (44) వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 8న దాటుడు పండుగను కుటుంబ సమేతంగా పండుగ జరుపుకున్నారు. సాయంత్రం బాలాజీ మద్యం తాగడానికి వెళ్లి వస్తానని భార్యకు చెప్పాడు. అదే సమయంలో భార్య కాంతి ఇంట్లో కూల్‌డ్రింక్‌లో క్రిమిసంహారక మందు కలిపి ఇచ్చింది. అది తాగిన బాలాజీ కొద్దిసేపట్లోనే గొంతులో నొప్పి వస్తుందని చెప్పాడు. భర్తను అలాగే వదిలి సమీపంలోని తాళ్లకుంటతండాలోని తన అక్క- బావ ఇంటికి వెళ్లింది. వారి ఇంటి పక్కవారు బాలాజీని మొదటగా వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఈ నెల 13న హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 15న ఉదయం మృతి చెందాడు. భార్యా భర్తలకు తరచూ గొడవలు జరుగుతుండేవి. వాటిని మనస్సులో పెట్టుకుని నిందితురాలు కాంతి తన బావ వాంకుడోత్ దస్రూ ప్రోత్సాహంతో ఈ ఘటనకు పాల్పడినట్లు బాలాజీ తండ్రి హరిచందర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాలాజీకి ఒక కుమార్తె స్వప్న, కుమారుడు ప్రవీణ్ ఉన్నారు. కుమార్తె స్వప్నకు వివాహమైంది.



అమ్మవారిని దర్శించుకున్న డీఐజీ దంపతులు

# అమ్మవారి సన్నిధిలో ఇంటెలిజెన్స్ డీఐజీ

వరంగల్ కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఆరాధ్య దైవం భద్రకాళి అమ్మవారిని రాష్ట్ర ఇంటిలిజెన్స్ డీఐజీ సన్నీ సతీసమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం డీఐజీ సన్నీ దంపతులు నగరంలోని అమ్మవారి ఆలయానికి చేరుకొని వల్లభగణపతి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈవో శేషు భారతి వారికి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. డీఐజీ వెంట ఇంటిలిజెన్స్ డీఎస్పీ కృష్ణప్రసాద్, ఎస్సై రవికుమార్, తదితరులు ఉన్నారు.



# భర్త వేధింపులకే బలైపోయింది...

- డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్య కేసులో నిజాలు నిగ్గు తేల్చిన పోలీసులు
- భర్త డాక్టర్ అల్లాడి సృజన్‌తో పాటు అతడి తల్లిదండ్రుల అరెస్టు
- ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ బానోతు శృతి కూడా...
- శృతితో సన్నిహిత సంబంధాలు కొనసాగించిన సృజన్
- భర్త తీరు మారకపోవడంతోనే ప్రత్యూష ఆత్మహత్య
- వివరాలు వెల్లడించిన కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి
- ఖమ్మం జైలుకు నిందితుల తరలింపు

హసన్‌పర్తి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ మోజులో పడి భార్యను వేధించడంతో.. ఆమె ఆత్మహత్యకు పాల్పడిన ఘటనకు సంబంధించి పోలీసులు నిజాలు నిగ్గు తేల్చారు. గుండె వైద్య నిపుణుడు డాక్టర్ అల్లాడి సృజన్ భార్య డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్య కేసులో పోలీసులు నిందితులను కటకటాల వెనక్కి పంపించారు. భర్త, అత్తమామలతో పాటు, భర్త ప్రియురాలి వేధింపుల వల్లే డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్యకు పాల్పడిందని కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ కేసులో నిందితులైన డాక్టర్ సృజన్, అత్తామామలు అల్లాడి మధుసూదన్, పుణ్యవతితో పాటు ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ బానోతు శృతి (బుట్టబొమ్మ ఫేమ్)ని అరెస్టు చేసి



ప్రత్యూష కుమార్తెను బుజ్జగిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

రిమాండ్‌కు తరలించామన్నారు. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మీడియాకు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... వరంగల్ మట్టెవాడకు చెందిన తంజావూరు పద్మావతి-విజయ్‌కుమార్ దంపతుల కూతురు ప్రత్యూష(35)ను హసన్‌పర్తికి చెందిన మధుసూదన్ పుణ్యవతి దంపతుల చిన్న కుమారుడు డాక్టర్ సృజన్‌కు 2017లో రూ.30 లక్షల కట్నం, 30 తులాల బంగారం, కారుతో పాటు అన్ని లాంఛనాలతో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కూతుళ్ళు. జానూష (7), జైస్వీకాస్ (7 నెలలు) ఉన్నారు. సృజన్ కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజిస్టు, సి.టి. సర్జన్‌గా పనిచేస్తున్నారు. ప్రత్యూష ఆరెపల్లిలోని ఎన్‌ఆర్ అపోలో ఆస్పత్రిలో దంతవైద్యురాలిగా పనిచేస్తున్నారు. వారి కాపురం అన్యోన్యంగా సాగుతున్న క్రమంలో గత ఏడాది సృజన్‌కు శృతి పరిచయమైంది. సృజన్ పనిచేస్తున్న మెడికవర్ ఆస్పత్రి వారు పబ్లిసిటీ కోసం సంవత్సరం క్రితం తమ స్పెషలిస్టు డాక్టర్లను ఇంటర్వ్యూ చేసేందుకు హనుమకొండ రెవెన్యూ కాలనీకి చెందిన

(మిగతా 8లో..)



బట్టలబజార్‌లో కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

# చెత్త సేకరణ పకడ్బందీగా జరగాలి...

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- నగరంలోని పలు డివిజన్‌లలో క్షేత్రస్థాయి పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, జూలై 15 ( ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతీ డివిజన్, ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం నగరంలోని పలు డివిజన్‌లలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. 37, 38 డివిజన్‌లలోని ఖిలావరంగల్, బట్టలబజార్‌లో ఆకస్మికంగా పర్యటించి శానిటేషన్ నిర్వహణ తీరుపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని అన్నారు. ప్రతీ డివిజన్‌లో ఇద్దరు జవాన్‌లు మాత్రమే విధులు నిర్వహించాలని అన్నారు. జవాన్‌లకు పారిశుధ్య సిబ్బంది ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సిబ్బంది హాజరు నిర్వహణ పారదర్శకంగా ఉండాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ లక్ష్యాలను చేరుకోవాలంటే జవాన్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ ఎం.రాజేశ్, శానిటరి సూపర్‌వైజర్ భాస్కర్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధూకర్‌తో పాటు శానిటరి జవాన్‌లు పాల్గొన్నారు.

# 'మహాలక్ష్మి' డబ్బులు వస్తాయని..

- పోస్టాఫీసుల్లో వ్యక్తిగత ఖాతాలు తెరుస్తున్న మహిళలు
- కొన్ని రోజులుగా ఆఫీసుల ఎదుట రద్దీ
- ఎలాంటి ప్రకటన చేయని అధికారులు



హనుమకొండలో ఇండియా పోస్టు బ్యాంకు వద్ద బారులు దీరిన మహిళలు

హనుమకొండ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.2500 డబ్బులు పడతాయంటూ సోషల్ మీడియాలో వైరలైన వదంతితో పోస్టాఫీసులకు గిరాకీ పెరిగింది. హనుమకొండ సహా ఇతర ప్రాంతాల్లో ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) కేంద్రాల వద్ద మహిళలు మంగళవారం పెద్ద సంఖ్యలో అకౌంట్స్ తెరవడానికి బారులుతీరారు. సాధారణ రోజులలో 200 నుంచి 300 వరకు అకౌంట్స్ తీసుకునే మహిళలు మూడు రోజుల నుంచి సగటున రోజుకు 1500 నుంచి 2000 మంది వరకు కొత్త ఖాతాలు తెరవడం గమనార్హం. పొద్దునుంచే మహిళలు బ్యాంకు వద్దకు చేరుకొని ఆధార్ కార్డు , మొబైల్ నంబర్లతో క్యూలైన్లలో నిల్చుంటున్నారు. ఇప్పటి వరకు మహాలక్ష్మి పథకం పేరిట ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ జోరుగా సాగుతున్న వదంతులను ప్రజలు నమ్మి పెద్ద సంఖ్యలో బ్యాంకు వద్దకు వచ్చి ఖాతాలు తీస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల వరుసగా ప్రభుత్వ పథకాల ద్వారా డబ్బులు రావడం వల్ల మహిళలు ఈ ప్రచారాన్ని నమ్ముతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకాలపై అవగాహన లోపంతో మహిళలు నిజమైన స్కీంల గురించి సమాచారం లేకుండా సోషల్ మీడియాలో వచ్చిన వదంతులను నమ్మి బ్యాంకులకు వచ్చి ఖాతాలు తెరుస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఖాతాలు కావాలని వచ్చిన వారికి తెరుస్తున్నామని, మహాలక్ష్మి పథకం గురించి తమకు తెలియదని పోస్టల్ అధికారులు సెలవిస్తున్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

# కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

**ప్రయోజన వ్యతిరేక చట్టం రద్దు చేయాలని డిమాండ్**



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆల్‌పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై15(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన పెన్షనర్ల ప్రయోజన వ్యతిరేక చట్టం రద్దు చేయాలని ఆల్‌పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆల్‌పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట పెన్షనర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ.. పెన్షనర్లకు ఎలాంటి ప్రయోజనా లు లేకుండా తీసకువచ్చిన చట్టంపై పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారని, వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతర జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డికి మెమోరాండం అందజేశారు. ఈ ధర్నాలో ఆల్‌పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నారాయణగిరి వీరన్న, బ్రహ్మయ్య, బేతి శంకర్‌లింగం, సీహెచ్ సత్యనారాయణ, పీఎల్ఎన్ రావు, ఎ.విద్యాదేవి, జె.ప్రభాకర్‌రెడ్డి, బుక్క సిద్దిరాజయ్య తోపాటు సుమారు 200మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

### సీఐటీయూ ధర్నా..

సంగారెడ్డ జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీలో జూన్ 30వ తేదీన జరిగిన ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు పరిహారం చెల్లింపుల్లో నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ రమేష్, బొట్ల చక్రపాణి, రవి, రజిత, సంపత్, చిరంజీవి, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

## షాపులో చొరబడి చైన్ స్నాచింగ్

● వర్ధన్నపేటలో చోరీ ●3.50 తులాల బంగారు గొలుసు అపహరణ



చైన్ స్నాచింగ్ జరిగిన షాపు వద్ద బాధితురాలు పూరి

వర్ధన్నపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట పట్టణ పరిధిలోని డీసీ తండాలో మంగళవారం తెల్లవారుజామున ఇద్దరు యువకులు షాపులోకి చొరబడి మహిళ మెడలో ఉన్న బంగారు చైన్ ఎత్తుకెళ్లిన ఘటన కలకలం రేపింది. వర్ధన్నపేట ఎస్సై రాజు కథనం ప్రకారం.. డీసీతండాకు చెందిన బానోత్ పూరి (65) ఇంటిలోనే కిరాణం నడుపుతుంది. అమె కుమారుడు హైదరాబాదు వెళ్తుండడంతో తెల్లవారుజామున 3.30 గంటలకు షాపు తెరిచింది. కుమారుడు వెళ్లడం తో ఇది గమనించి ఇద్దరు ఆగంతకులు షాపునకు వచ్చి టీ కావాలని అడగడంతో లేదని చెప్పింది. అలాగే మాట్లాడుతూ వృద్ధురాలి దగ్గరకు వెళ్లి మెడలో ఉన్న 3.50 తులాల బంగారు గొలుసు లాక్కోని స్కూటీపై పరారయ్యారు. పెనుగులాటలో యువకుల చద్దరు, టోపీ అక్కడే పడిపోయాయి. అమె అరిచినా తెల్లవారుజాము కావడంతో ఎవరూ రాలేదు. ఆ యువకులు వర్ధన్నపేట వైపు వెళ్లారని బాధితురాలు తెలిపింది. సీసీ కెమరాలను పరిశీలించడంతో పాటు కేసును ఛేదించడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

## పాంచాలరాయ ఆలయంలో పాము

### శాయంపేటహవేలిలో ఘటన



వేంకటేశ్వరస్వామి విగ్రహం తలపై దర్శనం ఇస్తున్న సర్పం

గీసుగొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాయంపేటహవేలిలోని పాంచాలరాయ స్వామి ఆలయంలోకి మంగళవారం పాము వచ్చింది. భక్తులకు సర్పం స్వామివారి చెంతన కనిపించింది. ఆలయంలోని వేంకటేశ్వరస్వామి ప్రతిమ వద్ద సర్పం కనిపించినట్లు భక్తులు తెలిపారు. భక్తులు చూస్తుండగానే స్వామివారి పాదాలు, చేతులు తాకుతూ శిరస్థానంలోకి చేరుకుంది. స్వామివారి తలపై కిరీటం మాదిరిగా కొంతసేపు కనువిందు చేసింది. స్వామి మెడభాగంలోకి చేరుకొని దర్శనమిచ్చినట్లు భక్తులు తెలిపారు. దాదాపు అర గంట పాటు స్వామి తల, మెడలో ఉండి కిందికి దిగి గర్భగుడిలోకి వెళ్లిన పాము కనిపించలేదని భక్తులు చెప్పారు. గతంలోనూ గర్భగుడిలో సర్పం రెండుసార్లు దర్శనమిచ్చి అదృశ్యమైనట్లు అర్చకులు రామ్మూర్తి చార్యులు తెలిపారు. కాకతీయల కాలం నాటి వైష్ణవ దేవాలయంలో ఆదిమహాలక్ష్మి సమేతుడైన శ్రీకృష్ణుడు మూలవిరాట్‌గా కొలువుదీరినట్లు ఆయన వివరించారు.

## యూరియా గోదాం సీజ్

### ఫర్టిలైజర్ షాపు యజమానిపై కేసు నమోదు

నల్లబెల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ ఫర్టిలైజర్ షాపును మంగళవారం సీజ్ చేశారు. యూరియా బస్తాలను రైతులకు విక్రయించకుండా వ్యవహరించిన ఫర్టిలైజర్ షాపు యజమానులపై కేసు నమోదు చేసి గోదాంను సీజ్ చేసినట్లు ఏవో బన్న రజిత తెలిపారు. ఆమె కథనం మేరకు.. మండల కేంద్రంలోని ఖాజా మొయినుద్దీన్ ఫర్టిలైజర్ షాపులో స్టాక్ రిజిస్టర్ బుక్‌లను పరిశీలించామన్నారు. పీఓఎస్ మోషన్, బిల్లు బుక్కులకు లెక్కలు తేడా వచ్చాయని దీంతో విచారించామన్నారు. డీలర్లు యూరియాను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాగే యూరియాను నిల్వ ఉంచి రైతులకు అమ్మకుండా ఇబ్బందులకు గురి చేస్తే డీలర్ల పర్మిషన్ రద్దు చేస్తామన్నారు.

## పల్లెపాడు దామోదర్‌కు జాతీయ స్థాయి అవార్డు



బాలసముద్రం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ ఇండియన్ అచీవర్ అవార్డును అందుకున్నారు. మంగళవారం ఉద యం న్యూ ఢిల్లీలోని జరిగిన 12వ సీఎస్ఆర్ సమ్మిట్‌లో అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్గరీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ దేశాల రాయబారుల చేతుల మీదుగా అవార్డును, ప్రశంసా పత్రాన్ని దామోదర్ అందుకున్నారు. జాతీయస్థాయిలో వివిధ సంఘాల్లో నైపుణ్యం, సేవలు అందించిన వ్యక్తులకు ఇండియన్ అచీవర్స్ ఫోరం 12 ఏళ్లుగా ప్రతిష్ఠాత్మక అవార్డులను, ప్రశంసా పత్రాలను అందిస్తోంది.



# స్థానిక ఎన్నికల్లో విజయఢంకా మోగించాలి

**మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

జఫర్‌గడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయఢంకా మోగించాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం జఫర్‌గడ్‌లో బీఆర్ఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశం పార్టీ మండల ఇన్‌చార్జి పసునూరి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత విధానాలను ప్రజల్లో ఎండగడుతూ.. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, పథకాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే శ్రీహరి తన బిడ్డ రాజకీయ భవిష్యత్తు కోసమే ప్రజలను దగా చేసి కాంగ్రెస్‌లోకి వెళ్లాడని, అభివృద్ధి కోసం కాదన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ హామీల అమలులో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు పి.జయపాల్‌రెడ్డి, గబ్బెట బుచ్చయ్య, కడారి శంకర్, కొత్వాల కుమార్, ఆకారపు యాకయ్య, మంద రాజయ్య, రాజ్‌కుమార్, నజీర్, మారపల్లి కరుణాకర్, రవిందర్, ఎం.సోమయ్య, గోలి కవిత, మేరుగు రమేశ్, సింగారపు శ్రీధర్ పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తదితరులు

## కేయూ బయోటెక్నాలజీ విద్యార్థులకు ఉద్యోగాలు

కేయూ క్యాంపస్ జూలై 15, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఎంఎస్సీ బయోటెక్నాలజీ విభాగం ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు మంగళవారం ఎంపికైన అభ్యర్థులకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు కేయూ పరిపాలన భవనంలో నియామక పత్రాలను అందచేసి అభినందించారు. హైదరాబాద్ బ్రిలియంట్ బయో ఫార్మాసంస్థ నేతృత్వంలో చేపట్టిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 12 మందికి ఉద్యోగాలు లభించాయి. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 18 వేల వేతనంతో పాటు హెచ్‌ఆర్‌ఏ ఇతర అలవెన్స్‌లు చెల్లిస్తారు. అలాగే మరో ఇద్దరూ హనుమకొండ వాసవి ఆస్పత్రిలో జూనియర్ ఎంబ్రియాలజిస్టులుగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ టి. శాస్త్రి, బీవోఎస్ చైర్మన్ డాక్టర్ పోడేటి శ్రీనివాస్‌తో పాటు పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజు గౌడ్, కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ రాధిక, మహేందర్, శ్యాంసుందర్‌చారి, భరత్‌కుమార్‌లు పాల్గొన్నారు.



ప్రతిభాపురస్కారం అందుకుంటున్న పాపయ్య

## జానపద కవి పాపయ్యకు ప్రతిభా పురస్కారం

లింగాలఘణపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జానపద కవి, మహిళా బోనాల కోలాటం సృష్టికర్త కడకంచి పాపయ్యకు సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అందించే ప్రతిభా పురస్కారం దక్కింది. పలు రంగాల్లో విశేష సేవలు అందించిన వారిని గుర్తించిన నిర్వాహకులు జానపద కళారంగంలో లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన ప్రముఖ జానపద కవి కడకంచి పాపయ్య ఎంపికయ్యారు. ఈసందర్భంగా మంగళవారం నాంపల్లిలోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగిన ప్రతిభాపురస్కారాల పంపిణీకి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం నాయక్ ముఖ్యఅతిథులుగా హాజరై కడకంచి పాపయ్యను ఘనంగా సత్కరించి అవార్డును అందజేశారు. కాగా జానపద కళారంగంలో విశిష్టంగా సేవలు అందించిన కడకంచి పాపయ్యను జిల్లా ప్రజలు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో కోచ్ రవికుమార్

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జనగామ కల్చరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ జాతీయ స్థాయి పోటీలకు జిల్లా కేంద్రంలోని సాన్‌మారియా స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న మహబూబ్ నగర్‌లో జరిగిన ఎంపికలలో పాఠశాలకు చెందిన వైష్ణవి, అక్షయ, మంగ సునయన, శ్రుతకీర్తి, అర్చన సౌత్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 17 నుంచి తమిళనాడులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను, కోచ్ రవికుమార్ ను డైరెక్టర్‌తోపాటు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రామస్వామి, కార్యదర్శి వెంకటేశ్వర్లు అభినందించారు.

## రెడ్డి బాలికల హాస్టల్‌లో ప్రవేశాలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై15(ఆంధ్రజ్యోతి): రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలబాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, చాడ సునిల్‌రెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఆపై చదువుకునే బాలబాలికలు ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 20వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు బాలికతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరైనా ఒకరు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. దరఖాస్తులకు హనుమకొండలోని కనకదుర్గకాలనీ హాస్టల్‌లో లేదా 96766 49811లో సంప్రదించాలని, ఒక వేళ స్వయంగా అందించలేని పక్షంలో ఫోన్‌కు వాట్సాప్ ద్వారా కూడా అప్లికేషన్ ఫామ్ నింపి పంపిచొచ్చని, ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

## 23 నుంచి ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ జూలై 15, (ఆంధ్రజ్యోతి) : కేయూ ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలను ఈనెల 23 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్ర ణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసీం ఇక్బాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 23, 25, 28, 30, ఆగస్టు 1, 4, 6వ తేదీల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

**25 నుంచి ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు..**

కేయూ ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 28, 30 ఆగస్టు 1, 4,వ తేదీల్లో పరీక్షలు జరుగుతాయని పరీక్షల నియంత్రణాధికారులు మంగళవారం వెల్లడించారు. పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయదం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయని వెల్లడించారు.

## పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతిగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్ జూలై 15, (ఆంధ్రజ్యోతి) : కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎం హెచ్‌ఆర్ఎం విభాగాధిపతిగా డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేయగా ఇప్పటి వరకు పదవిలో కొనసాగిన ప్రొఫెసర్ పి.శ్రీని వాసరావు నుంచి బాధ్యతలు చేపట్టారు. ఆకుతోట శ్రీనివాసులు కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్‌ఆర్ఎం విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కొనసాగు తున్నారు. కేయూ మహాత్మాజ్యోతిరావు పూలే ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్ గానూ ఉన్నారు. 70 అంతర్జాతీయ, జాతీయ పరిశోధన పత్రాలను ప్రచురించారు. మరో 20 సెమినార్లకు హాజరైయ్యారు. కేయూ దూరవిద్య కేంద్రం ప్రచురించిన పాఠ్య పుస్తకాలకు రచయితగా, ఎడిటర్‌గా పనిచేశారు.

నూతన విభాగా ధిపతిగా నియమితులైన శ్రీనివాసులను కాంట్రాక్టు అధ్యాప కుల సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, కృష్ణయ్య, మధుకర్‌రావు, రవీందర్, బ్రహ్మయ్య బోధన, బోధ నేతర సిబ్బంది అభినందించారు.

## దేశాన్ని రక్షించేది కమ్యూనిస్టులే..

● మతతత్వంతో ప్రజలను విభజిస్తున్న బీజేపీ
● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



నర్సంపేటలో మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివసరావు

నర్సంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : దేశాన్ని రక్షించేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. నర్సంపేటలోని మేరసంఘం భవనంలో మంగళవారం పార్టీ మండల 14వ మహాసభను నిర్వహించారు. పార్టీ జెండా అవిష్కరించాక గడ్డం నాగరాజు, పిట్టల సతీష్ అధ్యక్షతన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మతతత్వ రాజకీయాలతో ప్రజలను బీజేపీ విభజిస్తుందన్నారు. మోదీ సర్కార్ ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తుందన్నారు. రచయితలు, కవులు, కళాకారులు, విద్యావేత్తలను అణిచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతుందని విమర్శించారు. హిందూత్వ అజెండాతో ముస్లిం, క్రైస్తవులు, కమ్యూనిస్టులపై విషం కక్కుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, జిల్లా కమిటీ సభ్యులు అక్కపల్లి రమేశ్, గుంపెల్లి మునీశ్వర్, గుండె బద్రి, తోట చంద్రకళ, నాయకులు దిడ్డిపార్థసారథి, చెన్నకేశవులు, మియాపురం గోవర్ధన్, పాలక కవిత పాల్గొన్నారు.

# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ రంజిత్‌కుమార్

హనుమకొండటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సుబేదారి సీఐ ఎం. రంజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారి పోలీసు స్టేషన్‌లో స్టేషన్ పరిధిలో నేర చరిత్రకలిగిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎం. రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్థులపై ఎప్పటిక ప్పుడు నిఘా ఉంటుందని , సంబంధంలేని భూతగాదాలు, ఇతర గొడవల్లో తలదూర్చవద్దని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లు నేరాలు మానుకోవాలని లేని పక్షంలో పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, నిరంతరం నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు రౌడీ షీటర్ల కదలికలను గమనిస్తామని, శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసుల సూచనలు పాటించాలని సీఐ రంజిత్‌కుమార్ వారికి హెచ్చరించారు.

# ఇద్దరు విద్యార్థులకు గాయాలు



చంద్రశేఖర్‌ను పరామర్శిస్తున్న ప్రిన్సిపాల్ మనోహర్ తదితరులు

కేయూ క్యాంపస్ జూలై 15, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. వాకర్స్ రోడ్డుపై నడుస్తు ఒకరిపై ఒకరూ పడి ఆకస్మాత్తుగా రోడ్డు మధ్యలోకి రావడంతో అప్పుడే మోటర్‌సైకిల్‌పై అటుగా దేవాలయానికి వెళ్తున్న కేయూ ఎంఈడీ విద్యార్థి చంద్రశేఖర్ బ్రేక్ వేయడంతో కింద పడి తీవ్ర గాయాలపాలైయ్యారు. చంద్రశేఖర్ కేయూ క్యాంపస్‌లో బీఈడీ నాల్గవ సెమిస్టర్ చదువుతున్నారు. ప్రమాదంలో గాయపడిన చంద్రశేఖర్‌ను హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కేయూ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌లో విశ్రాంతిని కల్పించారు. కాగా విషయం తెలుసుకున్న కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ఇతర అధ్యాపకులు డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ ఆకుల శ్రీనివాస్, డాక్టర్ వేణుతో పాటు స్కాలర్స్, ఎంఈడీ స్టూడెంట్స్, విద్యార్థి నేతలు ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. చంద్రశేఖర్ తల్లిదండ్రులు, బంధువులు వర్సిటీకి వచ్చారు.

**పోతన హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్ విరిగి విద్యార్థినికి గాయాలు**

కేయూ క్యాంపస్‌లోని పోతన హాస్టల్ రూం నెంబర్ 69లో ఫ్యాన్ రాడ్ విరిగి బీపీఈడీ విద్యార్థిని వీణ గాయపడ్డారు. సోమవారం రాత్రి సమయంలో హాస్టల్‌లో నిద్రిస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఫ్యాన్ రాడ్ విరిగి సీలింగ్ ఫ్యాన్ కింద పడింది. ఫ్యాన్ కింద పడటంతో వీణ చేతికి స్వల్ప గాయమైంది. తోటి విద్యార్థులు వీణను హుటహుటిన 108లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. స్కానింగ్ ఇతర పరీక్షలు నిర్వహించి ప్రమాదం ఏమీలేదని బాధిత విద్యార్థిని వీణను డిశార్చ్ చేశారు. డిశార్చ్ అనంతరం కేయూ క్యాంపస్‌కు చేరింది. విషయం తెలుసుకున్న కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి వెళ్ళి బాధిత విద్యార్థిని వీణను పరామర్శించారు.

**క్యాంపస్‌లోకి వాకర్స్ ఎవ్వరూ రావద్దు..**

కేయూ క్యాంపస్‌లో ఎంఈడీ విద్యార్థి చంద్రశేఖర్ ప్రమాదంతో పాటు ఇటీవల తరుచుగా చోటుచేసుకుంటున్న ప్రమాదాల నేపథ్యంలో వర్సిటీలోకి వాకర్స్‌తో పాటు బయటి వ్యక్తుల వాహనాలు రావద్దంటూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచ్రం ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీ క్రీడామైదానంలోని ట్రాక్‌లు, వర్సిటీ పరిసర ప్రాంతాల దుర్వినియోగం, మరమత్తులు దృష్ట్యా వాకర్స్‌తో పాటు బయటి వ్యక్తులు వర్సిటీ ప్రాంగణంలోకి రావద్దని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలు చేస్తామని పేర్కొన్నారు.

## డాక్టర్ ప్రత్యూష కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

హసన్‌పర్తి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి కాకతీయ వెంటేజ్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకొని మృతిచెందిన డాక్టర్ ప్రత్యూష కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతోపాటు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్‌రాజ్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముందుగా వారు డాక్టర్ ప్రత్యూష చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులర్పించి మృతురాలి కూ తుళ్లను చూసి విచారం వ్యక్తం చేశారు. డాక్టర్ ప్రత్యూష ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మృతికి కారకులైన వారికి చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, కాంగ్రెస్ నాయకులు పోతరాజు ప్రభాకర్, వెంకటస్వామి, రవీంద ర్‌తో పాటు మృతురాలి కుటుంబ సభ్యులు, వైద్య విభాగం నాయకులున్నారు.



డాక్టర్ ప్రత్యూష చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్‌రాజ్

## వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు | 2470 | 1521 |
| పల్లికాయ (సూక) | 5900 | 3450 |
| పల్లికాయ (పచ్చిది) | 4550 | 1575 |
| కందులు | 5866 | 3022 |
| పెసళ్లు | 8001 | 3022 |
| పత్తి | 7700 | 5300 |
| పసుపు (కాడి) | 11958 | 9534 |
| పసుపు (గోల) | 10521 | 9700 |
| తేజ మిర్చి | 9000 | 8500 |
| తేజ ఏసీ | 13500 | 11500 |
| వండర్‌హాట్ | 11000 | 6000 |
| వండర్‌హాట్ ఏసీ | 14000 | 11500 |
| యూఎస్341ఏసీ | 12000 | 7000 |
| దీపిక | 9000 | 8000 |
| సింగిల్‌పట్టి ఏసీ | - | - |
| తాలు మిర్చి | 6500 | 3000 |

- వరంగల్ వ్యవసాయం

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలంపై రచ్చ

## కేయూలో కేటాయింపుపై భిన్నాభిప్రాయాలు

- విద్యార్థి సంఘాల్లో సానుకూల, వ్యతిరేక స్పందనలు
- పోటాపోటీ ధర్నాలతో వేడెక్కుతున్న క్యాంపస్ వాతావరణం



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల కోసం ప్రతిపాదిత స్థలం కేయూలో గతంలో ఏర్పాటయిన సీఆర్‌పీఎఫ్ క్యాంపు ప్రధాన ద్వారం

హనుమకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయ క్యాంపస్ స్థలంలో ప్రభుత్వ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుపై రచ్చ జరుగుతోంది. స్కూల్‌కు కేయూ భూమి కేటాయింపుపై విద్యార్థి సంఘాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని సంఘాలు సానుకూలంగా స్పందిస్తుండగా మరికొన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేయులో సుమారు 15 ఎకరాలు కేటాయించేందుకు సమ్మతి తెలియచేస్తూ విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశంలో తీర్మానం ఆమోదించిన తర్వాత ఈ చర్చ మొదలైంది. విద్యార్థి సంఘాలు రంగంలోకి దిగాయి. అనుకూల, వ్యతిరేకతలతో వివాదానికి తెరలేపాయి. పోటాపోటీ ధర్నాలతో కేయూక్యాంపస్ వాతావరణం వేడెక్కుతోంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్‌వీ ఈనెల 19న కేయూ బంద్‌కు పిలుపునిచ్చింది. దానిని అడ్డుకునేందుకు అనుకూల విద్యార్థి సంఘాలు సిద్ధమవుతున్నాయి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు అనేది రాష్ట్ర ప్రభుత్వ వినూత్న భావన. విప్లవాత్మకమైన ఆలోచన. ప్రతీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు (వైఐఐఆర్ఎస్) నిర్మించే లక్ష్యంతో తాజాగా మరో 20 పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో పాఠశాలలకు రూ.200కోట్ల చొప్పున మొత్తం రూ.4వేల కోట్లకు పరిపాలనా అనుమతులిస్తూ విద్యాశాఖ కార్యదర్శి జారీచేశారు. గతంలో 58 స్కూళ్లకు అనుమతులు లభించాయి. మొత్తం 78 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయి. తాజాగా 20 నియోజకవర్గాలకు మంజూరైన పాఠశాలల్లో వరంగల్ పశ్చిమ, మహబూబాబాద్‌లు ఉన్నాయి. ఈ పాఠశాలల ఏర్పాటుకు ఒక్కోదానికి గరిష్ఠంగా 15 ఎకరాలు అవసరమవుతుంది.

### వ్యతిరేకత

యూనివర్సిటీ స్థలంలో ఈ స్కూలు ఏర్పాటుపై విద్యార్థి సంఘాలు వ్యక్తం చేస్తున్న వ్యతిరేకతలో కూడా కొంత సహేతుకత లేకపోలేదు. స్కూలుకు విలువైన భూమిని కేటాయించడంవల్ల భవిష్యత్ అవసరాలకు స్థలం లేకుండాపోతుందన్నది ఈ సంఘాల ఆందోళన. ప్రస్తుతం 15 ఎకరాలే తీసుకున్నా భవిష్యత్తులో స్కూలు విస్తరణలో భాగంగా మరింత స్థలం తీసుకోరన్న గ్యారెంటీ లేదంటున్నారు. విశ్వవిద్యాలయం భూములు కబ్జాలకు గురైన నేపథ్యంలో స్కూలుకు స్థలం కేటాయింపుపై సహజంగానే వారిలో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. సమీకృత విద్యాలయం ఏర్పాటుతో పేదవిద్యార్థులకు కలిగే ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని ఎస్ఎస్‌యూతోపాటు మరికొన్ని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం ఉన్న గురుకులాలకు అదనంగా ఏర్పాటయ్యే ఈ విద్యాలయం నగరం నడిబొడ్డున ఉండడం వల్ల పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అట్టడుగు, అణగారిన, నిరుపేదల కుటుంబాల పిల్లల భవిష్యత్ ఉజ్వలంగా మారతాయంటున్నారు.


యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం ప్రతిపాదిత కేయూలోని సీఆర్‌పీఎఫ్ ఖాళీ స్థలం

### నగరం నడిబొడ్డున..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా పాఠశాలను ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో కేయూ ప్రాంగణంలోనే అయితేనే అనుకూలంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. నియోజకవర్గం పూర్తిగా పట్టణ ప్రాంతం కావడంతో ప్రభుత్వ ఖాళీ స్థలాలు అంతగా అందుబాటులో లేవు. హనుమకొండ పట్టణానికే మణిహారంగా నిలువనున్న ఈ స్కూల్‌ను ఏక్కడో ఊరవతల ఏర్పాటు చేయడంకన్నా నగరం నడిబొడ్డున ఉన్న కేయూ పరిధిలో ఏర్పాటు చేయడంవల్ల పేద విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందని, తల్లిదండ్రులకు కూడా స్కూలు దగ్గరగా ఉన్నట్టు ఉంటుందన్న వాదన వినిపిస్తోంది. పైగా కేయూలో ఏర్పాటు చేసేది మరో విద్యా సంస్థనే కనుక ఒక ఉన్నత విద్యాసంస్థ ఆవరణలో మరో విద్యాలయం ఏర్పాటు చేయడంలో తప్పేమీలేదని, పైగా సమగ్రత చేకూరుతుందన్న చర్చ జరుగుతోంది.

### వ్యతిరేకించడం వెనుక రాజకీయ కోణం



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కేయూ స్థలంలో ఏర్పాటును వ్యతిరేకించడం వెనుక రాజకీయ కోణం ఉంది. రూ.200కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో ఈ స్కూల్ ఏర్పాటుతో నాకు ఎక్కడ మంచి పేరు వస్తుందోన్న దుగ్ధతో బీఆర్ఎస్, దాని అనుబంధ విద్యార్థిసంఘం గుడ్డిగా వ్యతిరేకిస్తోంది. యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం నియోజకవర్గం అంతా తిరిగాను. నియోజకవర్గం పూర్తిగా పట్టణ ప్రాంతం కావడం వల్ల ఎక్కడా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవు. చివరికి కేయూలో ఏర్పాటు చేయడం ఒక్కటే మార్గంగా కనిపించి అన్ని విద్యార్థి సంఘాలతో కూలంకషంగా చర్చించాను. అందరు సానుకూలంగా స్పందించారు. ఆ తర్వాత ఇందులో ఒకటి రెండు సంఘాలే ఇప్పుడు వ్యతిరేకిస్తున్నాయి. సీఆర్‌పీఎఫ్ ఖాళీ చేసిన భూమినే అడుగుతున్నాము కానీ కేయూలోని వేరే ఇతర భూములను కాదు. కేయూ స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూలును మొదట్లో వ్యతిరేకించిన ఒకటి, రెండు సంఘాలు తమ తప్పును తెలుసుకొని మద్దతు ఇవ్వడానికి ముందుకు వస్తున్నాయి. బీఆర్ఎస్, దాని అనుబంధ సంఘాలకు ప్రతీది రాజకీయం చేయడం అలవాటుగా మారింది.

\- రాజేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే


ఎంవోయూ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న డైరెక్టర్ ప్రొఫెసర్ సుబుధి, డీన్లు

# నిట్, నార్డ్‌హౌజెన్ వర్సిటీ మధ్య ఎంవోయూ

- అకాడమిక్, పరిశోధనల్లో కొత్త అధ్యాయం
- రెండు సంస్థల మధ్య బలోపేతం కానున్న సహకారం

హనుమకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎన్ఐటీ, నార్డ్‌హౌజెన్ యూనివర్సిటీ ఆఫ్ అప్లయిడ్ సైన్సెస్ (జర్మనీ) మధ్య మంగళవారం అవగాహనా ఒప్పందం కుదిరింది. అంతర్జాతీయ అకాడమిక్, పరిశోధనా సహకారాల్లో కొత్త అధ్యాయానికి ఈ ఒప్పందం నాందీ పలికింది. ఈ వర్చువల్ కార్యక్రమంలో వరంగల్ నిట్ తరుపున డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ పరిశోధన, కన్సల్టెన్సీ డీన్, ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్‌తో పాటు పలువురు ఇతర విభాగాల డీన్లు, అసోసియేట్ డీన్లు పాల్గొన్నారు. నార్డ్‌హౌజెన్ యూనివర్సిటీ పక్షాన ప్రెసిడెంట్ ప్రొఫెసర్ జోర్గ్ వాగ్నర్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ మిస్ జెన్నీ, మిస్టర్ వినోద్ పాల్గొన్నారు. ఉమ్మడి పరిశోధన, అంతర్జాతీయ సమావేశాల సంయుక్త నిర్వహణ వంటి అంశాల్లో ఈ ఒప్పందం రెండు సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేస్తుంది. ఇప్పటికే నిట్ వరంగల్‌కు చెందిన ప్రొఫెసర్ కాకునూరి మనోహర్, నార్డ్‌హౌజేన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సెబాస్టియన్ వోస్‌వింకెల్, భారత దేశం, జర్మనీలోని పరిశ్రమలతోకలిసి ఒకసంయుక్త పరిశోధనాప్రతిపాదనను సమర్పించారు. అవగాహన ఒప్పందం ద్వారా రాబోయే రోజుల్లో మరిన్ని సంయుక్తకార్యక్రమాలు, సందర్శనలు జరుగుతాయనిఇరుపక్షాలు ప్రకటించాయి.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి

- యుద్ధ ప్రతిపాదిక వ్యవసాయ సర్వీసులు మంజూరు
- హనుమకొండ, వరంగల్ ఎస్ఈలు మధుసూదన్ రావు, గౌతంరెడ్డి

రాంగనర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిందించేందుకు అహర్నిశలు శ్రమిస్తూ అనేక చర్యలు చేపడతున్నామని హనుమకొండ, వరంగల్ ఎస్ఈలు మదుసూదన్‌రావు, గౌతంరెడ్డి వేర్వేరు ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ సర్వీసులను యుద్ధ ప్రతిపాదికన మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వరంగల్ సర్కిల్‌లో జూలై 2023 నుంచి జూలై 2024 వరకు 757 సర్వీసులు మంజూరు చేయగా 2024 జూలై నుంచి 2025 జూలై వరకు 824 సర్వీసులు మంజూరు చేశామని దీంతో 67 వ్యవసాయ సర్వీసులు మంజూరు పెరిగాయన్నారు. పొలం బాటలో ఇప్పటి వరకు 1141 లూజ్‌లైన్లు, 445 వంగిన పోల్‌లు, 2965 మధ్య స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హనుమకొండ సర్కిల్‌లో గతంలో 1261 మంజూరైతే ఈ సంవత్సరం 1302 మంజూరు చేయగా, పొలం బాటలో 1216 లూజ్‌లైన్‌లు, 476 వంగిన పోల్‌లు, 3609 మధ్య స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులట్రాన్స్‌ఫార్మర్ల తరలింపులో ఏలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ప్రత్యేక వాహనాలు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు విద్యుత్ సమస్యలపై 1912 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.


లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందిస్తున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

# పేదల కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం

### వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ నిరుపేదల కుటుంబాలకు అండగా ఉంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని కనుకదుర్గా కాలనీలోని ఎంపీ కార్యాలయంలో లబ్ధిదారులకు రూ. 6.20 లక్షల సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పథకం నిరుపేద ప్రజలకు వరం లాంటిదని అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు నిధులు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లపై సమీక్ష

### ఆగస్టు 19-21 తేదీల్లో కేయూలో నిర్వహణ

కేయూ క్యాంపస్ జూలై 15, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ వేదికగా నిర్వహించే ప్రతిష్ఠాత్మకమైన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆగస్టు 19-21 తేదీల్లో నిర్వహిస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ మ్యానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంలు లోకల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ బి. వెంకట్రామిరెడ్డితో కలిసి సమీక్షించారు. ఇప్పటి వర కు జరిగిన ఏర్పాట్లు, మిగిలిన పనులన్ని త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వివిధ కమిటీల బాధ్యతలు, రిసెర్చ్ పేపర్ల సమర్పణ ప్రక్రియ, అతిథులకు వసతుల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, సీహెచ్.సంజీవరెడ్డి, ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, వాసుదేవా రెడ్డి, టి. రవీందర్, ఎస్.జ్యోతి, జె.కృష్ణవేణి, ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సైన్స్ కాంగ్రెస్ మానిటరింగ్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు



సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన పోస్టుకార్డులతో విద్యార్థులు

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి డిగ్రీ విద్యార్థులు మంగళవారం పోస్టు కార్డులు రాశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధి ప్రధాన ఎజెండాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్ధానాలను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో 8,000 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని, దాని కారణంగా డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్‌కుమార్, జిల్లా నాయకులు ముషారఫ్, విజయ్, దీక్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఈవీ జోరు.. ఎంతో హుషారు...

### రహదారులపై ఎలక్ట్రిక్ వాహనాల సందడి

- తక్కువ ఖర్చు.. జీరో మెయింటనెన్స్
- కాలుష్య రహితం.. ఖర్చు మితం
- కొనుగోలుకు మొగ్గు చూపుతున్న మధ్య తరగతి వర్గాలు

లింగాలఘణపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బైక్‌లు, కార్లు రోడ్లపై దూసుకెళ్తున్నాయి. ఇంధన ఖర్చు లేకపోవడం, జీరో మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. పర్యావరణ హితం కావడం, విద్యుత్ వాహనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా ప్రోత్సహిస్తుండటంతో ఇప్పుడు ఈ వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఎనిమిదేళ్ల క్రితమే మార్కెట్లోకి ఆరంగేట్రం చేసిన ఎలక్ట్రిక్ వాహనాలు ఇప్పుడిప్పుడే జనసామాన్యులకు చేరువవుతున్నాయి. ఒక్కసారి కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ వాహనం మూడేళ్ల వరకు ఎలాంటి ఖర్చులు లేకుండా ఇంధన భారం నుంచి పూర్తిగా ఉపశమనం దొరుకుతుండటంతో ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. జనగామ జిల్లా కేంద్రంతో పాటుగా ప్రధానంగా స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రాల్లో హీరో, హోండా, బజాజ్, టీవీఎస్, బుల్లెట్(ఎన్ ఫీల్డ్)లాంటి షోరూమ్‌లతో పాటుగా పలు మల్టీబ్రాండ్ షోరూమ్‌లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం జనగామ జిల్లా వ్యాప్తంగా కార్లు, ఆటోలు, బైక్‌లు, స్కూటర్లు మొత్తం కలిపి 1000కి పైగా ఉన్నట్లు సమాచారం. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలు ఊహించినంత జోరందుకోకపోవడంతో షోరూమ్ నిర్వాహకులు పెద్దగా వాహనాలను అమ్మలేక పోయారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారాలు చేయడం, కొనుగోళ్లను ప్రోత్సహించడంతో అమ్మకాలు జోరందుకున్నాయి.


నర్మెట మండలానికి చార్జింగ్ బైస్కిల్‌పై విధులకు బయలు దేరిన విద్యుత్ శాఖ లైన్ఇన్స్‌పెక్టర్

### ప్రయోజనాలెన్నో..

ఈ వాహనం కొనుగోలు చేసిన నాటి నుంచి మూడేళ్ల దాకా ఎలాంటి సర్వీసింగ్ అవసరం లేదు. అలాగే ఇంధన భారం కూడా ఉండదు. బైక్‌లైతే నాలుగు గంటలు చార్జింగ్ పెడితే చాలు గంటలకు 50 కిలోమీటర్ల స్పీడుతో గరిష్ఠంగా 150 కిలోమీటర్ల దాకా ప్రయాణించే వీలుంటుంది. ఈ బైక్‌లకు, ఎలక్ట్రిక్ ఆటోలకు చార్జింగ్ పెడితే నెలకు 60యూనిట్లు మాత్రమే విద్యుత్ ఖర్చు అవుతుంది. పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనాల అవసరం లేకపోవడంతో పొగ లేకుండా వాతావరణ కాలుష్యం కాకుండా పర్యావరణ హితంగా ఉంటుంది. ఒక్కసారి పెట్టుబడి పెడితే ఐదేళ్ల దాకా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాలపై ప్రయాణించే వీలుంటుంది.

### ఉపాధి మార్గంలో ఎలక్ట్రిక్ జోరు..

ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి రావడంతో స్వయం ఉపాధి మార్గాలకు చెందిన అనేక మంది ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. చిరువ్యాపారులు, కిరాణా షాపులకు వస్తువులను డెలివరీ చేసే వర్తకులు, డోర్‌డెలివరీ లాంటి వ్యాపారులు ప్రధానంగా ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఎలక్ట్రిక్ ఆటోల్లో గూడ్స్‌ను డెలివరీ చేస్తూ ఎంతో మంది ఉపాధి పొందుతుండటం గమనార్హం. ఇంధన వ్యయం లేకపోవడం, జీరో మెయింటనెన్స్ కావడంతో గతంతో పోల్చితే మరిన్ని లాభాలు వస్తున్నట్లు చిరువ్యాపారులు పేర్కొంటున్నారు.




వరంగల్-హైద్రాబాద్ రహదారిపై పరుగులు పెడుతున్న ఎలక్ట్రిక్ బస్, (ఇన్‌సెట్‌లో) జనగామ-పాలకుర్తి రోడ్డుపై ప్యాసింజర్ ఆటో ట్రిప్‌లు వేస్తున్న ఆటో డ్రైవర్

### రహదారులపై రయ్..రయ్..

ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటర్లు మాత్రమే కాకుండా ఇప్పుడు జాతీయ రహదారులపై పరుగులు పెడుతున్న కార్లు, బస్సులు రాజసాన్ని ఒలకబోస్తున్నాయి. తక్కువ ఖర్చుతో చార్జింగ్‌తో రెండు వందల కిలోమీటర్ల దాకా ఈ-మైలేజీ వస్తున్న వాహనాల్లో బస్సులు పలు సంస్థలకు కీలకంగా ఉపకరిస్తున్నాయి. ఇన్నాళ్ల నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సైతం చార్జింగ్ బస్సులను అనేక రూట్లలో నడిపిస్తూ లాభాలను గడిస్తుండటం గమనార్హం. సంపన్న వర్గాలకే పరిమితమైన కార్లు ఇప్పుడు ఎలక్ట్రిక్ చార్జింగ్ రూపంలో సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చి రోడ్లపై రయ్‌మంటూ పరుగులు తీస్తున్నాయి.

### మూడేళ్లుగా రూ.2.27 లక్షలు ఆదా చేశాను



మూడేళ్ల క్రితం రూ. 3.60 లక్షలు ఖర్చు చేసి చార్జింగ్ ఆటోను కొనుగోలు చేశాను. ఇప్పటి వరకు 68,140 కిలోమీటర్లు నడిపాను. లీటర్ డీజిల్‌కు 30 కిలోమీటర్ల మైలేజీ లెక్కన 2,271 లీటర్ల డీజిల్ కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఆ లెక్కన నాకు రూ.2.27 లక్షలు ఆదా చేయగలి గాను. నాకు చార్జింగ్ కోసం సగటున నెలకు రూ.500 ఖర్చు మినహా ఇంకా ఎలాంటి ఖర్చులు లేవు. అదే డీజిల్ ఆటో అయితే ఒక్కరితో ప్రయాణించినా ఇద్దరితో ప్రయాణించిన సగటున 150 కిలోమీటర్ల దూరం ఆటో నడిపితే రూ. 500 ఖర్చు అవుతుంది. కానీ చార్జింగ్ ఆటోకు మాత్రం రూ. 20కి మించి ఎలాంటి ఖర్చు కానేకాదు.

\- చిదిరాల కృష్ణమూర్తి, ప్యాసింజర్ ఆటో డ్రైవర్, తొర్రూర్(జె)

## 250 మంది విద్యార్థులకు స్టేషనరీ అందజేత

మడికొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మడికొండలోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యుత్‌శాఖకు చెందిన మిత్ర బృందం మంగళవారం 250 మంది విద్యార్థులకు స్టేషనరీ, స్కూల్ బ్యాగులు పంపిణీ చేసి దాతృత్వం చాటుకున్నారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ.జాన్సన్, విద్యావిభాగం కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బద్దం సుదర్శన్ రెడ్డి, కాజీపేట ఎంఈవో బి. మనోజ్‌కుమార్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మడికొండ మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న దాతలు



బీసీల మహా ధర్నకు తరలి వెళ్తున్న దాస్యం వినయ్ భాస్కర్, బీసీ సంఘాల నాయకులు

## ఆర్డినెన్స్ పేరుతో ప్రభుత్వం కాలయాపన

### బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆర్డినెన్స్‌ల పేరుతో బీసీ రిజర్వేషన్లపై కాలయాపన చేస్తుందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించే హలో బీసీ - చలో హైదరాబాద్ మహా ధర్నా కార్యక్రమానికి హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి బీసీ సంఘాల నాయకులతో కలిసి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చిత్త శుద్ధి ఉంటే వెంటనే బీసీ రిజర్వేషన్ చట్టం చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పులి రజినీకాంత్ ముదిరాజ్, దూలం వెంకన్న గౌడ్, పోలపెల్లి రాంమూర్తి, చెన్నం మధు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగకు విస్తృత ఏర్పాట్లు చేయండి

### వరంగల్ మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నగర వ్యాప్తంగా శ్రావణ మాసంలో జరుగనున్న పోచమ్మ బోనాల పండగకు ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం మునిసిపల్ ప్రధాన కార్యాలయంలో మేయర్ చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. శ్రావణ మాసంలో పోచమ్మ బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నగరంలోని అన్ని ఆలయాలకు లైటింగ్ ఏర్పాటతో పాటు అంతర్గత రహదారులకు డస్టింగ్ వేయాలన్నారు. ఇంకా 66 డివిజన్‌ల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, సంతోష్‌బాబు, మాధవిలత, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## జీపీ ఉద్యోగుల జిల్లా జేఏసీ కమిటీ ఎన్నిక



జేఏసీ చైర్మన్‌గా శివ, ప్రధాన కార్యదర్శిగా రాజు

వడ్డెపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, కారోబార్, బిల్ కలెక్టర్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) హనుమకొండ జిల్లా నూతన కమిటీని రాష్ట్ర జేఏసీ ఆదేశాల మేరకు మంగళవారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో జేఏసీ రాష్ట్ర నేతలు చాతల్ల సదానందం, వంగ రవీందర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ జిల్లా చైర్మన్ తగరం శివ, ప్రధాన కార్యదర్శిగా పెంబర్తి రాజు, కోశాధికారిగా పర్శ భాస్కర్, గౌరవ అధ్యక్షుడిగా అలువాల సుదర్శన్, ఉపాధ్యక్షులుగా మడిపెల్లి కుమారస్వామి, బత్తిని అశోక్‌లను ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా కట్కూరి శ్రీనివాస్, పల్నాటి రమేష్, ప్రచార కార్యదర్శులుగా వడ్డెపల్లి రాంబాబు, శ్రీపతి కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నీలం కుమార్, మామిండ్ల రమేష్, మీడి యా ఇన్‌చార్జిలుగా యజ్జం సురేష్, కుక్కముడి నరేష్, మడూరి శ్యాంకుమార్, గౌరవ సలహాదారులుగా కుమ్మరి నగేష్, వెనుకమూరి ఆనందరావులు ఎన్నికయ్యారు.

## పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య రక్షణ కిట్ల పంపిణీ



ఆరోగ్య రక్షణ కిట్లను పంపిణీచేస్తున్న కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్

హసన్‌పర్తి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రంలో పారిశుధ్య కార్మికులకు మంగళవారం కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ చేతులమీదుగా మహానగర పాలక సంస్థ అందిస్తున్న ఆరోగ్యరక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. పారిశుధ్య కార్మికులు లేని సమాజాన్ని ఊహించుకోలేమన్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సమస్యలపై కార్పొరేషన్ చూపిస్తున్న చొరవ అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో సానిటరి ఇన్‌స్పెక్టర్ భాషానాయక్, జవాన్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## కేయూలో సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలి

కేయూ క్యాంపస్ జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేయూలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కారించాలని కేయూ విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని తన చాంబర్‌లో కలిసి సెక్యూరిటీ గార్డుల సమస్యలను విన్నవించారు. వర్సిటీలో సెక్యూరిటీ గార్డులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, కనీస వేతనాలకు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు జతల యూనిఫాంతో పాటు ప్రతీ నెల ఒక్కొక్కరికి రెండు రోజుల సెలవులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. గతంలో రూ. 16 వేల జీతం ఇవ్వగా ప్రస్తుతం నెలకు రూ. 10.500లు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. తక్కువ వేతనాలు ఇచ్చే వారికి టెండర్లు రద్దు చేయాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. కార్మికుల ఇబ్బందులను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు డి. తిరుపతి, కేతపాక ప్రసాద్, కె.ప్రశాంత్, నరేశ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మడికొండ జెడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న బద్దం సుదర్శన్‌రెడ్డి

మడికొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బద్దం సుదర్శన్‌రెడ్డి సూచించారు. మడికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సహారా క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను గ్రహించి చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థినులు, మహిళలపై సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బి.మనోజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు బి. సంధ్యారాణి, ఎస్సై రాంమోహన్, హెడ్ కానిస్టేబుల్ జి. జయరాజు, సహారా క్లబ్ సభ్యులు కె.మాధవరెడ్డి, పి. రెబెకా, విరాట్‌మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెరువుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు
- గోపాల్‌పూర్ ఊర చెరువును సందర్శించిన ఎమ్మెల్యే, మేయర్ గుండు సుధారాణి



ఐబీ, మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి

వడ్డెపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చెరువుల పరిరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్‌పూర్ ఊర చెరువును నీటి పారుదల శాఖ, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాల్‌పూర్‌లోని ఊర చెరువు కబ్జా కాకుండా సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు జరిగాయని అన్నారు. వడ్డెపల్లి చెరువు నుంచి వచ్చే వరదనీరు నేరుగా గోపాల్‌పూర్ చెరువు నుంచి వెళ్లే విధంగా తగిన ప్రణాళిక ఏర్పాటు చేసి కాలువ నిర్మాణం చేపట్టాలన్నారు. ఎఫ్‌టీఎల్‌లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేంది లేదని హెచ్చరించారు. డ్రోన్ల సహాయంతో ప్రభుత్వం ఇప్పటికే సర్వే నిర్వహించి ఎఫ్‌టీఎల్‌లో హద్దులను అధికారులు ఏర్పాటు చేశారని మురుగునీరు చెరువులో నిల్వకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారు లను ఆదేశించారు. గోపాల్‌పూర్ చెరువు సుందరీకరణ వల్ల చెరువులో నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు అడుగంటి పోకుండా ఉండడంతో పాటు బోర్లు, బావుల్లో నీటి సామర్థ్యం నిల్వ పెరుగుతుందని పేర్కొన్నారు. వడ్డెపల్లి చెరువు నుంచి గోపాల్‌పూర్ చెరువు కట్ట నుంచి వంద ఫీట్ల రోడ్డు వరకు అండర్ డ్రైనేజీతో పాటు డ్రాప్‌వాల్ నిర్మించాలని సీపీఎం నేత వాంకుడోతు వీరన్న, ఎమ్మెల్యే నాగరాజుకు, మేయర్ సుధారాణికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, 56వడివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకా హరిబాబు, కాంగ్రెస్ శ్రేణులు తుపాకుల దశరథం, కందుకూరి పూర్ణచందర్, చింత రమేష్‌గౌడ్, పింగిళి అశోక్‌రెడ్డి, రుద్రోజు మణీంద్రనాథ్, దూలం సదానందంగౌడ్, దూలం పెద్ద రాజు గౌడ్, పరమేశ్ గౌడ్, భూక్యా విజయ్ నాయక్, మున్సిపల్ ఈఈ సంతోష్‌బాబు, ఏసీపీ ప్రశాంత్, ఐబీ డీఈ హర్షవర్ధన్, రవికిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మికంగా శానిటేషన్ పనుల తనిఖీ

### జెమినీ టాకీస్ వద్ద డ్రైన్ పరిశీలించిన మేయర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి వరంగల్ జెమినీ టాకీస్ ప్రాంతంలో మంగళవారం శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. జేసీబీ ద్వారా డ్రైన్‌లో పూడిక తీత పనులను పరిశీలించి అక్కడి సిబ్బందికి తగు సూచనలు చేశారు. సమర్థవంతంగా పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైన్‌లలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా వర్షపు నీరు నిలువకుండా సాఫీగా ప్రవహిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ ధ్యేయం

మడికొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్‌టీయూ పనిచేస్తుందని యూనియన్ జిల్లా కార్యదర్శి పలిత శ్రీహరి అన్నారు. కాజీపేట మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం సందర్శించి యూనియన్ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా శ్రీహరి మట్లాడుతూ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి నాయకత్వంలో ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ కాజీపేట మండల శాఖ అధ్యక్షుడు దేవిరెడ్డి మాల కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి జైవీర ప్రతాప్, రాష్ట్ర బాధ్యులు హన్య నాయక్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు దండ కోమల్ రెడ్డి, మండల బాధ్యులు భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్ల ఫీజులను తగ్గించాలి

### కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డికి స్కాలర్ల వినతి

కేయూ క్యాంపస్ జూలై 15, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ రెన్యూవల్ ఫీజులను తగ్గించాలని, ఫీజుల చెల్లింపు గడువును పొడిగించాలని, ప్రీ పీహెచ్‌డీ ఎగ్జామ్స్ నిర్వహించాలని కేయూ స్కాలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కేయూ స్కాలర్ల బృందం కలిశారు. ఫీజులను తగ్గించాలని, రెన్యూవల్ ఫీజులను తగ్గించాలని, ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించాలని వినతి పత్రాన్ని అందచేశారు. ఫీజుల తగ్గింపుపై సానుకూలంగా స్పందించినట్లు స్కాలర్లు వెల్లడించారు. 2,3 రోజులలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించి ఫీజులపై తుది నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులుఅంకిళ్ళ శంకర్, కేతపాక ప్రసాద్, దొగ్గెల తిరుపతి, కె.ప్రశాంత్, పసుల జానకిరామ్, నరేశ్, తిరుపతి, శ్రీకాంత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోమన్న

## ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న

న్యూశాయంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డీకన్వెన్షన్‌హాల్‌లో మంగళవారం వీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల జిల్లా సమీక్షా సమావేశం ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కందుకూరి సోమన్న మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాకముందు ఇచ్చిన హామీలు ప్రభుత్వం వచ్చాక నెరవేర్చకుండా మోసం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచి వికలాంగులకు రూ.6000, వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడి కార్మికుల పెన్షన్ 4వేలు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పటివరకు హామీ నిలబెట్టుకోకపోవడం సిగ్గుచేటన్నారు.

పెన్షన్‌దారుల పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న ఉమ్మడి జిల్లా సదస్సును నిర్వహిస్తున్నామని, జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి పెన్షన్‌దారులు సదస్సుకు తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో బండారి సురేందర్, శ్రీనివాస్, దూడల శ్రీనివాస్, వినోద్‌రెడ్డి, పవన్, నారాయణ పాల్గొన్నారు.

# భర్త వేధింపులకే బలైపోయింది...

(5వ పేజీ తరువాయి)



నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ బానోతు శృతిని పిలిపించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పెద్దసంఖ్యలో ఫాలోవర్లు ఉండటంతో ఆమెను ఎంచుకున్నారు. ఈ క్రమంలోనే సృజన్‌ను ఆమె ఇంటర్వ్యూ చేసింది. ఈ సమయంలో ఏర్పడిన పరిచయం వారిని సన్నిహితం చేసింది. చనువుగా ఉండటమే కాకుండా, ఇరిద్దరూ నిత్యం చాటింగ్ చేసుకునేవారు. ఇది గమనించిన ప్రత్యూష సృజన్‌తోపాటు శృతిని హెచ్చరించింది. అయినా తీరు మారకపోవడంతో ప్రత్యూష ఆమె భర్త సృజన్‌ల మధ్య నిత్యం గొడవలు జరిగేవి. ఈ విషయాన్ని ప్రత్యూష తన అత్తామామలకు చెప్పినప్పటికీ వారు పట్టించుకోకపోగా అతడిని సమర్థించారు. సమస్య పరిష్కారం కాకపోగా, భర్త, అత్తామామల నుంచి వేధింపులు పెరగడంతో ప్రత్యూష మనస్తాపం చెందింది. ఈ క్రమంలో శృతి కూడా ఫోన్ చేసి మాట్లాడిన తీరు ఆమెను మనోవేదనకు గురిచేసింది. ఈ క్రమంలోనే ఈ నెల 12వ తేదీ శ నివారం సృజన్ తల్లిదండ్రులు వారి ఇద్దరు పిల్లలను తీసుకొని భద్రాచలంలో బంధువుల ఇంటికి వెళ్ళారు. 13న సృజన్ తన స్నేహితులతో కలిసి బొగత జలపాతానికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. శృతి విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే ప్రత్యూష గదిలోకి వెళ్ళి గడియవేసుకుంది. అరగంట తర్వాత సృజన్ వెళ్లి పిలిచినప్పటికీ ఆమె నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో, అనుమానం వచ్చి డోర్‌కు రంధ్రం చేసి చూడగా ప్రత్యూష చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించింది. దీంతో సృజన్ తన స్నేహితులైన శివరాం దంపతులను పిలిచి తలుపు గడియలు పగులగొట్టి ప్రత్యూషను అరెపల్లిలోని ఎస్ఎస్ఆర్ ఆపోలో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రత్యూష తల్లి పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు భర్త సృజన్, అత్తామామలు మధుసూదన్ పుణ్యవతి, బానోతు శృతిపై కేసు నమోదు చేశామని,మంగళవారం వారిని అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు ఖమ్మం జైలుకు తరలించామని ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

# 'స్థానిక' పోరుకు సన్నాహాలు

(5వ పేజీ తరువాయి)

మండలాలు, మునిపాలిటీలు ఏర్పాటు జరగనందు వల్ల మార్పులు జరగలేదు.

**వరంగల్ జిల్లాలో..**

వరంగల్ జిల్లాలో జడ్పీటీసీ స్థానాలో మార్పులు ఏమి జరగలేదు. ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. నర్సంపేట మున్సిపాలిటీలో 8 గ్రామాలు మహేశ్వరం, రాజపల్లె, రాములు నాయక్ తండా, మాదన్నపేట, పస్రానాయక్ తండా, ముత్తోజిపేటతో పాటు మరో గ్రామం విలీనం అయ్యాయి. ఫలితంగా నాలుగు ఎంపీటీసీ స్థానాలు మాదన్నపేట, ముత్తోజిపేట, మహేశ్వరం, రాజుపల్లె ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి.

**జనగామ జిల్లాలో..**

జనగామ జిల్లాలో మొత్తం 12 జడ్పీటీసీ స్థానాలు యథాతదంగా ఉన్నాయి. ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఇప్పటి వరకు 140 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటి సంఖ్య 134కు తగ్గింది, కొత్తగా ఏర్పాటయిన స్టేషన్ ఘన్‌పూర్ మునిసిపాలిటీలో ఆరు ఎంపీటీసీలు విలీనం అయ్యాయి. ఘన్‌పూర్‌లోని మూడు, శివునిపల్లిలో 2, చాగల్ 1 వీటిలో ఉన్నాయి.

**మహబూబాబాద్ జిల్లాలో..**

మహబూబాబాద్ జిల్లాలోనూ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు చేర్పులు జరిగాయి. ఈ జిల్లాలో మొదట 16 జడ్పీటీసీలు ఉండగా ఇనుగుర్తి, సీరోలు మండలాలు ఏర్పాటు కావడంతో అదనంగా 2 వచ్చి చేరాయి. దీనితో వీటి సంఖ్య 18కి చేరింది. ఇంతకు ముందు ఎంపీటీసీలు 196 ఉండగా కొత్తగా ఆవిర్భవించిన కేసముద్రం మున్సిపాలిటీలో అయిదు గ్రామాలు విలీనం కావడంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 193కు తగ్గింది.

**ములుగు జిల్లాలో..**


ములుగు జిల్లాలో సైతం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు జరిగాయి. ఈ జిల్లాలో ఇంతకు ముందు 9 జడ్పీటీసీలు ఉండగా జడీ మల్లంపల్లి మండలం కొత్తగా ఏర్పాటయింది. దీనితో వీటి సంఖ్య 10కి పెరిగింది. ఎంపీటీసీ స్థానాలు 87 నుంచి 83కు తగ్గాయి. కొత్తగా ములుగు మున్సిపాలిటీ కావడంతో బండారుపల్లి, జీవంతరావుపేట, మరో గ్రామం ఇందులో విలీనం అయ్యాయి. దీనితో ఎంపీటీసీల సంఖ్య 83కు తగ్గాయి.

**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా స్థానిక సంస్థల సంఖ్యలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ జిల్లాలో ఇంతకు ముందు 11 మండలాలు ఉండగా గోరికొత్తపల్లి మండలంగా ఏర్పడడంతో జడ్పీటీసీల సంఖ్య 12కు చేరుకున్నది, ఎంపీటీసీ స్థానాలు 106 నుంచి 109కి పెరిగాయి.

### మ్యాప్‌ల ఏర్పాటు

పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో సిబ్బంది ఎన్నికల సంఘం పోర్టల్‌లో మారిన స్థానాల వారీగా కొత్త మ్యాప్‌లను తయారు చేస్తున్నారు. వీటి ఆధారంగానే రూట్ మ్యాప్‌లను సిద్ధం చేస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి వేర్వేరుగా ఆయా స్థానాలను బట్టి ఎంత మంది ఓటర్లున్నారో కూడా మ్యాపింగ్ చేస్తున్నారు. వీటిని బట్టి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఉంటుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో బ్యాలెట్ పెట్టెలు సిద్ధం చేశారు.



ఐసీసీసీ సెంటర్‌ను మానిటరింగ్ చేస్తున్న కమిషనర్

## చెత్త తరలింపు వాహనాలను మానిటరింగ్ చేయాలి

### మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూలై 15(ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరం నుంచి మడికొండ డంపింగ్ యార్డ్‌కు చెత్త తరలిస్తున్న వాహనాలను మానిటరింగ్ చేయాలని వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. మంగళవారం గ్రేటర్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ నిర్వహిస్తున్న తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నా రు. ఈ సందర్భంగా ఐసీసీసీ అధికారులు వేరియబుల్ మేనేజ్ డిస్పోజబుల్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీఐఎస్ డేటా సెంటర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ పని తీరును కమిషనర్‌కు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తరలింపుకు వాహనాలను ట్రాకింగ్‌చేయాలన్నారు. శానిటేషన్ పని తీరుపై అధికారులు ప్రతీ రోజు పర్యవేక్షించాలన్నారు. జీడబ్ల్యుఎంసీ వాహనాలు మానిటరింగ్ చేయడానికి ఒక అధికారిని నియమించి 24/7 మానిటరింగ్ చేయాలన్నారు. ఐటీ ఇంచార్జ్ రమేష్, మాట్రిక్స్ సొల్యూషన్ ప్రతినిధులు నర్సింహ, నికిషా, బెంజిమెన్, శ్రీధర్, కాశీవిశ్వనాథ్‌లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం శాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రకాశ్‌రెడ్డిపేట, పోస్టల్ కాలనీ, పోలీస్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు.

# రైతులపై పెట్టుబడి పెట్టండి

## ఫలించిన తుమ్మల భగీరథ యత్నం

» వైరా రిజర్వాయర్‌కు గోదారి జలాలు

» నిమ్మ వాగు ద్వారా నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఖమ్మం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోని వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించాలన్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. భగీరథ ప్రయత్నం ఎట్టకేలకు ఫలించింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్‌పీ) లెఫ్ట్ కెనాల్ ద్వారా సకాలంలో నీరు రాని పక్షంలో గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తరలించాలన్నది సంకల్పం. ఇందుకోసం సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ 100.225 కి.మీ వద్ద నిర్మించిన సర్‌ప్లస్ రెగ్యులేటర్ నుంచి మొదలైన రాజీవ్ లింక్ కెనాల్‌ను ఎన్ఎస్‌పీ 21వ మెయిన్ బ్రాంచ్ కెనాల్ (52వ కి.మీ)కు అనుసంధానం చేశారు. 52 కి.మీ క్రాస్ రెగ్యులేటర్‌ను మూసేసి.. 39 కి.మీ. క్రాస్ రెగ్యులేటర్‌ను ఎత్తేశారు. అక్కడికి సమీపంలోని ఎస్కేప్ లాకుల నుంచి ఎర్రబోడు తండా వద్ద గల నిమ్మ (వెదుళ్ల) వాగులోకి వైరా ఎమ్మెల్యే మాళోతు రాందాస్ నాయక్ మంగళవారం గోదావరి జలాలను అట్టహాసంగా విడుదల చేశారు.



గతేడాది ఆగస్టులో వైరా రిజర్వాయర్ వద్ద కృష్ణాజలాలకు నమస్కరిస్తున్న మంత్రి తుమ్మల

దీంతో ఎస్కేప్ లాకుల నుంచి 22 కి.మీ దూరంలోని వైరా రిజర్వాయర్‌కు నిమ్మవాగును అనుసంధానించారు. తద్వారా బుధవారం వైరా రిజర్వాయర్‌ను గోదావరి జలాలు ముద్దాడనున్నాయి. ఏపీలో పట్టిసీమ తరహాలో ఖమ్మం జిల్లా ఏన్కూర్ వద్ద నిర్మించిన రాజీవ్ లింక్ కెనాల్‌తో సుమారు లక్షన్నర ఎకరాల భూమికి సాగు నీరందనున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు అసంపూర్తిగా నిలవడంతో.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి తుమ్మల పట్టుబట్టి రాజీవ్ లింక్ కెనాల్ మంజూరు చేయించడంతోపాటు శంకుస్థాపన.. అటుపై శరవేగంగా పనులు పూర్తి చేశారు. ఈ లింక్ కెనాల్‌తో ఏడు వేల ఎకరాలు, వైరా, లంకా సాగర్ రిజర్వాయర్లు, ఎన్ఎస్పీ ఆయకట్టు పరిధిలోని 1.25 లక్షల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు అందుబాటులోకి వస్తాయి.

# పరిశ్రమలకు త్వరలో హరిత ఇంధనం

» సింగిల్ టైమ్ సెటిల్‌మెంట్‌గా విద్యుత్ బిల్లుల పరిష్కారం

» ఎఫ్‌టీసీసీఐ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో భట్టి



ఎఫ్‌టీసీసీఐ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, గన్‌ఫౌండ్రీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పరిశ్రమలకు త్వరలో హరిత ఇంధనాన్ని సరఫరా చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన నగరంలోని 'ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ)' నూతన కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఫోర్త్ సిటీగా పరిగణిస్తోన్న ఫ్యూచర్ సిటీ రాష్ట్రానికి ఒక గేమ్ చేంజర్ కాబోతుందని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజినల్ రింగ్ రోడ్డు పనులు పూర్తయితే హైదరాబాద్ అభివృద్ధి ఎవరి ఊహకు అందదని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుకు, ఔటర్ రింగ్ రోడ్డుకు మధ్య ఐటీ, ఫార్మా, హౌజింగ్ వంటి క్లస్టర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రచిస్తున్నామని, వాటిని అభ్యుదయ పారిశ్రామికవేత్తలకు కేటాయించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. తమది ప్రజల ప్రభుత్వమని, పారిశ్రామికవేత్తల కోసం ద్వారాలు తెరిచే ఉంటాయని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు చిన్న సమస్య వచ్చినా స్పందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు యావత్తు మంత్రిమండలి సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పారిశ్రామికవేత్తలు కోరినట్లు పెండింగ్‌లో ఉన్న విద్యుత్తు బిల్లులను సింగిల్ టైమ్ సెటిల్‌మెంట్ కింద పరిష్కరించే ఆలోచన చేస్తామన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు హైదరాబాద్ నగరం అత్యంత అనుకూలమైనదని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని జోడెడ్లుగా భావించి ప్రభుత్వం ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు విదేశాల్లో పర్యటించి రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా ఒప్పందాలు చేసుకున్నారన్నారు. రాష్ట్రంలో రెప్పపాటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరుగుతుందని, త్వరలో పరిశ్రమలకు 'గ్రీన్ పవర్'ను సరఫరా చేసే ఆలోచన ఉందని తెలిపారు. ఎఫ్‌టీసీసీఐకి వందేళ్లకు పైగా చరిత్ర ఉందని, పరిశ్రమలకు ఒక మార్గదర్శిగా నిలిచిందన్నారు. హైదరాబాద్ వర్తక నగరంగా ఉన్న కాలం నుంచి అంతర్జాతీయ నగరంగా ఎదిగే ప్రతి దశలోనూ ఎఫ్‌టీసీసీఐ పాత్ర ఉందన్నారు. హైదరాబాద్ వంటి ఆవిష్కరణల కేంద్రాల ద్వారా సంపద సృష్టించి, దాన్ని ప్రజలకు న్యాయంగా, సమానంగా పంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాల సరసన నిలబెట్టే లక్ష్యంతో మౌలిక సదుపాయాలు, టెక్నాలజీ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో

# 'నారాయణ' విద్యార్థికి పతకం

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్-2025లో నారాయణ విద్యార్థి బంగారు పతకం సాధించాడు. యూఏఈలో ఇటీవలే జరిగిన ఒలింపియాడ్‌లో తమ విద్యార్థి కుచ్చి సందీప్ విజయం సాధించడం తమకెంతో గర్వకారణమని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విజయం వెనక తమ విద్యాసంస్థ మద్దతు, అధ్యాపకుల ప్రోత్సాహం ఉందని ఈ సందర్భంగా కుచ్చి సందీప్ అన్నారు. జేఈఈ, నీట్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ ఒలింపియాడ్‌లలో తమ విద్యార్థులు సత్తా చాటుతున్నారని డైరెక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా బంగారు పతకం సాధించిన సందీప్‌ను వారు అభినందించారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం, వంశీ కృష్ణ తదితరులు

## బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్‌ను అడ్డుకోవద్దు

» కోర్టుల్లో పిటిషన్లపై ఏ న్యాయవాదీ వాదించొద్దు : కృష్ణయ్య

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో తీసుకొచ్చిన 42 శాతం రిజర్వేషన్లపై జారీ చేసే ఆర్డినెన్స్‌ను ఎవరూ అడ్డుకోవద్దని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కోర్టుల్లో పిటిషన్‌లు వేస్తే ఏ న్యాయవాది కూడా వాదించవద్దని కోరారు. మంగళవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో హైకోర్టు బీసీ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ జారీ చేసిన తర్వాత ఏదైనా న్యాయపరమైన సమస్యలు ఎదురైతే సమర్థవంతంగా ఎదుర్కోవడానికి గల అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ జారీ చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఎవరైనా న్యాయస్థానాల ద్వారా బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే వాటిని నివారించడానికి సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ పిటిషన్లను వేయాలని డిమాండ్ చేశారు.

## నల్లగొండ జిల్లాలో సవాళ్ల పర్వం

» వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఒక్క సీటు కూడా గెలవనివ్వను

» మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి సవాల్

» దమ్మలుంటే రాజీనామా చేయ్

» నువ్వు గెలిస్తే రాజకీయ సన్యాసం: వేముల

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు సాగాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి తానొక్కడినే ఎమ్మెల్యేగా గెలిచానన్న మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 12 సీట్లూ బీఆర్ఎస్ గెలవడం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఒక్క సీటు కూడా గెలవనివ్వబోనని చాలెంజ్ చేశారు. ఆయన సవాల్‌పై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి (భువనగిరి), వేముల వీరేశం (నకిరేకల్) ప్రతిస్పందించారు. 'జగదీశ్‌రెడ్డి.. దమ్మలుంటే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేయ్. నీ మీద నేను గానీ, బీర్ల అయిలయ్య గానీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. సూర్యాపేటలో మళ్లీ నువ్వు గెలిస్తే నేను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా' అని వీరేశం సవాల్ చేశారు. బీజేపీతో లాలూచీ వల్లే సూర్యాపేటలో జగదీశ్ రెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాడని అనిల్ కుమార్ రెడ్డి ఆరోపించారు. బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గంజాయి మొక్కలాంటి వాడు జగదీశ్ రెడ్డి అని ఆరోపించారు.

## కేటీఆర్..! ముందు పార్టీని చక్కదిద్దుకో:

» లేకుంటే మీ చెల్లి హైజాక్ చేసేలా ఉంది: మేడిపల్లి

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ముందు తన ఇంటిని, పార్టీని చక్కదిద్దుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హితవు చెప్పారు. లేకుంటే పార్టీని ఆయన చెల్లెలు కవిత హైజాక్ చేసేలా ఉందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ తన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఊడిపోకుండా చూసుకోవాలని సూచించారు. రైతులు పచ్చగా ఉంటే కేటీఆర్ ఓర్చుకోలేక పోతున్నారని ఆరోపించారు.

# సీపీఐ నేత దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

అక్కడికొచ్చారు. చందు నాయక్‌ను వెంబడించి ఆయన కళ్లలో కారంకొట్టి.. తుపాకీతో ఐదు రౌండ్లు కాల్పులు జరిపారు. మూడు బుల్లెట్లు ఆయన శరీరంలోకి దూసుకెళ్లాయి. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. వచ్చిన కారులోనే దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. మలక్‌పేట సీఐ నరేశ్ తన సిబ్బందితో ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. ఘటనా స్థలంలో రెండు బులెట్లను పోలీసులు గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నారు. సౌత్‌ఈస్టు జోన్ డీసీపీ చైతన్య కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చందు నాయక్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం నర్సాయిపల్లి గ్రామం. ఆయన సీపీఎంఎల్ పార్టీలో క్రియాశీలకంగా ఉండేవారు. కొన్నాళ్ల తర్వాత సీపీఐలో చేరారు. అప్పట్లో ఇదే పార్టీకి చెందిన మాజీ నక్సలైట్ రాజేశ్‌తో చందునాయక్ సన్నిహితంగా ఉంటూ నాగోల్‌లోని సాయినగర్‌లో గల ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేయించారు. అగ్నిప్రమాదంలో గుడిసెలు దగ్ధం కావడంతో.. భాను అనే వ్యక్తి గుడిసె కూడా కాలిపోయింది. అప్పట్లో చందు నాయక్, రాజేశ్ కలిసి భానుకు గుడిసె వేయించి అండగా నిలిచారు. కాగా భాను.. గుడిసెవాసులతో ప్రత్యేకంగా గ్రూప్ ఏర్పాటు చేసుకొని నాయకుడిగా చలామణి అయ్యాడు. ఈ క్రమంలో చందు నాయక్-భాను మధ్య వివాదం తలెత్తింది. చందునాయక్.. భానుకు వ్యతిరేకంగా ఉన్న కొందరిని కూడగొట్టుకొని 2022 ఏప్రిల్‌లో అతడిని హత్య చేయించినట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. భాను మృతదేహాన్ని కారులో తరలించి ఖమ్మం జిల్లా పాలేరు సమీపంలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువలో పడేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. భాను హత్యకు పథకం వేయడం, నిందితుల బెయిల్, కోర్టు ఖర్చులన్నీ చందునాయక్ చూసుకున్నట్లు పోలీసులు తేల్చారు. భాను హత్యకేసులో చందునాయక్‌ను ఏ-2గా చేర్చారు. ఇక హయత్‌నగర్ కుంట్లూరులో రావి నారాయణరెడ్డి నగర్‌లోని ఖాళీ స్థలంలో మరోమారు సీపీఐ ఆధ్వర్యంలో నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారు. ఇందులో కూడా చందు నాయక్ జోక్యం



చందు నాయక్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చేసుకొని తన అనుయాయులకు గుడిసెలు వేయించేందుకు ప్రయత్నించగా రాజేశ్ అడ్డుపడ్డట్లు సమాచారం. గుడిసెలు వేయించినందుకుగాను ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేశారని.. ఆ సొమ్ము పంపకాల్లో విభేదాలు తలెత్తడంతో చందునాయక్, రాజేశ్ మధ్య వివాదం మొదలైనట్లు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ ల్యాండ్ సెటిల్‌మెంట్ల విషయంలోనూ వీరి మధ్య వివాదాలు తలెత్తడంతో ప్రత్యర్థులుగా మారిపోయినట్లు తెలుస్తోంది.

### ముందురోజు రాత్రి రెక్కీ

ఇద్దరి మధ్య తలెత్తిన వివాదాల నేపథ్యంలో చందు నాయక్ హత్యకు రాజేశ్ పథకం వేసినట్లు తెలిసింది. సోమవారం రాత్రి చందు నాయక్ ఇంటి సమీపంలో రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. ఇంటి బయట కొందరు తచ్చాడుతున్నట్లు కనిపించడాన్ని గుర్తించిన చందు నాయక్ భార్య నారిబాయి.. భర్తను అప్రమత్తం చేసింది. దీంతో చందు నాయక్ రాత్రి ఇంటి నుంచి బయటికి రాలేదు. మంగళవారం ఉదయం ఇంటి పరిసరాల్లో ఎవరూ కనిపించకపోవడంతో భార్య, కూతురు సింధూతో కలిసి ఆయన వాకింగ్ కోసం బైక్‌పై శాలివాహన పార్క్‌కు బయల్దేరారు. ఉదయం 6:10కు బూడిద రంగు కారు, లోపల రాజేశ్, మరికొందరిని నారిబాయి గుర్తించి భర్తను అప్రమత్తం చేసింది. జనం తచ్చాడుతుండటంతో తనకేమీ కాదంటూ ఆమెకు చెప్పి.. తన స్నేహితులైన డాక్టర్ నాగరాజు, అంజయ్యతో కలిసి ఆయన వాకింగ్ చేశారు. కొద్దిసేపటికి.. స్నేహితులతో కలిసి జ్యూస్ తాగేందుకు పార్క్ వెస్ట్ గేట్ నుంచి బయటకొచ్చారు. చందు నాయక్ తన బైక్ వైపు వెళుతుండగా కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు చందు నాయక్ కళ్లలో కారం చల్లారు. వెంటనే ఆయన బిగ్గరగా కేకలు వేస్తూ.. పార్కువైపు పరుగెడుతుండగా ముగ్గురు వ్యక్తులు వెంబడించి కాల్పులు జరిపారు. తూటాలు తగలడంతో చందునాయక్ అక్కడికక్కడే కుప్పకూలారు. భార్య నారిబాయి, కూతురు సింధూ మృతదేహం వద్ద భోరున విలపించారు. తన భర్తను చంపిన వారిని, వారు ఉపయోగించిన కారును గుర్తు పడతానని నారిబాయి పోలీసుల ఎదుట చెప్పింది. మృతదేహానికి ఉస్మానియాలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. చందునాయక్ కుమారుడు సిద్దు లండన్‌లో ఉన్నతచదువులు చదువుతుండగా.. కూతురు సింధు గ్రూప్స్‌కు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. కాగా ఈ హత్య ఘటనకు సంబంధించి రాజేశ్, ఇతర నిందితులు పోలీసులకు లొంగిపోయినట్లు తెలుస్తోంది.

## విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావు

# ఆస్తులు చూస్తే అవాక్కే!

(మొదటిపేజీ తరువాయి)

మురళీధర్‌రావు ఈఎన్సీ జనరల్‌గా పదవీ విరమణ పొందారు. తన పదవీ కాలాన్ని పెంచుకుంటూ కేసీఆర్ సర్కారులో పదేళ్లు ఆయన కొనసాగారు. ఈఎన్సీ జనరల్‌గా అప్పట్లో కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకంగా పని చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొన్నాళ్లు కొనసాగారు. పదవీ విరమణ తర్వాత మొత్తంమీద 13 ఏళ్లపాటు ఆయన నీటి పారుదల శాఖలోనే పనిచేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారంటూ ఆరోపణలు రావడంతో మంగళవారం ఉదయం ఏసీబీ ఆయనను అదుపులోకి తీసుకుంది. జూబ్లీహిల్స్, మోకిల, కరీంనగర్, జహీరాబాద్, వరంగల్, కోదాడ సహా మొత్తం 11 ప్రాంతాల్లో మురళీధర్ రావు, ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించింది. కొండాపూర్‌లో ఒక విల్లా, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, కోకాపేట, బేగంపేటల్లో నాలుగు ఫ్లాట్లు, అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో నాలుగు ఇళ్ల స్థలాలు, హైదరాబాద్, కరీంనగర్‌లో రెండు వాణిజ్య సముదాయాలు; కోదాడలో అపార్ట్‌మెంట్, వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్, మోకిలలో 6,500 గజాల స్థలం, హైదరాబాద్ చుట్టుపక్కల 11 ఎకరాల పొలం; జహీరాబాద్‌లో 2 కేవీ సోలార్ పవర్ ప్రాజెక్టు (ఎన్‌రిచ్), మెర్సిడెస్ బెంజ్ సహా మూడు కార్లు ఆయనకు ఉన్నట్లు ఏసీబీ అధికారుల సోదాల్లో వెల్లడైంది. కరీంనగర్‌లో మురళీధర్‌రావు సోదరుడు డాక్టర్ రామ్మోహన్ రావు, సమీప బంధువు రవీందర్ రావు ఇళ్లలో సోదాలు జరిపారు. రవీందర్ రావు విదేశాల్లో ఉంటున్నట్లు తెలిసింది. ఆయన ఇంటికి వెళ్లిన ఏసీబీ అధికారులు.. మురళీధర్ రావు వద్ద లభ్యమైన ఒక డాక్యుమెంట్‌కు సంబంధించి కొన్ని అనుమానాలను నివృత్తి చేసుకున్నట్లు సమాచారం. మురళీధర్‌రావు కుమారుడు అభిషేక్‌కు చెందిన హనుమకొండ న్యూ శాయంపేటలోని సహస్ర ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సోదాలు చేశారు. కీలక దస్త్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని, బంగారం, బ్యాంకు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాలను త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ డీజీ విజయకుమార్ తెలిపారు. ఈ ఆస్తులన్నీ అక్రమార్జనతోనే మురళీధర్‌రావు కొనుగోలు చేసినట్లు తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని ఆయన తెలిపారు. దాంతో, మంగళవారం సాయంత్రానికి ఏసీబీ అధికారులు ఆయనను అరెస్టు చేశారు. త్వరలో కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేస్తామని డీజీ విజయ్ కుమార్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరించిన నీటిపారుదల శాఖ అధికారులు హరిరాం, నూనె శ్రీధర్ ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు ఇటీవల సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. వారి ఇళ్లల్లోనూ వందల కోట్లలోనే ఆదాయానికి మించిన ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించడం గమనార్హం.

## ఇస్లామిక్ విద్యా బోధన

# తప్పేమీ కాదు!

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున విష్ణుశంకర్‌జైన్ అనే న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఎంఐఎం పార్టీ ముస్లింలలో ఇస్లామిక్ విద్యను పెంపొందిస్తామని, షరియా చట్టం పట్ల అవగాహన పెంచుతామని చెబుతోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. 'దీంట్లో తప్పేముంది? ఇస్లామిక్ విద్యను బోధించటం తప్పేమీకాదు. మరిన్ని రాజకీయపార్టీలు ఇలా విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తే మేం స్వాగతిస్తాం' అని వ్యాఖ్యానించింది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ.. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలను నేర్పించటానికి హిందూ పేరుతో తాను ఒక రాజకీయపార్టీ పెడతానంటే ఎన్నికల సంఘం అంగీకరించదని, ఇది వివక్షేనని అన్నారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. 'వేదాలు, ఉపనిషత్తులు బోధించటానికి ఈసీ అభ్యంతరం చెబితే సంబంధిత వేదికలపై ఫిర్యాదు చేయండి. చట్టం తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుంది. మన ప్రాచీన విజ్ఞానాన్ని, చరిత్రను, సాహిత్యాన్ని చదువుకోవటంలో ఎలాంటి తప్పు లేదు. దానిని చట్టం నిషేధించటం లేదు' అని స్పష్టం చేసింది. ఒక మతపరమైన చట్టానికి రాజ్యాంగం రక్షణ కల్పిస్తున్నప్పుడు.. ఆ మతపరమైన చట్టాన్ని తాము బోధిస్తామని రాజకీయపార్టీ చెబితే అందులో అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదంది.

సమాజంలో ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన అన్ని వర్గాల కోసం తాము పని చేస్తామని ఎంఐఎం రాజ్యాంగం ప్రకటించిందని, ఆ వర్గాల్లో మైనారిటీలు, ముస్లింలు కూడా ఉంటారని తెలిపిందని సుప్రీంకోర్టు ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, సమాజం శ్రేయస్సు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ.. సమాజంలో మతపరమైన చిచ్చు రేపే పనులు చేసే పార్టీలుగానీ, పార్టీ అభ్యర్థులుగానీ ఉండే అవకాశం ఉందని ధర్మాసనం పేర్కొంది. కొన్ని రాజకీయపార్టీలు కులం అంశంపై ఆధారపడి రాజకీయాలు చేస్తున్నాయని, ఇది కూడా సమాజానికి అంతే ప్రమాదకరమని తెలిపింది. వీటిని అనుమతించే ప్రసక్తే లేదని, ఈ తరహా ఘటనలు ఉంటే తమ ముందుకు తీసుకురావాలని పిటిషనర్‌కు సూచించింది. ఏదో ఒక రాజకీయపార్టీనో, అభ్యర్థినో లక్ష్యంగా చేసుకోకుండా.. మొత్తంగా రాజకీయ పార్టీల్లో తీసుకురావాల్సిన సంస్కరణలపై పిటిషన్ వేసుకోవచ్చని పేర్కొంది. ప్రస్తుత పిటిషన్‌ను ఉపసంహరించుకోవటానికి ధర్మాసనం అనుమతించింది.

### తొలుత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్

ఎంఐఎంకి ఈసీ ఇచ్చిన గుర్తింపును రద్దు చేయాలంటూ పిటిషనర్ తొలుత ఢిల్లీ హైకోర్టులో కేసు దాఖలు చేశారు. చట్టం నిర్దేశించిన అన్ని నిబంధనలను ఎంఐఎం పాటిస్తోందని, తమ రాజకీయ విశ్వాసాలను ప్రచారం చేసుకోవటానికి పార్టీ పెట్టుకునే హక్కు ఎంఐఎం సభ్యులకు ఉందని పేర్కొంటూ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం గతేడాది నవంబరులో సదరు పిటిషన్‌ను కొట్టివేసింది. దీనిని హైకోర్టు డివిజన్ బెంచిలో పిటిషనర్ సవాల్ చేయగా అక్కడా చుక్కెదురైంది. దీనిపై పిటిషనర్ సుప్రీంకోర్టుకు వెళ్లగా.. తాజాగా అక్కడ కూడా అదే పరిస్థితి ఎదురైంది.

## శ్రవణ్‌రావు దుబాయ్ ఫ్లాట్‌లో

# ఏపీ లిక్కర్ స్కాం నిందితుల మకాం

» ఆ ఫ్లాట్ కేంద్రంగానే నడిచిన కథ

» దుబాయ్‌లో అత్యంత ఖరీదైన ఆ ఫ్లాట్‌లో కిరణ్, చాణక్య మకాం

» కిరణ్ 4 ఏళ్లలో 29సార్లు దుబాయ్‌కు..

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడి ఫ్లాట్‌లో ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం నిందితులు మకాం ఉన్న వ్యవహారం సంచలనంగా మారింది. ఆ ఫ్లాట్ కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లో కాకుండా దుబాయ్‌లో ఉండడం విశేషం. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్‌రావు కుటుంబీకులకు దుబాయ్‌లో అత్యంత ఖరీదైన ఫ్లాట్ ఉంది. దాని అద్దె నెలకు సుమారు రూ.5 లక్షలు వస్తుంది. కానీ.. అతను కొంతకాలంగా ఆ ఫ్లాట్‌ను అద్దెకు ఇవ్వకుండా ఏపీ లిక్కర్ స్కాం నిందితులకు ఆశ్రయం ఇచ్చేందుకు ఉపయోగిస్తున్నాడు. ఈ కేసులో నిందితులు కిరణ్ కుమార్, చాణక్యతోపాటు మరికొందరు ఆ ఫ్లాట్‌లో ఉంటున్నట్లు తాజా సమాచారం. లిక్కర్ స్కాంపై విచారణ ప్రారంభమైనప్పటి నుంచి.. అంటే సుమారు 2024 డిసెంబరు నుంచి కొందరు నిందితులకు ఆ ఫ్లాటే ఆవాసంగా మారింది. శ్రవణ్‌రావుకు లిక్కర్ స్కాం కేసులో ప్రధాన నిందితుడు కే రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డికి ఉన్న సంబంధ బాంధవ్యాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. వీరి మధ్య ఇంకా ఇతర లావాదేవీలు ఏమైనా ఉన్నాయా అనే అంశంపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. కాగా దుబాయ్‌లో అత్యంత ఖరీదైన ఫ్లాట్‌ను శ్రవణ్‌రావు ఎలా కొన్నారు, లిక్కర్ స్కాం డబ్బులు ఏమైనా చేతులు మారాయా అని మనీలాండరింగ్ కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరా తీస్తోంది.

### దుబాయ్‌కు హవాలా..

ఏపీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రముఖ మద్యం బ్రాండ్లను నిలిపివేసి, తక్కువ పేరున్న బ్రాండ్లను ప్రోత్సహించడంలో రూ.3,200 కోట్ల కుంభకోణం జరిగినట్లు సిట్ ప్రాథమిక దర్యాప్తులోనే నిగ్గు తేల్చింది. ఈ స్కాంకు సంబంధించిన కథ మొత్తం దుబాయ్ కేంద్రంగానే నడిచినట్లు తెలుస్తోంది. ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి దుబాయ్ నుంచి గోవా వెళ్లి అటు నుంచి హైదరాబాద్ చేరుకున్న అతణ్ని సిట్ అధికారులు విమానాశ్రయంలోనే అరెస్ట్ చేశారు. మరో కీలక నిందితుడు కిరణ్ కుమార్ నాలుగేళ్లలో ఏకంగా 29 సార్లు దుబాయ్‌కి రాకపోకలు సాగించినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. లిక్కర్ స్కాం సొమ్ము వందల కోట్ల రూపాయలను హవాలా ఏజెంట్ల ద్వారా తరలించినట్లు సిట్ గుర్తించింది. దుబాయ్ లింకుల్ని విశ్లేషించడంపై అటు ఈడీ, ఇటు సిట్ దర్యాప్తు కొనసాగిస్తున్నాయి.

### లిక్కర్ సొమ్ముతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం

ఏపీలో లిక్కర్ స్కాం సొమ్మును పెద్ద మొత్తంలో తెలంగాణలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. రాజ్ కసిరెడ్డి హైదరాబాద్ సమీపంలో పారిశ్రామిక కారిడార్‌లో రూ.150 కోట్లతో 90 ఎకరాలు భూమి కొన్నట్లు సిట్ గుర్తించింది. మనీ రూటింగ్‌లో భాగంగా భూములు కొని, విక్రయించినట్లు తేలింది. 90 ఎకరాలు కొన్న నిందితులు అందులో 60 ఎకరాలు విక్రయించారు. మరో 30 ఎకరాలు రాజ్ కసిరెడ్డికి సంబంధించిన సంస్థల పేర్లతో ఉన్నట్లు సిట్ గుర్తించింది. అసలు భూములు ఎలా కొన్నారు? విక్రయంతో వచ్చిన సొమ్ము ఎక్కడికి దారి మళ్లించారు? అనే కోణంలో సిట్ ఆరా తీస్తోంది. హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతంలోనూ రాజ్ కసిరెడ్డి స్థలం కొన్నట్లు తేలింది. కాగా, ఏపీ లిక్కర్ స్కాం సొమ్ముతో కొన్న ఆస్తులను దర్యాప్తులో భాగంగా జప్తు చేయడంపై సిట్ దృష్టి సారించింది.

## బీసీ జాబితా నుంచి

# ముస్లింలను తొలగించాలి

» వారికి 10% రిజర్వేషన్ అమలు చేయొద్దు: సంజయ్



విద్యార్థులకు సైకిళ్లు అందచేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

సిరిసిల్ల జూలై 15 (ఆంధ్రజ్యోతి): "బీసీ రిజర్వేషన్ల అమలు అంశం వెనక పెద్ద కుట్ర దాగి ఉంది. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించి.. అందులో ముస్లింలకు 10% రిజర్వేషన్లు అమలు చేయాలనుకోవడం దుర్మార్గం. బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగించాలి. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం" అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మోదీ గిఫ్ట్ పేరుతో 10వ తరగతి విద్యార్థులకు ఆయన సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 51% ఉన్న బీసీలకు 32% మాత్రమే రిజర్వేషన్లు అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం 12% ఉన్న ముస్లింలకు మాత్రం 10% రిజర్వేషన్లు అమలు చేసేందుకు సిద్ధమవడం దుర్మార్గమని మండిపడ్డారు. రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని, అవాస్తవాలను మీడియా ద్వారా ప్రజలకు చేరవేస్తోందన్నారు. కొన్ని బీసీ సంఘాలు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అని, అయినా ఆర్డినెన్స్ తీసుకువస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగిస్తేనే.. కేంద్రాన్ని ఒప్పించి బీసీ బిల్లుకు ఆమోదం తెలిపే బాధ్యతను తాము తీసుకుంటామని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ వాదనను బలంగా వినిపించాలని కోరారు.



ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో అభివాదంచేస్తున్న మాజీమంత్రులు శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి తదితరులు

## బీసీలను మోసగించాలని చూస్తే ఉద్యమిస్తాం

» స్థానికంలో 42% రిజర్వేషన్లు అమలు చేయకపోతే భూకంపమే

» బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం మహాధర్నాలో నాయకులు

కవాడిగూడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తరువాతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే రాష్ట్రంలో భూకంపం సృష్టిస్తామని పలువురు నాయకులు హెచ్చరించారు. అమలు కాని హామీలు, ఆర్డినెన్స్‌ల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూస్తే తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమం చేపడతామని తెలిపారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో బీసీల మహాధర్నా నిర్వహించారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ తమిళనాడు తరహాలో మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించి అమలు కావాలంటే ఈ అంశాన్ని రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్చేలా పార్లమెంటు ద్వారా చట్టం రూపొందించేందుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుంటే తెలంగాణలో భూకంపం సృష్టిస్తామని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. జీవోలతో రిజర్వేషన్లు అమలు అవుతాయంటే ఇన్నాళ్లు ఎందుకివ్వలేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జోగురామన్న, మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులు హాజరయ్యారు.

## పారదర్శకంగా హాస్టళ్ల ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు

» నిత్యావసరాల కొనుగోలుపై అధికారుల సమీక్ష

హైదరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని సంక్షేమ గురుకులాలతో పాటు వసతి గృహాల్లో ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పారదర్శకంగా నిర్వహించాలని మైనారిటీ గురుకుల కార్యదర్శి షఫీయుల్లా సూచించారు. సచివాలయంలో మంగళవారం సంక్షేమ గురుకులాలు, వసతిగృహాలకు ఈ విద్యాసంవత్సరానికి అవసరమైన నిత్యావసరాలు, ఇతర సరకుల సేకరణపై మార్గదర్శకాల రూపకల్పనకు సంబంధించిన ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ సమావేశం జరిగింది. నాణ్యమైన వస్తువులను స్థానిక ధరలకు అనుగుణంగా, సకాలంలో సరఫరా చేసేవిధంగా చూడాలని ఆయన సూచించారు. టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ మోనిటరింగ్ యూనిట్ చైర్‌పర్సన్ డా. వి. ఎస్.అలగు వర్షిణి, బీసీ, ఎస్టీ గురుకులాల కార్యదర్శులు సైదులు, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కారును పోలిన గుర్తులు తొలగించాలి

» ఎస్ఈసీకి బీఆర్ఎస్ వినతి

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తు కారును పోలిన గుర్తులను తొలగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆ పార్టీనేతలు కోరారు. ఈ మేరకు ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికి బీఆర్ఎస్ నేతలు బోయినపల్లి వినోద్‌కుమార్, సోమ భరత్‌కుమార్ మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కారు గుర్తును పోలిన గుర్తులు ఇవ్వడం వల్ల 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు నష్టం వాటిల్లిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని చపాతీ రోలర్, కెమెరా, షిప్ గుర్తులను ఇతర పార్టీలకు, వ్యక్తులకు కేటాయించొద్దని వారు విజ్ఞప్తి చేశారు.

## ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు ఆర్టీసీ ద్వారా చేపట్టాలి

» ఆర్టీసీ బస్ బాడీ బిల్డింగ్ యూనిట్లను ప్రోత్సహించాలి

» టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు కేంద్రం ప్రకటించిన 2000 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ ద్వారా కొనుగోలు చేయాలని టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. పర్యావరణ హితమంటూ పెట్రోల్, డీజిల్ బస్సులకు బదులుగా కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను ప్రోత్సహించడాన్ని యూనియన్ తప్పుబట్టింది. ఆర్టీసీ బస్సుల వల్ల జరిగే కాలుష్యం 0.09 శాతం మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఈదురు వెంకన్న మంగళవారం ఓ ప్రకటన చేశారు. పర్యావరణహితమంటూ కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇచ్చి బస్సులను తయారు చేయిస్తూ ప్రజారవాణా వ్యవస్థను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని యూనియన్ ఆరోపించింది. కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీలనే ఆర్టీసీలోకి బస్ బాడీ బిల్డింగ్ యూనిట్లకు ఇచ్చి ఎలక్ట్రిక్ బస్సులు తయారీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. టీజీఎస్ ఆర్టీసీలో 600 ఎలక్ట్రిక్ బస్సులు అద్దెకు వాడుతున్నారని, దాని వల్ల కొన్ని డిపోలు, గ్యారేజీలు ప్రైవేటుపరం అయ్యాయని యూనియన్ వాపోయింది. డిపోల నుంచి వందలమంది సిబ్బందిని బలవంతంగా బయటికి పంపించారని తెలిపింది.

## మరో 2,500 కోట్ల అప్పు తీసుకున్న ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,500 కోట్ల అప్పు తీసుకున్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఆ రుణాన్ని సేకరించింది. 32 ఏళ్ల కాల పరిమితి, 7.10 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు; 35 ఏళ్ల కాల పరిమితి, 7.09 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు; 38 ఏళ్ల కాల పరిమితి, 7.09 శాతం వార్షిక వడ్డీతో రూ.500 కోట్ల చొప్పున ఈ రుణాన్ని తీసుకున్నది. తెలంగాణతో కలిపి దేశంలోని 12 రాష్ట్రాలు రూ.26,900 కోట్ల మేర అప్పులు తీసుకున్నాయి.

# భర్తకు విషం కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చి..

## తరచూ గొడవ పడుతున్నాడని భార్య ఘాతుకం

» ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాధితుడి మృతి

» వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో ఘటన


జాటోత్ బాలాజీ (ఫైల్)

వర్ధన్నపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా వర్ధన్నపేట సమీపంలోని భావానికుంట తండాకు చెందిన జాటోత్ బాలాజీ (44) అనే వ్యక్తి కూల్ డ్రింక్ తాగిన కొద్దిసేపటికే తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్యే అతడికి విషం కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చిందని.. అది తాగి తీవ్ర అస్వస్థతకు గురై అతడు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఎస్సై చందర్ కథనం ప్రకారం.. తండాకు చెందిన బాలాజీ వ్యవసాయ కూలీ. అతడికి భార్య కాంతి, కూతురు స్వప్న, కుమారుడు ప్రవీణ్ ఉన్నారు. ఈ నెల 8న దాటుడు పండుగను బాలాజీ కుటుంబసభ్యులతో కలిసి జరుపుకొన్నాడు. ఆ రోజు సాయంత్రం మద్యం తాగడానికి వెళ్తానంటూ బాలాజీ ఇంట్లోంచి బయటకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఆ సమయంలో పురుగుల మందు కలిపిన కూల్ డ్రింక్‌ను అతడికి భార్య కాంతి ఇచ్చింది. అది తాగిన కొద్దిసేపటికే గొంతులోంచి నొప్పి వస్తోందంటూ ఆమెకు బాలాజీ చెప్పాడు. భర్తను ఆ స్థితిలోనే వదిలేసి కాంతి దగ్గర్లోని తాళ్ల కుంటతండాలో ఉంటున్న అక్క- బావ ఇంటికి వెళ్లింది. అయితే.. బాలాజీని పొరుగింటివారు గుర్తించి తొలుత వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అప్పటి నుంచి బాలాజీ అక్కడే చికిత్స పొందుతున్నాడు. ఈనెల 13న పరిస్థితి విషమించడంతో ఎంజీఎం నుంచి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 15న మృతి చెందాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని, ఆ గొడవలు మనసులో పెట్టుకొనే కాంతి.. తన బావ దస్రూతో కలిసి ఈ ఘటనకు పాల్పడిందంటూ పోలీసులకు మృతుడి తండ్రి హరిచందర్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

# ప్రియుడు, తమ్ముడితో కలిసి భర్త హత్య

## రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు భార్య స్కెచ్

» మృతుడి కుటుంబీకుల అనుమానంతో కుట్ర స్పష్టం

» భువనగిరి జిల్లా మోటకొండూరులో దారుణం

» ముగ్గురు నిందితుల అరెస్టు.. పరారీలో మరొకరు


వస్తువుల స్వామి(38)

యాదగిరిగుట్ట రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రియుడు, తమ్ముడితో కలిసి భర్తను హత్య చేయించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించిన భార్య, అందుకు సహకరించిన ఇద్దరిని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం భువనగిరి డివిజన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ కేసు వివరాలను వెల్లడించారు. ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్లకు చెందిన వస్తువుల స్వామి(38) భువనగిరిలో పనులు ముగించుకుని స్నేహితుడు వీరబాబుతో కలిసి ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై గ్రామానికి బయలుదేరాడు. రాయగిరి-మోత్కూరు ప్రధాన రహదారి కాటేపల్లిలోని బ్రిడ్జి దాటగానే వెనక నుంచి వచ్చిన ఓ కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామి మృతి చెందగా, వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై అనుమానం ఉందని స్వామి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. స్వామి భార్య స్వాతి ఇందుకు సూత్రధారిగా గుర్తించి ఆమెను, మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

హత్యకు పథకం వేశారిలా..

తుర్కపల్లి మండలం పల్లెపాడుకు చెందిన గుంటి సాయికుమార్ భువనగిరిలోని ఓ మార్బుల్ దుకాణంలో పనిచేసేవాడు. అక్కడికి సమీపంలోని ఓ మోటారు దుకాణంలో స్వాతి పనిచేస్తుండేది. ఈ క్రమంలో వారి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. మరోవైపు, స్వామి తన బావమరిది మహేశ్ మొదటి భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీంతో స్వామిపై మహేశ్ పగ పెంచుకున్నాడు. ఈ విషయం తెలిసి స్వాతి తన భర్తను పలుమార్లు హెచ్చరించింది. దీంతో స్వామి ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. భర్త వేధింపులు భరించలేక తనకు పరిచయమున్న సాయికుమార్, తమ్ముడు మహేశ్‌కు విషయం చెప్పింది స్వాతి. భర్తను ఎలాగైనా కడతేర్చాలని నిర్ణయించుకుంది. స్వామి పని నిమిత్తం ఆదివారం భువనగిరికి వెళ్లాడు. దీంతో సాయికుమార్ భువనగిరి తాతానగర్‌కు చెందిన తన మిత్రుడు రామలింగస్వామి సాయంతో తెలిసిన వ్యక్తి ద్వారా కారును అద్దెకు తీసుకున్నాడు. అప్పటి నుంచి ఇద్దరూ కారులో స్వామిని అనుసరించారు. మిత్రుడు మద్దికుండ వీరబాబుతో కలిసి ఆదివారం రాత్రి బైక్‌పై రాయగిరి నుంచి స్వామి పల్లెర్లకు బయలుదేరాడు. మోటకొండూరు మండలంలోని కాటేపల్లి పరిసర ప్రాంతానికి చేరుకోగానే బైక్‌ను వెనుక నుంచి కారుతో ఢీకొట్టిన సాయికుమార్ సుమారు 50 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లాడు. ఈ ఘటనలో స్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. స్వామి మృతిపై అనుమానం ఉందని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో విచారణ అనంతరం ప్రధాన నిందితులైన సాయికుమార్, స్వాతి, ఆమె తమ్ముడు పొట్టిపాక మహేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు చీమల లింగస్వామి పరారీలో ఉన్నాడు. నిందితులను కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

## పాలిసెట్ తొలివిడత కేటాయింపులో 18,984 సీట్ల భర్తీ

హైదరాబాద్ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ అభ్యర్థులకు తొలివిడత సీట్లను సాంకేతిక విద్యాశాఖ అధికారులు ఎట్టకేలకు కేటాయించారు. ఈనెల 4లోపే సీట్ల కేటాయింపు జరగాల్సి ఉండగా, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆలస్యమయింది. షెడ్యూల్ ప్రకారం సీట్ల కేటాయింపు జరగకపోవడంపై అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. దీంతో గత బుధవారం తొలివిడత సీట్లను కేటాయించిన అధికారులు తుదివిడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. మొదటి కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులకు ఈనెల 23 నుంచి రిజిస్ట్రేషన్లు, 24న ధ్రువపత్రాల పరిశీలన, 25 లోగా వెబ్ ఆప్షన్లు, 28న సీట్ల కేటాయింపు ఉంటుందని అధికారులు ప్రకటించారు. తుదివిడత కౌన్సెలింగ్ అనంతరం అభ్యర్థులు తమకు సీటు లభించిన కళాశాలల్లో ఈనెల 30లోగా రిపోర్టు చేయాలని సూచించారు. 31నుంచి ఫస్టియర్ తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఆపై ఆగస్టు 2 నుంచి పాలిటెక్నిక్‌లలో చేరిన అభ్యర్థులకు ఇంటర్నల్ స్లైడింగ్ ఉంటుందని, మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ఆగస్టు 5 నుంచి 11వరకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తామని వెల్లడించారు. పాలిసెట్ తొలివిడత సీట్ల కేటాయింపు అనంతరం వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 10,012 సీట్లు మిగిలిపోయాయి. రాష్ట్రంలోని 115 పాలిటెక్నిక్‌లలో మొత్తం 28,996 సీట్లు ఉండగా 18,984 (65.50 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. మొత్తం 59 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 11,455 మందికి, 56 ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 7,529 మందికి సీట్లు లభించాయి.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

## పాట రాసిన రామ్ పోతినేని



ఇప్పటి వరకు తన నటనతో ప్రేక్షకులను మెప్పించిన యువతరం కథానాయకుడు రామ్ పోతినేని తొలిసారిగా గీత రచనలోనూ ప్రావీణ్యాన్ని చాటుకున్నారు. ఆయన హీరోగా మహేశ్ బాబు.పి దర్శకత్వంలో 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమా తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇందులో రామ్ పోతినేని సినిమా అంటే పిచ్చి ఉన్న కుర్రోడి పాత్రలో కనిపించబోతున్నారు. అంతేకాదు ఈ సినిమా కోసం రామ్ అద్భుతమైన పాటను రాశారు. ఈ పాటకు సంగీత ద్వయం వివేక్ - మెర్విన్ స్వరాలు సమకూర్చగా అనిరుధ్ రవిచందర్ ఆలపించారు. ఇప్పటి వరకూ అనిరుధ్ పాడిన పాటలన్నీ హిట్ అవడంతో ఈ పాటపై అంచనాలు పెరిగాయి. కాగా, ఈ సినిమాలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో...



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో రూపొందించిన చిత్రం 'అగ్రహారంలో అంబేద్కర్'. మంతా కృష్ణచైతన్య కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. తాజాగా ఈ సినిమాలోని పాటను మంద కృష్ణమాదిగ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "అంబేద్కర్ అభిమానులంతా ఈ సినిమాను చూడాలి" అని కోరారు. మంతా కృష్ణచైతన్య మాట్లాడుతూ "అంబేద్కర్‌కు గొప్ప నివాళిగా ఈ సినిమాను తీశాం" అని చెప్పారు.

## ప్రేమలో రెండోసారి



రమణ సాకే, వనిత గౌడ జంటగా నటించిన 'ప్రేమలో రెండోసారి' చిత్రం ఫస్ట్ లుక్‌ను సీనియర్ నిర్మాత సి.కల్యాణ్ విడుదల చేశారు. సత్య మార్క దర్శకత్వంలో సాకే నీరజ లక్ష్మి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రం గురించి హీరో రమణ సాకే మాట్లాడుతూ 'నేటి యువతకు బాగా కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది. సినిమా బాగా వచ్చింది. ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్లుగా దర్శకుడు రూపొందించారు' అని చెప్పారు. ఈ సినిమాను ఆదరించాలని నిర్మాత నీరజ లక్ష్మి ప్రేక్షకులను కోరారు.

## ఎన్టీఆర్‌ను అలా చూపించాలనుకుంటున్నా

\- నాగవంశీ



ఎన్టీఆర్, హృతిక్ నటించిన బాలీవుడ్ చిత్రం 'వార్ 2'ను తెలుగులో సూర్యదేవర నాగవంశీ విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రచారంలో భాగంగా, 'వార్ 2' గురించి, ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆయన నిర్మించనున్న చిత్రం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. "వార్ 2'లో ఎన్టీఆర్ పరిచయ సన్నివేశం సినిమాకే హైలైట్. హృతిక్, ఆయన మధ్య వచ్చే ఆ పోరాట ఘట్టాన్ని చూసే తెలుగులో చిత్రాన్ని నేనే విడుదల చేయాలని నిర్ణయించుకున్నాను. హృతిక్, ఎన్టీఆర్ పాత్రలకు సమప్రాధాన్యం ఉంటుంది. 'రామాయణ'ను ప్రకటించిన తర్వాత దేశమంతా ఆ ప్రాజెక్ట్ గురించి మాట్లాడుకుంది. త్రివిక్రమ్-ఎన్టీఆర్ సినిమాను 'రామాయణ' కంటే భారీ స్థాయిలో ప్రకటించాలనుకుంటున్నాం. త్రివిక్రమ్ చేస్తున్న మొదటి మైథలాజికల్ ఇది. సీనియర్ ఎన్టీఆర్‌ను రాముడిగా, కృష్ణుడిగా చూశారు. ఇప్పుడు తారక్‌ను నేను అలా చూపించనున్నాను. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితియార్థంలో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. త్రివిక్రమ్-వెంకటేశ్ సినిమా ఆగస్టులో ప్రారంభమవుతుంది. ఈ సినిమా తర్వాత ఎన్టీఆర్ ప్రాజెక్ట్ పనులు మొదలవుతాయి" అని పేర్కొన్నారు.

## ప్రేక్షకుల స్పందన కోసం ఎదురుచూస్తున్నా

\- జెనీలియా



'నా కెరీర్ ఆరంభం నుంచి ఎప్పటికప్పుడు కొత్త తరహా పాత్రలే చేస్తూ వచ్చాను. 'జూనియర్' చిత్రంలోనూ నా పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఈ తరహా పాత్రను నేను ఇప్పటివరకూ చేయలేదు. అందుకే ప్రేక్షకుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని నటి జెనీలియా అన్నారు. గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటిరెడ్డి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మిస్తున్నారు. ఈ శుక్రవారం ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన జెనీలియా మీడియాతో ముచ్చటించారు.

- దర్శకుడు కథను, నా పాత్రను గురించి వవరించిన తీరు నాకు బాగా నచ్చింది. తప్పకుండా ఇలాంటి సినిమా చేయాలి అనిపించింది. కథలో నా పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. భావోద్వేగాలను పలికించే తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.
- నేను ఇప్పటివరకూ చాలామంది కొత్తవారితో కలసి నటించాను. కిరీటిలో కొత్తగా ప్రయత్నించాలనే తపన ఎక్కువ. తను మంచి డాన్సర్. సినిమా కోసం ఆయన చాలా కష్టపడ్డారు. దేవిశ్రీప్రసాద్, సెంథిల్‌కుమార్‌తో పనిచేయడం పాత రోజుల్ని గుర్తు చేసింది. శ్రీలీలతో కలసి నటించడం బావుంది.
- జీవితం అన్నాక అన్నీ ఉండాలి. అందుకే కెరీర్ మంచి స్థాయిలో ఉన్నప్పుడే సినిమాలకు బ్రేక్ ఇచ్చి పెళ్లి చేసుకున్నాను. చిన్న పాత్రయినా ప్రేక్షకులకు గుర్తుండిపోవాలని కోరుకుంటాను. ఈ మధ్యన సినిమాలు చేయకపోయినా 'బొమ్మరిల్లు' హాసిని, 'హ్యాపీ'లో మధుమతి పాత్రలతోనే ప్రేక్షకులకు ఇప్పటికీ నన్ను గుర్తుంచుకోవడం సంతోషం కలిగిస్తోంది.

## కర్ణాటకలో టికెట్ గరిష్ఠ ధర రూ.200



కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మల్టీప్లెక్స్, సింగిల్ స్ర్కీన్ ఏదైనా సరే టికెట్ గరిష్ఠ ధర(వినోదపు పన్ను కలిపి) రూ200 దాటొద్దంటూ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిబంధన కర్ణాటకలో విడుదలయ్యే అన్ని భాషల చిత్రాలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ముసాయిదాపై అభ్యంతరాలు, సలహాల స్వీకరణకు 15 రోజులు గడువు ఇస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆ తర్వాత ఫైనల్ జీవోను గెజిట్‌లో ప్రచురించి అమల్లోకి తీసుకొస్తామని స్పష్టం చేసింది. ప్రభుత్వ వ్యవహారంతో రాష్ట్రంలోని ఎగ్జిబిటర్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కర్ణాటకలో ఇప్పటి వరకూ అమల్లో ఉన్న ఫ్లెక్సీ ప్రైసింగ్ పద్ధతిని ఉపయోగించుకొని బెంగళూరులోని కొన్ని మల్టీప్లెక్స్‌లు టికెట్ రేట్లను ఇష్టారాజ్యంగా పెంచేవి. ఇప్పుడు వారికి ఆ అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ ఎగ్జిబిటర్లు కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు శాండిల్‌వుడ్‌లో టాక్ వినిపిస్తోంది. కొత్త జీవోతో బి, సి సెంటర్లలో సమస్య కాకపోవచ్చు. కానీ, బెంగళూరులో అధికంగా మల్టీప్లెక్స్‌లు ఉన్నాయి. వీటిలో గరిష్ఠ టికెట్ ధర 200 రూపాయలే అంటే ఎగ్జిబిటర్లు జీర్ణించుకోవడం లేదు. కాగా, ప్రభుత్వ నిర్ణయం ఉన్నపళంగా తీసుకున్నదేమీ కాదని, 2025-26 బడ్జెట్‌లోనే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రస్తావించారని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏది ఏమైనా సగటు ప్రేక్షకుడికి మాత్రం ఇది శుభవార్తే అని చెప్పవచ్చు.

# రామాయణ బడ్జెట్.. అవతార్‌ను మించి!



భారతీయులు ఎంతగానో అభిమానించే ఇతిహాసం రామాయణం. ఇంతవరకూ ఎంతో మంది తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రామాయణ గాథను తెరకెక్కించారు. ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు. ఇప్పుడు మరో సారి దర్శకుడు నితీశ్ తివారీ 'అంతకుమించి' అనే రీతిలో, భారీ స్థాయిలో రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. ప్రకటించిన రోజు నుంచే అందరి దృష్టినీ ఆకర్షించిన ఈ సినిమా ప్రపంచ ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతి కలిగించాలని, నిర్మాణపరంగా రాజీ పడకూడదనీ నిర్మాత నమిత్ మల్హోత్రా తపన. 'రామాయణ' మొదటి భాగం రూ.900 కోట్లని, రెండు భాగాలకూ కలపి రూ.1600 కోట్లు అవుతాయని ప్రచారం జరిగింది. అయితే తమ సినిమా బడ్జెట్ 'అంతకుమించి' అంటూ అసలు బడ్జెట్ రూ.4000 కోట్ల రూపాయలు అని అధికారంగా వెల్లడించి అందరినీ ఆశ్చర్య పరిచారు. భారతీయ సినిమా కనీవినీ ఎరుగని భారీ బడ్జెట్ అది! 'భారతీయ ఇతిహాస గ్రంథం రామాయణానికి దృశ్యరూపమివ్వాలన్న ఈ ప్రయాణం ఐదారేళ్ల క్రితం మొదలైంది. 'రామాయణ'ను తీయాలనుకుంటున్నప్పుడు దీని బడ్జెట్ విని అందరూ నన్ను పిచ్చోడనుకున్నారు. ఎందుకంటే ఈ సినిమా రెండు భాగాల బడ్జెట్ చిత్రీకరణ పూర్తయ్యే సమయానికి 500 మిలియన్ డాలర్లు (రూ.4000 కోట్లు) దాటిపోతుంది. ప్రపంచంలోనే అతిగొప్ప కథను అందరికీ అందించడానికి చేస్తున్న ప్రయత్నమిది. ప్రపంచమంతా చూడాల్సిన ఓ అతిపెద్ద చిత్రాన్ని హాలీవుడ్ చిత్రాలకు వెచ్చించే దాని కంటే తక్కువ ఖర్చుతోనే తీస్తున్నామన్న భావన నాకుంది" అని చెప్పారు.

### పలు హాలీవుడ్ చిత్రాల కంటే ఎక్కువ

ఇప్పుడు ఈ బడ్జెట్ గురించి విన్న వారంతా 'వామ్మో ఓ భారతీయ సినిమాకు ఇంత బడ్జెట్టా' అని నోరెళ్లబెడుతున్నారు. ఇప్పటి వరకూ హాలీవుడ్ చిత్రాలనే వేల కోట్ల రూపాయలతో తీస్తున్నారు. 'అవతార్' సినిమా బడ్జెట్ 237 మిలియన్ డాలర్లు (రూ.2000 కోట్లు). 'అవెంజర్స్' తొలి రెండు భాగాలకు అయిన ఖర్చు 300 మిలియన్ డాలర్లు (రూ.2500 కోట్లు). మూడు, నాలుగు భాగాలకు కలిపి దాదాపు 700 మిలియన్ డాలర్లు (రూ.6000 కోట్లు). ఇక 'హాబిట్' ట్రయాలజీ బడ్జెట్ 623 మిలియన్ డాలర్లు (రూ.5500 కోట్లు). ప్రస్తుతానికి అవెంజర్స్ 3, 4, 'హాబిట్' ట్రయాలజీ చిత్రాలు మాత్రమే 'రామాయణ' బడ్జెట్ కంటే ఎక్కువ ఖర్చుతో నిర్మితమయ్యాయి.



### ఆ మూడు భారతీయ చిత్రాల కంటే..

ఇప్పటివరకూ దేశంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రాలంటే 'కల్కి 2898 ఏడీ' (రూ.600 కోట్లు), 'ఆదిపురుష్' (రూ.550 కోట్లు), 'ఆర్ఆర్ఆర్' (రూ.500 కోట్లు) స్ఫురిస్తాయి. అయితే వీటన్నింటి బడ్జెట్ కలిపినా 'రామాయణ'లోని ఓ భాగానికి అయ్యే ఖర్చు కంటే తక్కువే. రెండు భాగాలుగా తెరకెక్కిన 'బాహుబలి' (రూ.430 కోట్లు) బడ్జెట్.. 'రామాయణ' కంటే పదిరెట్లు తక్కువగానే ఉండడం గమనార్హం. కాగా, ఈ చిత్రంలో రామునిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ నటించనున్నారు.

## ఇలాంటి సినిమాలు చాలా అవసరం

\- సీఎం రేవంత్ రెడ్డి



సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఆకాశ్ సాగర్ చోప్రా నిర్మాణ సారథ్యంలో రూపొందుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'శ్రీమద్ భాగవతం పార్ట్-1'. సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబించే ఒక గొప్ప ప్రయత్నంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ చిత్రం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'తరం మారుతున్న ఈ సమయంలో 'శ్రీమద్ భాగవతం' లాంటి సినిమాలు చాలా అవసరం. 2047 విజన్ డాక్యుమెంట్‌లో సినిమా రంగానికి ఒక ప్రత్యేక చాప్టర్ ఉంటుంది. రాబోయే రోజుల్లో హాలీవుడ్ సినిమాలు కూడా హైదరాబాద్‌లో షూటింగ్ చేసే స్థాయికి ఎదగాలని మా ఆకాంక్ష అని అన్నారు. కాగా, ఈ సినిమా మొదటి భాగం 2026లో బహుళ భాషలలో విడుదల కానుంది.

# 9 నెలలుగా జీతాల్లేవ్

- వేతనాలు అందక గోపాలమిత్రల ఇక్కట్లు
- 6 నెలల జీతాల టోకెన్లు రెండుసార్లు రిజెక్ట్
- 24 ఏళ్లుగా మూగ జీవాలకు ఉద్యోగుల సేవ
- మేలు జాతి పశు సంపద వృద్ధిలో కీలకపాత్ర


ఓదెలలో పశువులకు కృత్రిమ గర్భధారణ చికిత్స చేస్తున్న గోపాల మిత్ర

పెద్దపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మేలు జాతి పశు సంపదను పెంపొందించడంలో కీలకంగా పనిచేస్తున్న గోపాల మిత్రలు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రెండు, మూడు నెలల కోసారి వేతనాలు ఇచ్చినా.. ప్రస్తుతం జీతాలు రాక 9 నెలలైంది. అరు మాసాలకు సంబంధించిన వేతనాల టోకెన్లు రెండు సార్లు తిరస్కారానికి గురయ్యాయి. దీంతో కుటుంబ పోషణ భారమై గోపాల మిత్రలు కష్టాలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్య సేవలు అందించేందుకు కావాల్సిన పశుసంవర్థక శాఖ వైద్యులు లేకపోవడంతో పాటు మేలు జాతి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం భావించింది. 2000 సంవత్సరంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(డీఎల్‌డీఏ) ద్వారా గోపాల మిత్ర వ్యవస్థను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుద్యోగ యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి రాష్ట్ర వ్యాప్తంగా 1,530 మంది గోపాలమిత్రలను నియమించారు. ప్రస్తుతం 1,508 మంది పని చేస్తున్నారు. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 133 మంది పని చేస్తున్నారు. వీరు అధిక పాల దిగుబడిని పెంచేందుకు మేలు జాతి గేదెలు, జెర్సీ, ఒంగోలు గిత్తల పెంపు కోసం కృత్రిమ గర్భధారణ చికిత్సలు అందిస్తున్నారు. పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు ప్రథమ చికిత్స చేస్తున్నారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, వ్యాక్సినేషన్, డీ వార్మింగ్, పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. గేదెలు, పశువులు ఎదకు వచ్చినప్పుడు పాడి రైతులు గోపాలమిత్రలకు సమాచారం ఇస్తే ఇంటికి వెళ్లి కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు రకమైన సంతానం కలిగేలా చేయడం, పాల దిగుబడి పెరగడానికి రైతులకు సూచనలు ఇవ్వడం చేస్తున్నారు. ఏడాదికి 800 గేదేలకు కృత్రిమ గర్భధారణ చేయాలనే లక్ష్యం విధించగా, ప్రస్తుతం దానిని నెలకు 100 చొప్పున 1,200 లక్ష్యం విధించారని గోపాలమిత్రలు చెబుతున్నారు. కానీ ఒక్కో నెలలో 50 నుంచి 60 పశువులకు మించి చేయలేకపోతున్నామని, పశు సంపద తగ్గడమే కారణమని అంటున్నారు. కానీ నెల నెలా 100 పశువులకు సరిపడా వీర్యాన్ని సర్కారు తమకు ఇస్తోందని, అందుకోసం తమ నుంచి రూ.4 వేలు తీసుకుంటోందని పేర్కొంటున్నారు.

### జీతాల కోసం ఆఫీసు చుట్టూ చక్కర్లు..

రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా పశు సంవర్థక శాఖలో పని చేస్తున్న గోపాలమిత్రలకు నెలకు రూ.11,050 వేతనం రావాలి. వీరికి మొదట వేతనాలు ఇచ్చేవారు కాదు. కృత్రిమ గర్భధారణ చికిత్సలు చేయడం ద్వారా రైతులు ఇచ్చే డబ్బులపైనే ఆధారపడేవారు. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.1,200 గౌరవ వేతనం ఇవ్వగా, 2010లో రూ.3,500కు పెంచారు. తెలంగాణ వచ్చిన తర్వాత రూ.8,500కు పెంచారు. ఆ తర్వాత 2023 మార్చిలో రూ.11,050 చేశారు. చివరగా గత ఏడాది సెప్టెంబరు వరకు జీతాలు చెల్లించారు. 8 నెలల నుంచి వేతనాలు ఇవ్వక పోవడంతో గోపాలమిత్రలు ఆందోళన చెందుతున్నారు. వేతనాలను రూ.24 వేలకు పెంచడంతోపాటు తమకు అటెండర్ ఉద్యోగాలు ఇవ్వాలని గోపాలమిత్ర రాష్ట్ర అసోసియేషన్ బాధ్యులు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. రెండు రోజుల నుంచి వారంతా పెండింగ్‌లో ఉన్న వేతనాల కోసం రాష్ట్ర పశుసంవర్థక కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు.

### సకాలంలో వేతనం చెల్లించాలి



మేలు జాతి పశుసంపదను పెంచేందుకు ఏళ్ల తరబడి పని చేస్తున్న మాకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేదు. చాలీచాలనీ వేతనాలతో బతుకులీడుస్తున్నాం. ఆ వేతనాలు కూడా నెల నెలా చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. గత అక్టోబరు నుంచి ఇప్పటి వరకు జీతాలు రాలేదు. పిల్లల చదువుల కోసం ఫీజులు చెల్లించేందుకు, ఇతర అవసరాల కోసం అప్పులు చేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో వేతనాలు చెల్లించాలి.

- గోపతి ప్రవీణ్, గోపాలమిత్ర, ఓదెల, పెద్దపల్లి జిలా

# రెండు నెలలకోసారి కాళేశ్వరం మోటార్లకు పరీక్షలు

- తుప్పు పట్టి దెబ్బతినకుండా అధికారుల చర్యలు
- ప్రస్తుతం నిర్మాణ సంస్థల ఆధ్వర్యంలోనే నిర్వహణ
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ క్రమం తప్పకుండా ఇంజనీర్ల పర్యవేక్షణ
- వాటి గేట్లు ఎండాకాలం కిందకి, వానాకాలం పైకి

(భూపాలపల్లి ఆంధ్రజ్యోతి)

మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాలు బయటపడటంతో కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రస్తుతం నీటిని నిల్వ చేసి ఎత్తిపోసే అవకాశం లేకుండా పోయింది. నీటిని ఎత్తిపోయకపోతే వేల కోట్లతో ఏర్పాటు చేసిన పంప్‌హౌస్ మోటార్లు దెబ్బతింటాయేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, అధికారులు, ఇంజనీర్లు అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మోటార్లను అప్పుడప్పుడూ నడిపిస్తున్నారు. గ్రీజింగ్ చేస్తున్నారు. అన్ని మోటార్లను ఒకేసారి నడిపించకుండా రెండు రోజులకు ఒకటి చొప్పున ఒక్కో మోటారును నిమిషం పాటు నడిపిస్తూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇలా అన్ని మోటార్లను రెండు నెలలకోసారి నడిపిస్తున్నారు. బ్యారేజీలు, పంప్‌హౌస్‌లను కూడా ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నప్పటికీ దాదాపు 24 మంది ఏఈలు, ఆరుగురు డీఈఈలు, ఇతర సిబ్బంది బ్యారేజీలు, పంప్ హౌస్‌ల వద్దనే ఉంటున్నారు. ఇటు బ్యారేజీలు, అటు పంప్‌హౌజ్‌ల్లో షిఫ్టు పద్ధతిలో ఇంజనీర్లు, టెక్నికల్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. వీరికి సహాయకులుగా ఇతర సిబ్బందిని నియమించారు. బ్యారేజీలు నిరుపయోగంగా ఉండటంతో వాటి గేట్లు, రోప్‌లు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వేసవిలో గేట్లను కిందికి దింపడం, వర్షాకాలంలో పైకి లేపడం, గ్రీజింగ్ చేయడం చేస్తున్నారు. మొత్తం మీద ప్రతి బ్యారేజీ, పంప్ హౌజ్ వద్ద ఇద్దరు డిప్యూటీ ఇంజనీర్లు, 8 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, 8 మంది లష్కర్లు పని చేస్తున్నారు. వరద సమయాల్లో ఒక డీఈ, ఇద్దరు ఏఈలు, నలుగురు లష్కర్లు రాత్రి వేళల్లో పని చేసేందుకు వీలుగా అదనంగా నియమించారు. ప్రస్తుతం పంప్ హౌస్‌లు, మోటార్లకు నిర్మాణ సంస్థలే మెయింటెన్స్ పనులు చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం పంప్ హౌస్‌లకు 15 ఏళ్ల నిర్మాణ సంస్థలే నిర్వహణ చేస్తాయి. ఈ కాలపరిమితి ముగిసిన తర్వాత జరిగే మరమ్మతుల ఖర్చులను ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణ సంస్థలే నిర్వహణ చూస్తున్నందు వల్ల ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధుల కేటాయింపు లేదు. కాగా, 2021లో మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో పిల్లర్లు కుంగిపోవడంతో బ్యారేజీలో నీటిని నిల్వ చేయవద్దని, గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ ఆదేశించింది. అటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలో కూడా లోపాలు బయటపడటంతో ఆ రెండు బ్యారేజీల గేట్లను కూడా తెరిచి ఉంచాలని నిపుణుల బృందం సూచించింది.

# ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల అలజడి

- బీజాపూర్‌లో ఇద్దరు టీచర్ల హత్య


సురేష్


వినోద్ (ఫైల్)

చర్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం రెండు చోట్ల మావోయిస్టులు అలజడి రేపారు. బీజాపూర్‌లోని పీలూరు, టేకుమెట్ల గ్రామాలకు చెందిన సురేష్, వినోద్ అనే ఇద్దరు ఉపాధ్యాయులను హత్య చేశారు. సోమవారం సాయంత్రం వీరిని కిడ్నాప్ చేసిన మావోయిస్టులు.. హత్య చేసి మంగళవారం ఉదయం సమీప అడవుల్లో పడేశారు. పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తుందుకే హత్య చేశామని, ఘటనాస్థలంలో మావోయిస్టులు లేఖ వదిలినట్లు తెలుస్తోంది. అలాగే నారాయణపూర్ జిల్లాలోనూ మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడ్డారు. మద్నార్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ సెల్‌టవర్‌ను దహనం చేశారు. పదుల సంఖ్యలో అక్కడికి చేరుకున్న మావోయిస్టులు.. కర్రలు పేర్చి టవర్‌ను తగలబెట్టినట్టు స్థానికులు తెలిపారు.

# దేవరకద్రలో డ్రై పోర్టు!

మహబూబ్‌నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని దేవరకద్రలో డ్రై పోర్టు మంజూరు కోసం ముందడుగు పడింది. మూడు రాష్ట్రాల సరిహద్దు కావడం, రైల్వే కనెక్టివిటీతో పాటు దేశంలోనే అత్యంత పెద్దదైన ఎన్‌హెచ్-44 ఈ నియోజకవర్గం గుండా వెళ్తుండటంతో ఇక్కడ డ్రై పోర్టు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన గతం నుంచి ఉంది. దక్షిణ తెలంగాణ అభివృద్ధికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకుల మండలం గుడిబండ వద్ద సర్వే నం.118లో సుమారు 100 ఎకరాల భూమిని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎంఓ లాజిస్టిక్స్ డైరెక్టర్ అపర్ణ, టీఎస్ఐఐసీ ఉన్నతాధికారి స్వభావ్, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఇతర పరిశ్రమల శాఖ అధికారులు ఆ స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఇటీవల ఇదే నియోజకవర్గంలోని చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, హజిలాపూర్ సమీపంలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు పరిశీలన జరిగింది. డీఆర్‌డీఎల్ అధికారులు స్థలాన్ని పరిశీలించి అనుకూలతను వ్యక్తం చేశారు. ఓ వైపు డిఫెన్స్ కారిడార్ పై చర్చ జరుగుతుండగా తాజాగా డ్రై పోర్టు ప్రతిపాదనలు తెరపైకి రావడంతో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం కనిపిస్తోంది. ఇక్కడ డ్రై పోర్టు ఏర్పాటైతే సరుకు రవాణాకు వీలు కలుగుతుంది కాబట్టి గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశం ఉంది.



# కింగ్‌తో టీమిండియా

లండన్: ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు బ్రిటన్ రాజు చార్లెస్-3ని మర్యాద పూర్వకంగా కలిశాయి. మంగళవారం క్లారెన్స్ హౌస్ గార్డెన్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు ఆయనతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. అలాగే కెప్టెన్ గిల్, పేసర్లు బుమ్రా, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ తదితర ఆటగాళ్లతో కింగ్ ముచ్చటించారు. అంతేకాకుండా లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టు హైలైట్స్‌ను తాను చూసినట్టు ప్లేయర్లతో కింగ్ చార్లెస్ అన్నారు. 'బ్రిటన్ కింగ్‌ను కలుసుకోవడం ఆనందంగా ఉంది. అందరితో ఆయన ఆప్యాయంగా మాట్లాడారు. అలాగే చివరి రోజు ఆటలో సిరాజ్ అవుటైన విధానం దురదృష్టకరమని, బంతి పక్క నుంచి వెళ్లి స్టంప్స్‌ను తాకిందని మాతో అన్నారు' అని గిల్ వివరించాడు.

### నాలుగో టెస్టుకు మార్పులు!

నాలుగో టెస్టు కోసం భారత జట్టులో మార్పులు ఖాయంగా కనిపిస్తున్నాయి. పని ఒత్తిడిలో భాగంగా పేసర్ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే అతడి స్థానంలో లెఫ్టామ్ పేసర్ అర్ష్‌దీప్ జట్టులోకి రావచ్చు. అలాగే చేతి వేలి గాయంతో ఇబ్బందిపడుతున్న వికెట్ కీపర్ పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్‌ను ఆడించే చాన్సుంది. ఇక వరుసగా మూడు టెస్టుల్లోనూ విఫలమైన కరుణ్ నాయర్‌ను తప్పించి సాయి సుదర్శన్‌ను తుది జట్టులోకి తీసుకోవడం ఖాయంగానే కనిపిస్తోంది. లార్డ్స్‌లో పేసర్ ఆకాశ్ కేవలం ఒకే వికెట్ తీసినా అతడి స్థానానికి ఢోకా ఉండకపోవచ్చు.

## ఎనిమిదేళ్ల తర్వాత జట్టులోకి..

### స్పిన్నర్ డాసన్‌ను ఎంపిక చేసిన ఇంగ్లండ్



లండన్: మాంచెస్టర్ వేదికగా ఈనెల 23 నుంచి జరుగబోయే నాలుగో టెస్టు కోసం 14 మందితో కూడిన ఇంగ్లండ్ జట్టును ప్రకటించారు. అయితే చేతి వేలు ఫ్రాక్చర్ కావడంతో స్పిన్నర్ షోయబ్ బషీర్ మిగిలిన రెండు టెస్టులకు దూరం కానున్నాడు. దీంతో అతడి స్థానంలో 35 ఏళ్ల స్పిన్నర్ లియామ్ డాసన్ (35)కు చోటు కల్పించారు. 2017లో చివరిసారిగా అతను ఇంగ్లండ్ తరఫున మూడు టెస్టులు ఆడి ఏడు వికెట్లు తీయగా, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో బ్యాటింగ్‌లోనూ రాణించి 18 శతకాలతో 10,731 పరుగులు చేయడం విశేషం. ఇక పేసర్లు సామ్ కుక్, ఒవర్టన్‌ను కౌంటీల్లో ఆడేందుకు విడుదల చేశారు.

**ఇంగ్లండ్ జట్టు:** స్టోక్స్ (కెప్టెన్), ఆర్చర్, అట్కిన్సన్, బెథెల్, బ్రూక్, కార్స్, క్రాలే, డాసన్, డకెట్, పోప్, రూట్, స్మిత్, టంగ్, వోక్స్

## వన్డేల్లోనూ అదరగొట్టాలని!

● నేడు ఇంగ్లండ్‌తో భారత్ తొలి మ్యాచ్


సా. 5.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..

సౌతాంప్టన్: ఇంగ్లండ్‌పై తొలిసారి టీ20 సిరీస్ గెలిచిన ఆత్మవిశ్వాసంతో ఉన్న భారత మహిళల జట్టు.. వన్డే సిరీస్‌లోనూ అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం తొలి మ్యాచ్ జరుగనుంది. వన్డే వరల్డ్‌కప్ నేపథ్యంలో జట్టులోని లోపాలను మరింతగా సవరించుకోవాలని భారత జట్టు భావిస్తోంది. గత మేలో శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో భారత్ చివరిసారిగా వన్డేల్లో తలపడింది. ఆ టైటిల్ నెగ్గిన హర్మన్‌సేన ఇప్పుడు ఈ సిరీస్ కూడా నెగ్గితే.. ప్రపంచకప్‌నకు ముందు ఆత్మవిశ్వాసం మరింతగా పెరుగుతుంది. ఓపెనర్‌గా షఫాలీ స్థానంలో ప్రతికా రావల్ జట్టులోకి రానుంది. స్మృతి మంధాన, హర్మన్, జెమీమా, రిచా ఘోష్‌లతో భారత బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. స్పిన్నర్లు శ్రీచరణి, రాధా యాదవ్ కీలకం కాగా.. పేస్ విభాగంలో రేణుక, పూజా వస్త్రాకర్ లేనిలోటు కనిపిస్తోంది. గాయం నుంచి కోలుకొన్న కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్‌తోపాటు ఎకెల్‌స్టోన్ రీఎంట్రీతో ఇంగ్లండ్ బ్యాటింగ్ బలం పెరిగింది.

# 114 ఏళ్ల మారథాన్ రన్నర్ ఫౌజా సింగ్ మృతి

స్వగ్రామంలో రోడ్డు ప్రమాదం

చికిత్సపొందుతూ కన్నుమూత



చండీగఢ్: 114 ఏళ్ల మారథాన్ రన్నర్ ఫౌజా సింగ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. సోమవారం ఉదయం జలంధర్‌కు సమీపంలోని తన స్వగ్రామంలో వాకింగ్ కోసం బయటకు వెళ్లినప్పుడు గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందని, తీవ్ర గాయాలైన ఫౌజా సింగ్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని పోలీసులు చెప్పారు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోపాటు ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తెల్లవారుజామున 3.30 గంటలకు రోడ్డు దాటుతుండగా ఎస్‌యూవీ కారు ఢీ కొట్టిందని కొందరు స్థానికులు చెబుతున్నారు.

**ఆ వయసులో పరిగెత్తడం మొదలుపెట్టి..**

1911లో రైతు కుటుంబంలో జన్మించిన ఫౌజా సింగ్.. నలుగురు సంతానంలో ఆఖరివాడు. భార్య, చిన్న కొడుకు, కుమార్తె మరణంతో కుంగిపోయిన ఫౌజాను మరో కొడుకు 90వ దశకంలో లండన్ తీసుకెళ్లాడు. తన బాధను మరవడానికి రన్నింగ్‌ను ఎంచుకొన్న ఫౌజా .. అందులోనే గుర్తింపు సాధించాడు. 88 ఏళ్ల వయస్సున్నప్పుడు ఓ స్వచ్ఛంద సంస్థ కోసం మారథాన్ రేస్‌లో పరుగెత్తాడు. ఆ తర్వాత అనేక అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని పలు రికార్డులు నెలకొల్పాడు. మారథాన్ రేసును పూర్తి చేసిన శతాధికుడిగా ఖ్యాతికెక్కాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో టార్చ్ బేరర్‌గా వ్యవహరించాడు. క్వీన్ ఎలిజబెత్ నుంచి సన్మానాన్ని అందుకొన్నాడు. మూడేళ్ల క్రితమే లండన్ నుంచి సొంతూరుకు తిరిగొచ్చిన సింగ్.. ఇప్పుడిలా రోడ్డు ప్రమాదంలో మరణించడం అందరినీ కలచివేస్తోంది.

### యువతకు స్ఫూర్తి: మోదీ

ఫౌజా సింగ్ మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'ఫౌజా అద్భుతమైన, భిన్నమైన వ్యక్తి. ఫిట్‌నెస్ విషయంలో యువతకు ఆయన స్ఫూర్తిగా నిలిచారు. అలాంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమ'ని ఎక్స్‌లో మోదీ పోస్టు చేశారు.

### డ్రాతో గట్టెక్కిన ఇంగ్లండ్

● భారత్ అండర్-19తో అనధికార టెస్టు

బెకెన్‌హామ్: భారత్ అండర్-19తో జరిగిన తొలి అనధికార టెస్టులో ఇంగ్లండ్ డ్రాతో గట్టెక్కింది. యువ భారత్ నిర్దేశించిన 350 పరుగుల ఛేదనలో.. ఓవర్‌నైట్ స్కోరు 128/3తో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 270/7 స్కోరు చేసింది. కెప్టెన్ హమ్జా షేక్ (112) శతకంతో రాణించగా.. బెన్ మేయర్స్ (51), థామస్ (50) రాణించారు. అంబ్రిష్ 2 వికెట్లు తీశాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 540, రెండో ఇన్నింగ్స్‌లో 248 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 439 రన్స్‌కు ఆలౌటైంది.



## 2028 ఒలింపిక్స్ క్రికెట్ షెడ్యూల్ విడుదల

● జులై 12 నుంచి 29 వరకు మ్యాచ్‌లు

లాస్ ఏంజెల్స్: క్రికెట్‌కు లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో చోటు కల్పించిన నిర్వాహకులు.. జెంటిల్మన్ గేమ్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను మంగళవారం ప్రకటించారు. 2028 జులై 12న క్రికెట్ మ్యాచ్‌లు టీ20 ఫార్మాట్లో మొదలవుతాయి. జులై 20, 29 తేదీల్లో మెడల్ మ్యాచ్‌లు జరుగుతాయి. పురుషులు, మహిళల విభాగాల నుంచి మొత్తం 12 జట్లు స్వర్ణ, రజత, కాంస్య పతకాల కోసం పోటీపడతాయి. మ్యాచ్‌లన్నీ లాస్ ఏంజెల్స్‌కు 50 కిలోమీటర్ల దూరంలోని పొమెనా నగరంలో జరుగుతాయి. తొలిసారి, చివరిసారిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలు జరిగాయి. ఆ క్రీడల్లో రెండు జట్లు మాత్రమే పోటీపడ్డ రెండ్రోజుల మ్యాచ్‌లో బ్రిటన్‌ను ఓడించి ఫ్రాన్స్ స్వర్ణం గెలిచింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత జెంటిల్మన్ గేమ్‌కు విశ్వక్రీడల్లో ప్రాతినిథ్యం దక్కింది. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్ (సిక్సెస్), స్క్వాష్ క్రీడలకు కూడా అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

### 'జపాన్' నుంచి శ్వేతపర్ణ జోడీ అవుట్

టోక్యో: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత డబుల్స్ జోడీ శ్వేతపర్ణ పాండ/రుతుపర్ణ పాండ పోరాటం తొలిరౌండ్‌కే పరిమితమైంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో శ్వేత ద్వయం 13-21, 7-21తో ఆతిథ్య జపాన్ జంట కొకొనా/మయికో చేతిలో ఓటమి పాలైంది. సింధు, లక్ష్య సేన్, డబుల్స్ స్టార్ సాత్విక్ జోడీ తమ పోరును బుధవారం ప్రారంభించనున్నారు.

# వెస్టిండీస్ 27 ఆలౌట్

టెస్టు చరిత్రలో రెండో అత్యల్ప స్కోరు

9 రన్స్‌కే ఆరు వికెట్లు తీసిన స్టార్క్

బోలాండ్ హ్యాట్రిక్

ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్



స్టార్క్ (7.3-4-9-6)



బోలాండ్

కింగ్‌స్టన్: దశాబ్దాలపాటు ప్రపంచ క్రికెట్‌ను శాసించిన వెస్టిండీస్.. తమ చరిత్రలోనే అత్యంత దారుణమైన ప్రదర్శన కనబర్చింది. ఆస్ట్రేలియాతో సోమవారం ముగిసిన మూడో టెస్టులో 204 పరుగుల ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఈ జట్టు కేవలం 27 పరుగులకే కుప్పకూలింది. ఏడుగురు బ్యాటర్లు డకౌట్లు కాగా, జస్టిన్ గ్రీవ్స్ (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. దీంతో 176 రన్స్ తేడాతో నెగ్గిన ఆసీస్ సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇది కరీబియన్ టెస్టు చరిత్రలో అత్యల్ప స్కోరు (27 ఆలౌట్). అయితే న్యూజిలాండ్ పేరిట ఉన్న అత్యంత చెత్త ప్రదర్శన (ఇంగ్లండ్‌పై 1955లో 26 ఆలౌట్)కు మరో పరుగు దూరంలో నిలిచి కాస్త పరువు కాపాడుకుంది. ఇక ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (7.3-4-9-6) నిప్పులు చెరిగే బంతులతో తన వందో టెస్టును చిరస్మరణీయం చేసుకున్నాడు. కేవలం తొమ్మిది పరుగులే ఇచ్చి ఆరు వికెట్లతో ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. లూయిస్‌ను అవుట్ చేయడం ద్వారా స్టార్క్ కెరీర్‌లో 400 వికెట్ల మైలురాయిని చేరాడు. స్టార్క్.. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే పరుగు లేమీ ఇవ్వకుండా మూడు వికెట్లతో బెంబేలెత్తించాడు. స్టార్క్‌కు తోడు మరో పేసర్ స్కాట్ బోలాండ్ హ్యాట్రిక్ తీయడంతో విండీస్ కుదేలైంది. అంతకుముందు ఆసీస్ నాలుగో రోజు 99/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించి 121 పరుగులకే ఆలౌటైంది. అల్జారి జోసెఫ్‌కు ఐదు, షామర్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 225, వెస్టిండీస్ 143 పరుగులు చేశాయి. స్టార్క్.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గానూ నిలిచాడు.

### రికార్డుల హోరు

ఈ టెస్టు మొత్తమ్మీద ఒక్క అర్ధసెంచరీ కూడా నమోదు కాలేదు. చివరిసారిగా 2015లో భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య నాగ్‌పూర్ టెస్టులో ఇలా జరిగింది.

ఒక ఇన్నింగ్స్‌లో ఏడుగురు బ్యాటర్లు డకౌటవడం 148 ఏళ్ల టెస్టు చరిత్రలో ఇదే తొలిసారి.

టెస్టుల్లో తొలి 15 బంతుల్లోనే ఐదు వికెట్లు తీసిన మొదటి బౌలర్ స్టార్క్. గతంలో ఎర్నీ టోషాక్, స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లండ్), బోలాండ్ (ఆస్ట్రేలియా) 19 బంతుల్లో 5 వికెట్లు సాధించారు.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 121కే ఆలౌటైంది. వెస్టిండీస్‌పై ఆసీస్‌కు గత 30 ఏళ్లలో ఇదే అత్యల్ప స్కోరు.

# బిజినెస్

## బీమా సంస్థల ఆగడాలకు చెక్!

● కమిటీలు ఏర్పాటు చేసిన ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ: బీమా సంస్థలు, బీమా మధ్యవర్తుల ఆగడాలకు చెక్ పెట్టేందుకు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) సిద్ధమైంది. ఇందుకోసం తన పూర్తి స్థాయి సభ్యుల పర్యవేక్షణలో వివిధ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు బీమా కంపెనీలు, వాటి ఏజెంట్లు తప్పుడు హామీలతో పాలసీలు అమ్మడం, సెటిల్‌మెంట్లలో లోపాలు, పాలసీదారుకులకు సంబంధించిన కీలక డేటా వెల్లడి వంటి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాయి. బీమా సంస్థలు, వాటి ఏజెంట్లు తప్పుడు హామీలతో తమకు పాలసీలు అంటగట్టడమే గాక, ఏదో ఒక సాకుతో సెటిల్‌మెంట్స్‌లోనూ కోత పెడుతున్నారని ఇటీవల పాలసీదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వీటికి చెక్ పెట్టేందుకు ఐఆర్‌డీఏఐ ఈ కమిటీలను ఏర్పాటు చేసిందని భావిస్తున్నారు.

### క్రిస్‌క్యాపిటల్ చేతికి థియోబ్రోమా

న్యూఢిల్లీ: బేకరీ, మిఠాయిల వ్యాపార సంస్థలపైనా ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. ముంబై కేంద్రంగా పని చేసే థియోబ్రోమా బేకరీ, కన్ఫెక్షనరీ స్టోర్ల సంస్థ ఈక్విటీలో 90 శాతం వాటాను పీఈ సంస్థ క్రిస్‌క్యాపిటల్ రూ.2,410 కోట్లకు కొనుగోలు చేసినట్టు సమాచారం. అయితే ఈ డీల్‌పై రెండు సంస్థలు అధికారికంగా నోరు విప్పడం లేదు. థియోబ్రోమ ప్రస్తుతం దేశంలోని 30 నగరాల్లో 200కు పైగా బేకరీ, కన్ఫెక్షనరీ స్టోర్లు నిర్వహిస్తోంది.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)

| 16వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 510 | విజయవాడ | 515 |
| వరంగల్ | 512 | గోదావరి | 496 |
| చిత్తూరు | 583 | విశాఖపట్నం | 540 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

**ఫామ్‌గేట్ ధర** వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 91 | విజయవాడ | 94 |
| వరంగల్ | 91 | గుంటూరు | 99 |
| కరీంనగర్ | 91 | ఒంగోలు | 102 |
| మహబూబ్‌నగర్ | 91 | చిత్తూరు | 100 |
| కర్నూలు | 91 | నెల్లూరు | 105 |
| విశాఖపట్నం | 81 | అనంతపురం | 105 |
| గోదావరి | 94 | | |

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 99,770 ▼ | 91,450 ▼ | 1,27,000 ▲ |
| విజయవాడ | 1,01,450 ▲ | 95,500 ▲ | 1,15,000 ▼ |
| విశాఖపట్నం | 1,00,840 ▼ | 91,550 ▲ | 1,25,000 ▲ |
| రాజమండ్రి | 99,760 ▼ | 91,450 ▼ | 1,15,200 ▼ |
| ప్రొద్దుటూరు | 98,300 ▲ | 90,440 ▲ | 1,13,400 ▲ |
| ముంబై | 97,916 ▼ | 89,691 ▼ | 1,11,997 ▼ |

# టెస్లా.. ఆగయా

భారత్‌లో టెస్లా తొలి షోరూమ్ ముంబైలో ప్రారంభం

### తొలుత 'మోడల్ వై' కార్ల విక్రయం.. ప్రారంభ ధర రూ.60 లక్షలు



ముంబై: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా ఎట్టకేలకు భారత్‌లోకి ప్రవేశించింది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో కంపెనీ ఏర్పాటు చేసిన తొలి షోరూమ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ మంగళవారం ప్రారంభించారు. టెస్లా భారత్‌లో కార్ల తయారీ ప్లాంట్, ఆర్ అండ్ డీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

**బెస్ట్ సెల్లింగ్ మోడల్‌తో ఎంట్రీ:** ఒకప్పుడు ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడైన ఎలక్ట్రిక్ కారైన 'మోడల్ వై'తో టెస్లా భారత మార్కెట్ విక్రయాలను ప్రారంభించింది. మన దగ్గర ఈ కారు రెండు వేరియంట్లలో లభించనుంది. రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ ధర రూ.59.89 లక్షలు. లాంగ్ రేంజ్ రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ రేటును రూ.67.89 లక్షలుగా నిర్ణయించింది. ఈ కారును బుక్ చేసుకున్న కస్టమర్లకు ఈ ఏడాది మూడు (జులై-సెప్టెంబరు), నాలుగో (అక్టోబరు-డిసెంబరు) త్రైమాసికాల్లో డెలివరీ అందించనున్నట్లు వెల్లడించింది. కారు రిజిస్ట్రేషన్, డెలివరీ సేవలు తొలుత ఢిల్లీ, ముంబై, గురుగ్రామ్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపింది.

**సింగిల్ చార్జింగ్‌తో 500 కి.మీ ప్రయాణం:** రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ పూర్తి చార్జింగ్‌తో 500 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. లాంగ్ రేంజ్ రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్‌లో 622 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని కంపెనీ తెలిపింది.

**కస్టమైజ్ చేసుకోవచ్చు:** తమ డిజైన్ స్టూడియో ద్వారా కొనుగోలుదారులు కారు ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్‌తో పాటు ఫీచర్లనూ కస్టమైజ్ (తమ అవసరానికి లేదా అభిరుచికి అనుగుణంగా మార్చుకోవడం) చేసుకోవచ్చని టెస్లా స్పష్టం చేసింది.

**అమెరికాతో పోలిస్తే చాలా కాస్ట్‌లీ!:** టెస్లా మోడల్ వై కారును అమెరికా మార్కెట్లో 37,490 డాలర్లకు విక్రయిస్తోంది. ప్రస్తుత మారకం రేటు ప్రకారం మన కరెన్సీలో దాదాపు రూ.32.24 లక్షలు. యూఎస్‌తో పోలిస్తే మన మార్కెట్లో కంపెనీ ఈ కారును సుమారు రెట్టింపు ధరకు విక్రయిస్తున్నది.

ఎందుకంటే, కంపెనీ ఈ కారును చైనా నుంచి దిగుమతి చేసుకుంటుడటమే కారణం. విదేశాల నుంచి కార్ల దిగుమతిపై భారత్ 70-110 శాతం వరకు సుంకాలు విధిస్తోంది.

**ఢిల్లీలో రెండో షోరూమ్.. త్వరలో షురూ:** టెస్లా రెండో షోరూమ్‌ను ఢిల్లీలో ఏర్పాటు చేస్తోంది. అందులో పనిచేసేందుకు సిబ్బందిని ఇప్పటికే నియమించుకుంటున్న కంపెనీ.. వాహనాలను నిల్వ చేసేందుకు గిడ్డంగిని కూడా సమకూర్చుకుంటోంది. ఈ నెలాఖరుకల్లా ఈ షోరూమ్‌ను ప్రారంభించే అవకాశాలున్నాయి.

**బీమా భాగస్వాములుగా లిబర్టీ, అకో:** టెస్లా భారత్‌లో విక్రయించే కార్లకు లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్, అకో బీమా కవరేజీని కల్పించనున్నాయి. భారత్‌లో టెస్లాకు బీమా భాగస్వాములుగా ఎంపికైనట్లు ఈ రెండు కంపెనీలు ప్రకటించాయి.

### చైనా ప్లాంట్ నుంచి దిగుమతి

టెస్లా భారత్‌లో విక్రయించే మోడల్ వై కార్లను చైనాలోని తన ప్లాంట్ నుంచి కంప్లీట్లీ బిల్ట్ యూనిట్ (సీబీయూ)గా దిగుమతి చేసుకోనుంది. కంపెనీ ఇప్పటికే కొన్ని కార్లను మన దేశంలోకి దిగుమతి చేసుకుంది కూడా. భారత మార్కెట్లోకి టెస్లా ప్రవేశించకపోవడానికి అధిక దిగుమతి సుంకాలే కారణమని ఎలాన్ మస్క్ గతంలో ఆరోపించారు. అయినప్పటికీ, కంపెనీ దిగుమతులే ఆధారంగా భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించడం గమనార్హం.

### భారత్‌లో అంత ఈజీ కాదు..

చైనా ఎలక్ట్రిక్ కార్ బ్రాండ్ల నుంచి గట్టిపోటీ ఎదురవుతుండటంతో గడిచిన కొన్ని నెలల్లో ఐరోపా, అమెరికా మార్కెట్లో టెస్లా కార్ల విక్రయాలు బాగా తగ్గుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీ భారత్‌లోకి ప్రవేశించింది. దర విషయంలో మన మార్కెట్‌పై పట్టు సాధించడమూ టెస్లాకు అంత సులువు కాదని ఇండస్ట్రీ విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ వంటి జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజాలు భారత మార్కెట్లో ఇప్పటికే పలు ఎలక్ట్రిక్ మోడళ్లను అందుబాటులోకి తెచ్చాయి. చైనాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ బీవైడీ కూడా మన దగ్గర కార్లను విక్రయిస్తోంది. విన్‌ఫాస్ట్ సైతం త్వరలో తన ఈవీల బుకింగ్‌లు ప్రారంభించబోతోంది. టాటా మోటార్స్, మహీంద్రా వంటి దేశీయ కంపెనీలు రూ.30 లక్షల లోపే పలు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తెచ్చాయి.

## కియా కారెన్స్ క్లావిస్ ఈవీ

### ప్రారంభ ధర రూ.17.99 లక్షలు



న్యూఢిల్లీ: కియా ఇండియా.. మార్కెట్లోకి కారెన్స్ క్లావిస్ ఎలక్ట్రిక్ కారు (ఈవీ)ను విడుదల చేసింది. కంపెనీ భారత్‌లో ఉత్పత్తి చేసిన తొలి ఎలక్ట్రిక్ కారు ఇదే. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం ప్లాంట్‌లో ఈ ఎలక్ట్రిక్ కారును కంపెనీ తయారు చేసింది. ఈ కారు ధర రూ.17.99 లక్షల నుంచి రూ.24.49 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉంది. 42 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన కారు ఒకసారి చార్జింగ్‌తో రూ.404 కిలోమీటర్ల దూరం ప్రయాణించనుంది. అలాగే 51.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన కారు 490 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని కియా తెలిపింది. 100 కిలోవాట్ డీసీ చార్జర్‌తో కేవలం 39 నిమిషాల్లోనే 10 నుంచి 80 శాతం బ్యాటరీ చార్జింగ్ అవుతుందని పేర్కొంది. ఏడు సీట్ల క్లావిస్ ఈవీలో ఏడీఏఎస్ లెవల్ 2 వ్యవస్థతో పాటు 20కి పైగా అటానమస్ ఫీచర్లను పొందుపరిచినట్లు కియా తెలిపింది. కాగా కియా ఇప్పటికే ఎలక్ట్రిక్ కార్లయిన ఈవీ6, ఈవీ9 మోడళ్లను దిగుమతి చేసుకుని భారత మార్కెట్లో విక్రయిస్తోంది.

## 133 దేశాలకు అరబిందో హెచ్ఐవీ ఔషధం

హైదరాబాద్: ప్రపంచంలోని 133 దేశాల్లో హెచ్ఐవీ చికిత్సలో ఉపయోగించే ఇంజెక్షన్ కాబోటెగ్రవిర్‌ను అరబిందో ఫార్మా తయారుచేసి, సరఫరా చేయనుంది. మెడిసిన్స్ పేటెంట్ పూల్ (ఎంపీపీ), వీఐవీ హెల్త్‌కేర్ మధ్య విస్తరించిన వాలంటరీ లైసెన్సింగ్ ఒప్పందం కింద కాబోటెగ్రవిర్ తయారు చేసేందుకు ఎంపిక చేసిన జెనరిక్ ఔషధ తయారీదారుల్లో అరబిందో ఒకటి. హెచ్ఐవీ రోగులు రోజువారీ మాత్రలు మింగడాన్ని ఈ చికిత్స నివారిస్తుంది. అందుకు బదులుగా వారు 1 లేదా 2 నెలలకి ఒక ఇంజెక్షన్ తీసుకుంటే సరిపోతుంది. ఎంపిక చేసిన మార్కెట్లలో ఈ ఔషధం అభివృద్ధి, తయారీ, పంపిణీకి సబ్ లైసెన్స్ లభించడం ఆనందదాయకమని కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ నిత్యానందరెడ్డి అన్నారు.

### ఆస్ట్రా జెనెకా క్యాన్సర్ ఔషధానికి అనుమతి

న్యూఢిల్లీ: పెద్ద వారికి సంక్రమించే మజిల్ ఇన్వాజివ్ బ్లాడర్ క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే దుర్వాలుమాబ్ సొల్యూషన్ దిగుమతి చేసుకుని పంపిణీ చేసేందుకు తమకు కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) అనుమతి లభించిందని ఆస్ట్రాజెనెకా ఫార్మా ప్రకటించింది. దీనివల్ల ఈ వ్యాధి చికిత్సలో ఇప్పటికే ఉపయోగిస్తున్న జెమ్సిటాబైన్, సిస్‌ప్లాటిన్లతో కలిపి దుర్వాలుమాబ్‌ను కాంబినేషన్‌గా ఉపయోగించేందుకు వీలు కలుగుతుందని పేర్కొంది. భారత్ వంటి అధిక భారం గల దేశాల్లో అత్యాధునిక చికిత్సల అందుబాటులో గల లోపాలను తొలగించి, వేగంగా ఔషధాలు అందుబాటులోకి తేవడంపై తాము తీవ్రంగా దృష్టి పెడుతున్నట్టు కంపెనీ కంట్రీ ప్రెసిడెంట్, ఎండీ ప్రవీణ్ అక్కినపల్లి తెలిపారు.

### ఆటో, ఫార్మా షేర్లలో కొనుగోళ్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో నాలుగు రోజుల వరుస నష్టాలకు తెరపడింది. వాహన, ఔషధ రంగ షేర్లలో కొనుగోళ్లతో ప్రామాణిక సూచీలు మంగళవారం లాభాల్లో పయనించాయి. ఒక దశలో 490 పాయింట్ల వరకు పుంజుకున్న సెన్సెక్స్.. చివరికి 317.45 పాయింట్ల వృద్ధితో 82,570.91 వద్ద ముగిసింది. నిఫ్టీ 113.50 పాయింట్ల పెరుగుదలతో 25,195.80 వద్ద స్థిరపడింది.

**20 కోట్లకు చేరువలో డీమ్యాట్ ఖాతాలు:** స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే చిన్న మదుపరులు భారీగా పెరిగారని, దాంతో దేశంలో డీమ్యాట్ ఖాతాలు 20 కోట్లకు చేరువయ్యాయని సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రుచి చోజెర్ తెలిపారు. 2019లో 3.6 కోట్ల డీమ్యాట్ ఖాతాలుండగా.. 2025లో ఈ సంఖ్య 19.4 కోట్లకు పెరిగిందన్నారు.

### హైదరాబాద్‌లో వైజ్ కార్యాలయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): యూకేకు చెందిన ఫిన్‌టెక్ సంస్థ వైజ్.. హైదరాబాద్‌లో కొత్త అంతర్జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించింది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వైజ్ ఏపీఏసీ ఇంజనీరింగ్ హెడ్ స్మృతి రవి వెల్లడించారు. ప్రస్తుతం 70 మంది ఉద్యోగులతో ఈ సెంటర్‌ను ప్రారంభించామని, రానున్న కాలంలో మరికొంత మందిని నియమించుకోనున్నట్లు ఆమె చెప్పారు. వినియోగదారుల క్రాస్ బోర్డర్ చెల్లింపుల అవసరాలను హైదరాబాద్ సెంటర్ తీరుస్తుందన్నారు. ప్రస్తుతం వైజ్ ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా కరెన్సీల్లో లావాదేవీలను చేపడుతోందన్నారు. 2013లో కంపెనీ భారత మార్కెట్లోకి ఇన్‌వార్డ్ రెమిటెన్స్ సేవలతో అడుగుపెట్టిందని ఆమె తెలిపారు. 2021లో భారత్ నుంచి విదేశాలకు నేరుగా నగదు పంపించే (అవుట్ వార్డ్ రెమిటెన్స్) సేవలను ప్రారంభించినట్లు స్మృతి పేర్కొన్నారు.

## నెలవారీ ఖర్చులకూ క్రెడిట్ కార్డులే దిక్కు

● థింక్360.ఏఐ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో క్రెడిట్ కార్డుల సంస్కృతి పెరిగిపోతోంది. చేతిలో చిల్లిగవ్వ లేక పోయినా.. జేబులో క్రెడిట్ కార్డు ఉంటే చాలు ఎడాపెడా ఖర్చు పెట్టేస్తున్నారు. బడా బాబులేగాక, చిరుద్యోగులు, స్వయం ఉపాధిలో ఉన్న వ్యక్తులకు సైతం ఇప్పుడు క్రెడిట్ కార్డు నిత్యావసరమైంది. థింక్ 360.ఏఐ అనే సంస్థ గత ఏడాది కాలంగా దాదాపు 20,000 మంది చిరుద్యోగులు, స్వయం ఉపాధిలో ఉన్న వ్యక్తుల ఆర్థిక ప్రవర్తనను సర్వే చేసి..ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. చిరుద్యోగుల్లో నెలకు రూ.50,000 కంటే తక్కువ జీతం ఉన్న వారి ఖర్చుల తీరుతెన్నులను ఇందుకోసం పరిగణనలోకి తీసుకుంది.

**సర్వే ముఖ్యాంశాలు**

- నెలవారీ ఖర్చులను క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లిస్తున్న 93 శాతం మంది చిరుద్యోగులు
- స్వయం ఉపాధిలో ఉన్న వ్యకుల్లోనూ 85 శాతం మందికి నెలవారీ ఖర్చుల చెల్లింపులకు క్రెడిట్ కార్డులే గతి.
- 'బై నౌ పే లేటర్' (బీఎన్‌పీఎల్) విధానం పట్ల ఆకర్షితులైన 18 శాతం మంది స్వయం ఉపాధి వ్యక్తులు. అదే బాటలో 15% మంది చిరుద్యోగులు
- గిగ్ వర్కర్లతో పాటు అందరికీ తప్పనిసరి అవసరంగా మారిన క్రెడిట్ కార్డులు, బీఎన్‌పీఎల్ విధానం
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా మంజూరు చేసిన వ్యక్తిగత రుణాల్లో 72 శాతం (సుమారు రూ.92,000 కోట్లు) వాటా ఫిన్‌టెక్ కంపెనీలదే

## డిగ్రీలు కాదు.. కావాల్సింది నైపుణ్యం

» కొత్త విషయాలు నేర్చుకుంటేనే విజయాలు: శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో డిగ్రీల కంటే నైపుణ్యమే కీలకమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కాలం చెల్లిన జ్ఞానాన్ని విడిచిపెట్టి, నిరంతరం నూతన విషయాలను నేర్చుకుంటూ ముందుకు సాగితేనే విజయాలు వరిస్తాయని పేర్కొన్నారు. లెర్న్, అన్ లెర్న్, రీ లెర్న్' అనేది ఇప్పుడు సక్సెస్‌కు ఫార్ములా అని వివరించారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'మన అమెరికా తెలుగు సంఘం(మాట) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ పొందినవారికి మంత్రి ధ్రువీకరణపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పటిలా చేతిలో డిగ్రీ ఉంటే ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదని, 50% మంది పట్టభద్రులకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేవని నాస్కామ్ గుర్తించిందని తెలిపారు. 'ఆటోమేషన్ వల్ల ఉద్యోగాలు కనుమరుగైపోతాయనే ఆందోళన వద్దు. 2025 నాటికి 8.5 కోట్ల ఉద్యోగాలు రోబోలు, ఏఐ వల్ల పోతే.. కొత్తగా 9.7 కోట్ల ఉద్యోగాలు పుట్టుకొస్తాయని వరల్డ్ ఎకానమిక్ ఫోరం తేల్చింది. అని చెప్పారు. కాగా, బెంగళూరులోని ఫ్రాన్స్ దౌత్యాధికారి మార్క్ లామీ మంత్రి శ్రీధర్‌బాబును సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో తెలంగాణ - ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

## రైతులపై పెట్టుబడి పెట్టండి

» మోసగించేవారికి రుణాలిస్తే ఎలా?

» వేల కోట్లు తీసుకుని దేశం వదిలి పారిపోతున్నారు

» రైతులైతే తీసుకున్న రుణానికి ప్రతిపైసా చెల్లిస్తారు: తుమ్మల

హైదరాబాద్/చిక్కడపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): "రైతులపై పెట్టుబడి పెట్టాలి. బ్యాంకులను మోసం చేసి వేలకోట్లు దండుకొని విదేశాలకు పారిపోయేవారిపై నమ్మకం పెట్టుకుంటే ఏం లాభం? రైతులు బ్యాంకుల నుంచి అప్పు తీసుకుంటే నయాపైసా బాకీ లేకుండా వడ్డీతో సహా చెల్లిస్తారు. సరైన సమయంలో రైతులకు రుణాలిచ్చి బ్యాంకర్లు అండగా నిలబడాలి" అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నాబార్డు 44వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నాబార్డు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తుమ్మల మాట్లాడారు. వ్యవసాయేతర రుణాలు తీసుకున్న వారు ఎగ్గొట్టినవి ఎన్ని ఉన్నాయో, వ్యవసాయ రుణాలు తీసుకున్న వారు ఏ మేరకు ఎగ్గొట్టారో బేరీజు వేసుకోవాలని సూచించారు. రైతులు కూడా పెద్దమొత్తంలో రుణాలు తీసుకుని ఎగ్గొట్టొచ్చా అని వ్యాఖ్యానించారు. వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే గ్రామీణ బ్యాంకులు రైతులకు చేదోడువాదోడుగా ఉంటున్నాయన్నారు. రైతులు, మహిళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉన్నదని పేర్కొన్నారు. వ్యవసాయం, పశుపోషణ, సహకార సంఘాలు, ప్రకృతి వ్యవసాయం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధిలో నాబార్డు కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు.

## బీటెక్‌లో మరో 8వేల సీట్లు పెరిగే అవకాశం!

» సాంకేతిక విద్యాశాఖ కసరత్తు

హైదరాబాద్ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలోని 90కి పైగా కాలేజీల్లో సుమా రు 8వేల సీట్ల పెంపునకు సాంకేతిక విద్యాశాఖ సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే ఉస్మానియా, కాకతీయ, జేఎన్‌టీయూ యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి అనుమతి మేరకు సీట్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తే.. కాలేజీల్లో కల్పించాల్సిన మౌలిక వసతుల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే ఆయా కాలేజీల్లో తనిఖీలు నిర్వహించాలని వర్సిటీలకు సూచించినట్లు సమాచారం. ఈ ఏడాది కోర్ బ్రాంచ్‌లకు డిమాండ్ పెరగడంతో ఆ మేరకు సీట్లను పెంచుకునేందుకు కాలేజీలు మొగ్గు చూపుతున్నాయి. ఈ క్రమంలో ఒక్కో కాలేజీల్లో వసతుల స్థాయిని బట్టి గరిష్ఠంగా 120 సీట్ల మేర పెంచేందుకు అనుమతిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు అధికారిక వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## వాణిజ్య పన్నుల అదనపు కమిషనర్ లావణ్యపై బదిలీ వేటు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లపై ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారంటూ అసిస్టెంట్ కమిషనర్లు ఫిర్యాదు చేసిన అనంతరం రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ జి.లావణ్యపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆబిడ్స్ డివిజన్‌ను పర్యవేక్షిస్తున్న ఆమెను వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేసింది. ఈమేరకు వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. లావణ్యతో పాటు సికింద్రాబాద్ డివిజన్ అదనపు కమిషనర్ వాసవీ జగన్నాథం, మాదాపూర్ అదనపు కమిషనర్ కె.గీతలను కూడా కమిషనరేట్‌కు బదిలీ చేశారు.

## ఎన్కెపల్లి భూములపై దర్యాప్తు ముమ్మరం

» అజ్ఞాతంలోకి డప్పు రమేశ్.. వివరాలు సేకరిస్తున్న అధికారులు

» ఆ భూముల్లో సాగుచేస్తున్న 26మంది రైతులకు పట్టాల పంపిణీ

» మరో 10మందికి నేడు అందజేయనున్నట్టు తెలిపిన అధికారులు

మొయినాబాద్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్ శివార్లలో.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కెపల్లిలో జరిగిన భూ కుంభకోణంపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎన్కెపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 180లోని 99.14 ఎకరాల ప్రభుత్వ భూమిని తప్పుడు పత్రాలతో అమ్మేందుకు యత్నించినవారిలో గ్రామస్థులు మాత్రమే ఉన్నారా? బయటి వ్యక్తుల హస్తం కూడా ఉందా? అనే వివరాలు సేకరిస్తున్నారు. మోసపోయిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. రెవెన్యూ అధికారులు ఫోర్జరీ పొజిషన్ పత్రాల వివరాలు సేకరిస్తున్నారు. కాగా.. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన డప్పు రమేశ్.. తన గుట్టు రట్టు కావడంతో ఫోన్ స్విచాఫ్ చేసేసి, మంగళవారం అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతణ్ని పట్టుకునేందుకు పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు. వాస్తవానికి ఈ వ్యవహారంలో అతడు ముందుండి క్రయవిక్రయాలు జరిపినప్పటికీ అతని వెనక బడా నేతలు ఉన్నారనే చర్చ జరుగుతోంది. అతణ్ని అదుపులోకి తీసుకుంటే తనతోపాటు ఎవరెవరు ఉన్నారనే విషయం తెలుస్తుందని పోలీసులు, రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు.

### పట్టాల అందజేత..

ప్రభుత్వం గోశాల నిర్మాణం కోసం తీసుకుంటున్న భూమిలో సాగు చేసుకుంటున్న 26 మంది రైతులకు.. ఎకరానికి 300 గజాల చొప్పున కేటాయిస్తూ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి కేటాయింపు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆ స్థలాలను అమ్ముకోవద్దని రైతులకు సూచించారు. దళారుల మాటలు నమ్మకుండా మిగతా రైతులు సైతం ముందుకొచ్చి పట్టాలు తీసుకోవాలని సూచించారు. ఈ భూమిలో మొత్తం 46 కుటుంబాలు సాగు చేసుకుంటుండగా మంగళారం తొమ్మిది కుటుంబాలకు చెందిన 26 మంది రైతులకు ఇచ్చారు. అయితే.. పట్టాలు తీసుకునేందుకు వస్తున్న ఆ 26 మందినీ మిగతావారు అడ్డుకునేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అక్కడినుంచి తరలించారు.

## ఇందిరమ్మ ఇంటి బిల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

మాసాయిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి పథకం బిల్లులు రాలేదని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. మెదక్ జిల్లా మాసాయిపేటలో మంగళవారం ఈ ఘటన జరిగింది. మాసాయిపేట దళిత కాలనీకి చెందిన ఎర్ర నర్సింహులు పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. తానుండే పూరి గుడిసె తీసేసి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాడు. పునాదుల వరకు నిర్మాణ పనులు పూర్తి చేశాడు. అయితే, ఆ పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. నర్సింహులు నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టకపోవడంతోనే బిల్లులు ఆగినట్టు తెలిసింది. అయితే, తీవ్ర మనస్తాపం చెందిన నర్సింహులు పెయింటింగ్ ఆయిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో అతని శరీరం, కాళ్లు కొంతమేర కాలిపోయాయి. గమనించిన కుటుంబసభ్యులు మంటలు ఆర్పి అతనిని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులను సంప్రదించగా తాము నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇంటి బిల్లులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

# పెట్టుబడులతో తరలిరండి

(మొదటిపేజీ తరువాయి)

జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ పరిశ్రమ నూతన యూనిట్‌కు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభినందిస్తున్నామన్నారు. "ప్రపంచ బల్క్ డ్రగ్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంది. దేశంలో 33 శాతం టీకాలను కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నారు. బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం ఇక్కడే ఉత్పత్తి చేస్తున్నారు. కొవిడ్ సమయంలో దాదాపు వంద దేశాలకు వ్యాక్సిన్ అందించిన ఘనత జీనోమ్ వ్యాలీకి దక్కింది. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉంది. పారిశ్రామిక రంగం అభివృద్ధికి అవసరమైన రాయితీలు, ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలు, అనుమతుల జారీ తదితర విషయాల్లో సానుకూల వాతావరణం కల్పిస్తాం. తెలంగాణను మరింత అభివృద్ధి చేసేందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలి" అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాలను ముందుకు తీసుకువెళ్లే విధంగానే నిర్ణయాలు ఉంటాయని, పారిశ్రామిక పాలసీలు, ఇన్సెంటివ్‌లు, అనుమతులు ఇచ్చే విషయంలో విధానపరమైన నిర్ణయాలను మెరుగుపర్చుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఇంకా మెరుగైన నిర్ణయాలు తీసుకుని దేశంలో పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.



ఐకార్ బయోటెక్నాలజీ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, తదితరులు

### డేటా సెంటర్స్‌కు అడ్డాగా హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిన్నరలోనే దాదాపు రూ.3.28 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకు ఆహ్వానించామని, ప్రస్తుతం డేటా సెంటర్లకు హైదరాబాద్ నిలయంగా మారిందని, బయో ఫార్మసీ, ఇతర పరిశ్రమలను ఆకర్షించడంలో ముందుందని తెలిపారు. తెలంగాణకు మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ పోటీ కాదని, ప్రపంచ దేశాలతోనే పోటీ పడాలని చెప్పారు. ప్రపంచంలో ఉన్న అధునాతనమైన విధానాలను, పరిశ్రమలను రాష్ట్రానికి ఆహ్వానించాలన్నారు. దేశ ఎకానమీలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఐకార్ మేనేజింగ్ డైరెక్టర్ సూదిన ఆనంద్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు.

# ఇచ్చంపల్లిలోనే రిజర్వాయర్!

(మొదటిపేజీ తరువాయి)

ఏకంగా 200 టీఎంసీలను తరలించడానికి వీలుగా ఏపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. అంతేకాకుండా పోలవరం నుంచే గోదావరి-కావే రి అనుసంధానం చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి కూడా చేస్తోంది. దాంతో ఏపీ ప్రయత్నాలను అడ్డుకోకపోతే గోదావరి-కావేరి అనుసంధానం కూడా తెలంగాణ చేజారే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం.. వ్యూహాత్మకంగా వ్యవహరించి ఇచ్చంపల్లిని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. వాస్తవానికి గోదావరి-కావేరి అనుసంధానాన్ని ఇచ్చంపల్లి నుంచే చేపట్టాలని జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదిస్తోంది. అయితే గత ప్రభుత్వం సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) నుంచి చేపట్టడానికి సమ్మతి తెలిపింది.

### మేడిగడ్డకు ప్రత్యామ్నాయంగా..

ఇచ్చంపల్లి రిజర్వాయర్‌ను 95 నుంచి 100 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే.. బ్యాక్ వాటర్ కన్నెపల్లి (మేడిగడ్డ) పంప్‌హౌస్ హెడ్‌కు తగులుతుంది. అప్పుడు ఆ నీటిని అన్నారంలోకి, అక్కడి నుంచి సుందిళ్లకు, అటు నుంచి ఎల్లంపల్లికి తరలించే అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి 195 టీఎంసీల నీటిని ఇలా తరలించాలని యోచించిన విషయం తెలిసిందే. అయితే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, దాని పునరుద్ధరణ అంత తేలిగ్గా అయ్యే పరిస్థితులు కనిపించడంలేదు. బ్యారేజీ ఏడో బ్లాకులోని 11 పిల్లర్లలో రెండు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. దానిని పునరుద్ధరించాలంటే మొత్తం బ్లాకును తొలగించాల్సి ఉంటుంది. అంతేకాకుండా బ్యారేజీ ఎగువ, దిగువ భాగంలో రక్షణ చర్యలకు భారీగానే నిధులు వెచ్చించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో 195 టీఎంసీల నీటిని ఇచ్చంపల్లి నుంచి తరలించేలా ప్రభుత్వం కొత్త చర్యలు చేపడుతోంది. గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే నీటిలో వాటా నుంచి 42 టీఎంసీలను కేటాయించడానికి కేంద్రం సమ్మతి తెలుపడంతో రెండు రిజర్వాయర్లు నిర్మించుకోవాలని తెలంగాణ యోచిస్తోంది. వీటి నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని కేంద్రమే భరించాలని గతంలోనే కోరింది. బుధవారం న్యూఢిల్లీలో జరిగే ముఖ్యమంత్రుల సమావేశంలో ఇచ్చంపల్లి రిజర్వాయర్ కూడా ఒక ఎజెండాగా చేర్చాలని విజ్ఞప్తి చేసింది.



### కాటన్ గుర్తించినా..

గోదావరి-ఇంద్రావతి సంగమ ప్రాంతంలో ఇచ్చంపల్లి ఉంది. ధవళేశ్వరం(కాటన్) బ్యారేజీ నిర్మించే క్రమంలో ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్‌కు అనుకూలత ఉందని సర్ ఆర్థర్ కాటన్ గుర్తించారు. అప్పట్లో పరిశోధనలు కూడా చేశారు. అయితే నిర్మాణం చేపట్టే క్రమంలో కార్మికులంతా మలేరియా వ్యాధి బారిన పడటంతో ఇచ్చంపల్లిని వీడారు. ఇక ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి గోదావరి నీటిని అందించడానికి వీలుగా 1980లోనే 118 మీటర్ల ఎత్తుతో ఇచ్చంపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి బచావత్ ట్రైబ్యునల్ అనుమతినిచ్చింది. కానీ, 118 మీటర్ల ఎత్తుతో కడితే భారీగా ముంపు ఉంటుందని దీనిపై ఏ నిర్ణయం తీసుకోలేకపోయారు. అనంతరం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అభ్యంతరాలతో ఈ బ్యారేజీ ఎత్తును 112 మీటర్లకు తగ్గించుకున్నారు. ఇందుకు మహారాష్ట్ర అంగీకరించగా.. మధ్యప్రదేశ్ మళ్లీ అభ్యంతరం తెలిపింది. దాంతో 1986-88లో 108 మీటర్లకు కుదించుకున్నారు. అయితే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడ్డాక ఆ రాష్ట్రం అభ్యంతరాలతో 105 మీటర్లకు తగ్గింది. కానీ, 105 మీటర్ల పైన బ్యారేజీ కడితేనే గ్రావిటీ ద్వారా నీటిని తరలించడానికి అవకాశం ఉంటుందని, దాని కిందికి కడితే లిఫ్టింగ్ చేయాల్సిందేనని గుర్తించారు. అభ్యంతరాలతో తుదిగా 87 మీటర్ల ఎత్తుతో రిజర్వాయర్ నిర్మాణానికి ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. 87 మీటర్లతో కడితే 15 టీఎంసీల నీటి నిల్వకు అవకాశం ఉంటుంది. కానీ, 100 మీటర్ల ఎత్తు కోసం కేంద్రాన్ని తెలంగాణ కోరే అవకాశాలున్నాయి.

ఇచ్చంపల్లిపై తెలంగాణ తొలుత అభ్యంతరం తెలిపింది. ఇచ్చంపల్లి నుంచి కేవలం 24 కిలోమీటర్ల దిగువలోనే తుపాకులగూడెం (సమ్మక్క) బ్యారేజీ ఉన్నందున.. రిజర్వాయర్ నుంచి నీటిని ఆకస్మికంగా విడుదల చేయాల్సి వస్తే.. ఆ వరదను నియంత్రించే పరిస్థితులు ఉండబోవని అభిప్రాయపడింది. ఫ్లడ్ రూటింగ్‌కు ఇబ్బందులు వస్తాయని చెబుతూ వచ్చింది. ఇచ్చంపల్లికి దిగువన 158 టీఎంసీల (దేవాదులకు 38 టీఎంసీలు, సీతారామకు 70 టీఎంసీలు, తుపాకులగూడెంకు 50 టీఎంసీలు) నీటి వినియోగం ఉందని పేర్కొంది. ఇచ్చంపల్లి రిజర్వాయర్ కట్టి ఏకకాలంలో గోదావరి-కావేరి అనుసంధానంతోపాటు దిగువన ఉన్న ప్రాజెక్టుల అవసరాలు తీర్చడం ఎలా సాధ్యమని ప్రశ్నించింది. అయితే ఫ్లడ్‌రూటింగ్‌కు ఇబ్బందుల్లేవని ఇప్పటికే

### తొలుత అభ్యంతరాలు...

కేంద్రం తెలంగాణకు సమాచారం కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఇచ్చంపల్లిపై ప్రభుత్వం తాజాగా మనసు మార్చుకుంది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును వేగంగా ఏపీ చేపడుతుండటంతో దీనికి కౌంటర్‌గా, కాళేశ్వరంలోని మేడిగడ్డకు ప్రత్యామ్నాయంగా ఇచ్చంపల్లిని ప్రభుత్వం నమ్ముకుంది. గోదావరి-కావేరి అనుసంధానంలో ఇచ్చంపల్లి రిజర్వాయర్‌ను కడితే 90 శాతం వ్యయాన్ని కేంద్రమే భరించాల్సి ఉంటుంది. మిగిలిన 10 శాతం వ్యయాన్ని నీటి వాటా ఆధారంగా నిష్పత్తిని బట్టి ఆయా రాష్ట్రాలు (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి) చెల్లించాల్సి ఉంటుంది. సత్వర సాగు నీటి ప్రయోజన పథకం కింద కేంద్రం అనుమతినిస్తే మాత్రం 60% నిధులు మాత్రమే వస్తాయి.

## మిగులు జలాలపై పూర్తి హక్కు మాకే!

**అమిత్ షాకు ఏపీ సీఎం బాబు స్పష్టీకరణ**

న్యూఢిల్లీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నదీ ప్రవాహ మార్గంలో చివరి రాష్ట్రంగా గోదావరి మిగులు జలాలను పూర్తిగా వినియోగించుకునే హక్కు ఆంధ్రప్రదేశ్‌కు ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గోదావరి నదిలో ఎగువ, దిగువ రాష్ట్రాల నీటి అవసరాలు తీర్చిన తర్వాత కూడా 90 నుంచి 120 రోజులు మిగులు నీరు ఉంటుందన్నారు. మంగళవారం ఢిల్లీలో అమిత్ షాను ఆయన నివాసంలో సీఎం కలుసుకున్నారు. రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై ఉభయులూ చర్చించారు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు నీటిని తరలించేందుకు పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కీలకమని చంద్రబాబు తెలిపారు.

## పోలవరం నుంచి అనుసంధానం చేపట్టాలి

» ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో కోరిన ఏపీ

అమరావతి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానాన్ని తెలంగాణలోని ఇచ్చంపల్లి నుంచి కాకుండా ఏపీలోని పోలవరం నుంచి చేపట్టాలని ఏపీ జలవనరుల శాఖ కోరుతోంది. మంగళవారం గోదావరి పరివాహక రాష్ట్రాలతో ఎన్‌డబ్ల్యూడీఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు సూచన చేసింది. ఈ సందర్భంగా ధవళేశ్వరం-కావేరి అనుసంధానంపై చర్చ జరగగా.. ధవళేశ్వరం ఆనకట్ట చాలా పురాతనమైపోయిందని, నదుల అనుసంధాన ప్రవాహ వేగాన్ని తట్టుకునే పరిస్థితిలో లేదని ఏపీ తెలిపింది. సమీపంలోనే ఉన్న పోలవరం ప్రాజెక్టు నుంచి కావేరికి అనుసంధానం చేపట్టాలని ప్రతిపాదించింది. తెలంగాణలోని ఇచ్చంపల్లి వద్ద గోదావరి జలాల్లో 300 టీఎంసీల లోటు ఉన్నందున.. అక్కడి నుంచి కావేరికి అనుసంధాన ప్రక్రియ చేపడితే కేంద్రం ఆశించిన ప్రయోజనాలు నెరవేరవని ఏపీ అభిప్రాయపడింది.

# ఎజెండాలో బనకచర్ల వద్దు

**సీఎంల సమావేశపు ఎజెండాపై తెలంగాణ అభ్యంతరం**

» చర్చించే అంశాల చిట్టాను సవరించాలని కేంద్రానికి లేఖ

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల జలవివాదాలపై చర్చించేందుకుగాను కేంద్ర జలశక్తి శాఖ బుధవారం ఢిల్లీలో నిర్వహించనున్న సమావేశపు ఎజెండాలో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును చేర్చడంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం లేఖ రాశారు. తక్షణమే ఎజెండాను సవరించాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పదే పదే అభ్యంతరం తెలుపుతున్న విషయాన్ని గుర్తు చేశారు. "గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదికను తిరస్కరించాలని సీడబ్ల్యూసీని కోరుతున్నాం. తదుపరి డీపీఆర్ దాఖలు చేయకుండా నియంత్రించాలని, టెండర్లు చేపట్టకుండా అడ్డుకోవాలని కోరుతున్నాం. ఈ ప్రాజెక్టుకు చట్టబద్ధమైన అనుమతులు లభించకుండా ఏ వేదికలోనూ చర్చించడానికి వీల్లేదు. ట్రైబ్యునల్ అవార్డులు, చట్ట పరిమితులకు లోబడి అంతర్రాష్ట్ర సంప్రదింపులు, అభ్యంతరాలన్నీ పూర్తి స్థాయిలో పరిష్కారమయ్యే దాకా దీన్ని ముట్టుకోరాదు" అని లేఖలో సీఎస్ పేర్కొన్నారు. ప్రాజెక్టుపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) లేవనెత్తిన అభ్యంతరాలను కూడా లేఖలో పొందుపరిచారు.


### తెలంగాణ తెలిపిన అభ్యంతరాలు

- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు 1980లో గోదావరి ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకం. ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం.. రాష్ట్రాల సమ్మతి లేకుండా, సంప్రదింపులు లేకుండా ప్రాజెక్టుకు ప్రతిపాదించిన నీటి కేటాయింపులు, ప్రాజెక్టు నిర్వహణ బేసిన్‌ను పంచుకునే రాష్ట్రాలకు వ్యతిరేకం.
- ఈ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ చట్టబద్ధంగా క్లియరెన్స్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. గోదావరి, కృష్ణా యాజమాన్య బోర్డులు డీపీఆర్‌ను పరిశీలించాల్సి ఉంటుంది. ఇవేవీ ఈ ప్రాజెక్టుకు లేవు.
- ఈ ప్రాజెక్టు కోసం సమర్పించిన ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)లో కీలక సమాచార లోపాలున్నాయి. నీటి లభ్యత, సాంకే తిక సమాచారం లోపించింది.
- పర్యావరణ అనుమతులకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి వీలుగా విచారణ విధి విధానాలు జారీ చేయాలని ఏపీ కోరగా... కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖకు చెందిన నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) ప్రాజెక్టు ప్రతిపాదనలను తిప్పిపంపింది.
- పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటి తరలింపు అనేది ఏకపక్షం. ఇది పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్‌కు పూర్తిగా వ్యతిరేకం. తెలంగాణ నీటి హక్కులను ప్రభావితం చేస్తుంది.
- పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ముంపు సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. ఇది కోర్టు విచారణలో ఉంది. ఈ సమయంలో నీటి మళ్లింపు అనుసంధానం సరైంది కాదు.
- గోదావరి జలాలపై తెలంగాణకు చట్టబద్ధమైన హక్కు, కరువు పీడిత ప్రాంతాలకు నీటి తరలింపుపై దీని ప్రభావం ఉంటుంది. అంతర్రాష్ట్ర నదీ జలాల్లో సమాన నీటి వాటాకు వ్యతిరేకం.
- ట్రైబ్యునల్ అవార్డులు, అంతర్రాష్ట్ర నీటి ఒప్పందాలకు వ్యతిరేకంగా గోదావరి-బనకచర్ల ఉంది. పోలవరం నుంచి 80 టీఎంసీలను కృష్ణా డెల్టాకు తరలించే వాటాలో నదీ పరివాహకాన్ని పంచుకునే రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు ఇంకా తేలలేదు.

## పీవీ భారత డెంగ్ జియావోపింగ్

**ఆర్థిక సంస్కరణలతో దేశం రూపురేఖలను మార్చారు**

**ఏపీ సీఎం చంద్రబాబు పీవీ స్మారకోపన్యాసం**



న్యూఢిల్లీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశం రూపురేఖలు మార్చిన మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు.. ఒకప్పటి చైనా అధినేత డెంగ్ జియావోపింగ్ లాంటి నాయకుడని సీఎం చంద్రబాబు అభివర్ణించారు. మంగళవారం ఢిల్లీలోని ప్రధానమంత్రి సంగ్రహాలయంలో ఆయన పీవీ స్మారకోపన్యాసం చేశారు. మైనారిటీ ప్రభుత్వంలో ఉన్నప్పటికీ సోషలిస్టులు, కమ్యూనిస్టులు, కార్పొరేట్లు అందరినీ కలుపుకుని పోయి సమర్థ నాయకత్వాన్ని అందించిన పీవీ నిజమైన తెలుగుబిడ్డ అని చెప్పారు. హిందీ నేర్చుకోవడాన్ని వివాదాస్పదం చేస్తున్న ప్రస్తుత తరుణంలో 17 భాషలు తెలిసిన ఆయన దేశానికి మార్గదర్శకుడని కొనియాడారు. పీవీ ప్రారంభించిన సంస్కరణలను వాజపేయి కొనసాగించారని, 1995లో సీఎం అయిన తర్వాత తాను రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టానని గుర్తుచేశారు. లైసెన్స్ రాజ్‌ను అంతం చేసిన పీవీ సంస్కరణల ప్రభావాన్ని మనం నేడు అనుభవిస్తున్నామని తెలిపారు. పీవీ దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడని, రాజకీయ పరిపక్వతకు, సమతుల్యతకు ప్రతీక అని అన్నారు. భారతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని జీర్ణించుకున్న ఆయన మొత్తం తెలుగుజాతి గర్వించదగ్గ మేధావి అని, ఆయన జీవితం అందరికీ ప్రేరణ దాయకమని పేర్కొన్నారు. 1991లో అసాధారణమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న భారత్... బంగారాన్ని కూడా తాకట్టు పెట్టాల్సివచ్చిందని, అలాంటి పరిస్థితుల నుంచి పీవీ దేశాన్ని గట్టెక్కించారని, విదేశీ పెట్టుబడులు ఆహ్వానించారని, ఐటీ విప్లవానికి నాంది పలికారని సీఎం గుర్తు చేశారు.

**సముద్రం పక్కనే ఉన్నామని..**

# నీళ్లన్నీ మావే అంటే కుదరదు

**ఏ రాష్ట్రానికైనా దేశంలో అమల్లో ఉన్న చట్టాలే వర్తిస్తాయి.. ఏడు రాష్ట్రాలు అంగీకరిస్తేనే గోదావరిపై ట్రైబ్యునల్**

» కాళేశ్వరం, బనకచర్లకు ప్రత్యామ్నాయంగా ఇచ్చంపల్లి

» 100 మీటర్ల ఎత్తుతో రిజర్వాయర్ కడితే బ్యాక్‌వాటర్‌ను.. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి పంపింగ్ చేసుకోవచ్చు

» జలశక్తి శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ వెల్లడి



హైదరాబాద్, జూలై15 (ఆంధ్రజ్యోతి): సముద్రం పక్కనే ఉన్నామని.. అందులోకి పోయే నీళ్లన్నీ తమవేనని ఎవరైనా అంటే కుదరదని కేంద్ర జలశక్తి శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ అన్నారు. ఏ రాష్ట్రానికైనా దేశంలో అమల్లో ఉన్న చట్టాలే వర్తిస్తాయని స్పష్టం చేశారు. గోదావరి జలాల పంపిణీ కోసం ట్రైబ్యునల్ వేయడం అంత సులభం కాదని, ఆ నీటిని పంచుకునే రాష్ట్రాలన్నీ అంగీకరిస్తేనే సాధ్యమవుతుందని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో 'గోదావరి జలాల వివాదం-వాస్తవాల పరిశీలన' అనే అంశంపై తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు కప్పెర ప్రసాద్‌రావు అధ్యక్షతన నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో వెదిరె శ్రీరామ్ మాట్లాడారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల వైఫల్యం నేపథ్యంలో గోదావరి-బనకచర్లకు ప్రత్యామ్నాయంగా 'గోదావరి-కావేరి అనుసంధానం' ఉంటుందన్నారు. 100 మీటర్ల ఎత్తుతో ఇచ్చంపల్లి రిజర్వాయర్ నిర్మిస్తే.. బ్యాక్ వాటర్‌ను కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి పంపింగ్ చేసుకోవచ్చని అన్నారు. గోదావరి-కావేరి అనుసంధానానికి అయ్యే వ్యయంలో 90 శాతాన్ని కేంద్రమే భరిస్తుందని, మిగిలిన 10 శాతం వ్యయాన్ని.. ప్రయోజనం పొందే రాష్ట్రాలు వాటి వినియోగం నిష్పత్తి ఆధారంగా భరించాల్సి ఉంటుందని తెలిపారు. రూ.లక్ష కోట్లతో నిర్మించే గోదావరి-బనకచర్లలో ముంపునకు/సేకరించే భూమి 63 వేల ఎకరాలు కాగా, రూ.50 వేల కోట్లతో చేపట్టే గోదావరి-కావేరి అనుసంధానంలో ముంపునకు గురయ్యే భూమి 43 వేల ఎకరాల మాత్రమేనని శ్రీరామ్ పేర్కొన్నారు. పైగా, గోదావరి-కావేరితో తరలించే నీటితో 80 శాతం తెలంగాణ, రాయలసీమకే ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టులో తరలించే నీటితో కూడా తెలుగు రాష్ట్రాలకు సంబంధం లేదని, ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని వాటా నుంచే 147 టీఎంసీలను తొలి దశలో తరలించనున్నారని తెలిపారు.

### నిల్వ సామర్థ్యం లేని ప్రాజెక్టుల వల్లే ఇబ్బందులు..

తెలంగాణలో శ్రీరాంసాగర్ (పోచంపాడు)ను 135 టీఎంసీలతో చేపట్టగా.. పూడిక వల్ల దాని నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయిందని వెదిరె శ్రీరామ్ అన్నారు. గోదావరిలో ప్రధానంగా నిల్వ సామర్థ్యం లేని ప్రాజెక్టుల వల్లే ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు కూడా ఈ కోవకు చెందినదేనన్నారు. గోదావరి-కావేరి అనుసంధానం ప్రాజెక్టును ప్రభావిత రాష్ట్రాలు అంగీకరిస్తేనే చేపట్టే అవకాశం ఉంటుందని, తెలుగు రాష్ట్రాలు గట్టిగా ప్రయత్నిస్తేనే ఇందుకు సానుకూలత వస్తుందని పేర్కొన్నారు. ఇక తుమ్మిడిహెట్టి నిల్వకు, సామర్థ్యానికి సంబంధం లేదని, 150 మీటర్ల ఎత్తుతో కట్టినా.. 165 టీఎంసీల నీటి వినియోగానికి అవకాశం ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు. 148 మీటర్లతో కట్టినా, 150 మీటర్లతో కట్టినా 250 ఎకరాల ప్రైవేట్ భూమి ముంపునకు గురవుతుందని చెప్పారు. దేశంలో రెండో అతిపెద్ద నది గోదావరి అని, మహారాష్ట్రతో పోల్చితే గోదావరి జలాల వినియోగంలో తెలంగాణ వెనుకబడిందని అన్నారు. జలాల వినియోగాన్ని నిర్ధారించేది ట్రైబ్యునల్ మాత్రమేనని, గోదావరికి 12 సబ్ బేసిన్లు ఉండగా... దీనిని ఏడు రాష్ట్రాలు పంచుకుంటున్నాయని వివరించారు. ఇక ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి వద్ద 75 శాతం డిపెండబులిటీ ఆధారంగా 165 టీఎంసీల నీటి లభ్యత ఉందని సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చిందని వెదిరె శ్రీరామ్ వెల్లడించారు. 63 టీఎంసీలు ఎగువ రాష్ట్రాలు వాడుకునే అవకాశాలున్నాయని చెప్పిందని, ఇదే విషయాన్ని మేడిగడ్డ బ్యారేజీ విషయంలోనూ చెప్పిందని పేర్కొన్నారు. గోదావరిలో 75% డిపెండబులిటీ ఆధారంగా 3396.9 టీఎంసీల నీటి లభ్యత ఉండగా.. అందులో ఉమ్మడి ఏపీకి 1499 టీఎంసీల నీటి వినియోగానికి బచావత్ ట్రైబ్యునల్ అంగీకరించిందని తెలిపారు. అందులో 531 టీఎంసీలు ఏపీ, 968 టీఎంసీలు తెలంగాణకు వచ్చాయన్నారు. 1996 నుంచి 2023 దాకా తీసిన లెక్కల ప్రకారం ఏటా 3396 టీఎంసీల్లో గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నట్లు చెబుతున్నారని, కానీ.. అందులో ఎగువ రాష్ట్రాల నికర జలాలు, ప్రాజెక్టులు కట్టుకున్నా వినియోగించుకోని వాటా (ఛత్తీస్‌గఢ్ 400 టీఎంసీలు, తెలంగాణ 307 టీఎంసీలు ఇతరత్రా) అంతా తీసేస్తే.. 1138 టీఎంసీలు మాత్రమే సముద్రంలో కలుస్తున్నాయని వివరించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. మరోసారి ప్రభాకర్‌రావు విచారణ

- పలువురు సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా ప్రశ్నలు
- అంతా ఉన్నతాధికారులకు తెలుసు
- విచారణలో వెల్లడించిన ప్రభాకర్‌రావు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు మరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. డీసీపీ విజయకుమార్, ఏసీపీ వెంకటగిరి ఆయనను మంగళవారం సుమారు ఎనిమిదిన్నర గంటల పాటు విచారించారు. రాత్రి 7.30 సమయంలో సిట్ కార్యాలయం నుంచి పంపించారు. ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి.. మోసపూరిత విధానాలతో 618 మంది వ్యక్తుల ఫోన్లను ట్యాపింగ్ చేసిన విషయంలో ప్రభాకర్‌రావును సిట్ అధికారులు నిశితంగా విచారించారు. "నక్సల్స్ సమాచారం కోసమంటూ, మావోయిస్టులతో సంబంధం లేని రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, పారిశ్రామిక వేత్తలు, సెలబ్రిటీల ఫోన్లను ఎందుకు ట్యాప్ చేయించారు? మీరు అలా చేయడానికి కారణం ఏమిటి?.. అది మీ సొంత నిర్ణయమా? లేక ఎవరైనా ఆదేశించారా? ' అంటూ ప్రభాకర్‌రావుపై ప్రశ్నల వర్షాన్ని కురిపించారు. మావోయిస్టుల సమాచారం కోసమంటూ ప్రభాకర్‌రావు పెట్టిన లిస్టులోని 618 మందిలో దాదాపు 300 మంది వాంగ్మూలాలను సిట్ అధికారులు ఇప్పటికే నమోదు చేశారు. ఈ వాంగ్మూలాలను ప్రభాకర్ రావు ముందు పెట్టి, వీరంతా మావోయిస్టులతో సంబంధం లేని వారే కదా?? ఎందుకు మీరు ఆ విధంగా చేయాల్సి వచ్చిందంటూ ప్రశ్నించారు. ప్రభాకర్ రావు చాలా ప్రశ్నలకు సమాధానమివ్వలేదని, విచారణకు సహకరించలేదని.. "గుర్తులేదు.. తెలియదు" అనే సమాధానాలు ఇచ్చారని తెలుస్తోంది. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులు ప్రభాకర్‌రావు ఆదేశాలను పాటించినట్లు సిట్‌కు ఇచ్చిన వాంగ్మూలాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే..! దీన్ని ప్రభాకర్‌రావు తప్పుబడుతూ వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. "పోలీసు కస్టడీలో వాంగ్మూలానికి చట్టబద్ధత లేదు. మీరు రాసుకునేది రాసుకుంటారు. రాయించేది రాయిస్తున్నారు. నా సర్వీసు మొత్తంలో ఉన్నతాధికారులు చెప్పినట్లే చేశాను. నాపైన చాలా మంది అధికారులు ఉన్న సంగతి మీకూ తెలుసు. అంతా ఉన్నతాధికారులకు తెలుసు" అని మంగళవారం నాటి విచారణ సందర్భంగా ప్రభాకర్‌రావు వ్యాఖ్యానించినట్లు సమాచారం. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంఎల్‌సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు సిట్ నోటీసులు జారీ చేసింది. గురువారం విచారణకు రావాలని సిట్ ఏసీపీ వెంకటగిరి ఆయనకు నోటీసు జారీ చేశారు.

### కాంగ్రెస్ కోసం కష్టపడ్డందుకే మా ఫోన్ ట్యాప్

- టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు నర్సింహా రెడ్డి

బంజారాహిల్స్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు గత ప్రభుత్వం అనేక తప్పులు చేసిందని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు జేలా నర్సింహారెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా తమ వంటి వారిని వెంటాడిందన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి నర్సింహారెడ్డి ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు గుర్తించిన అధికారులు.. మంగళవారం సిట్ కార్యాలయానికి విచారణకు రావాలని ఆయనకు నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరైన నర్సింహారెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఎస్టీ నియోజకవర్గమైన దేవరకొండలో పార్టీ కోసం పని చేస్తున్నామన్న కక్షతోనే తమపై అనుక్షణం నిఘా పెట్టారని ఆరోపించారు.

### 19న నూతన సీజేగా ఏకే సింగ్ ప్రమాణం

తెలంగాణ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా నియామకమైన అపరేశ్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) ఈ నెల 19న రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నూతన సీజేతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. 19న మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ మేరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.

### బండి సంజయ్, ఈటలపై కేసులు కొట్టివేత

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై నమోదైన కేసును హైకోర్టు మంగళవారం కొట్టేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అప్పటి సీఎం కేసీఆర్‌పై బండి సంజయ్ అసభ్య పదజాలంతో రెచ్చగొట్టేలా మాట్లాడారని పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. కరీంనగర్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని పేర్కొంటూ బండి సంజయ్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం.. దర్యాప్తు అధికారి సరైన సాక్ష్యాధారాలను సేకరించడంలో విఫలమయ్యారని పేర్కొంటూ కేసును కొట్టేసింది. మరోవైపు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై హనుమకొండ జిల్లా కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసునూ హైకోర్టు కొట్టేసింది.

### కన్వీనర్ కోటా మెడికల్ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌లో పాల్గొనదల్చిన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి 25వ తేదీ లోపు వర్సిటీ వెబ్‌సైట్‌లో తమ వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలని తెలిపింది. ముఖ్యంగా కులం, స్థానికతకు సంబంధించిన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని సూచించింది.

### సెలూన్ ఎలా పెడతావని నాయీ బ్రాహ్మణేతరుడిపై దాడి

- హైకోర్టుకు బాధితుడు..రక్షణ కల్పించాలని ఆదేశాలు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): 'నాయీ బ్రాహ్మణుడివి కాకుండా సెలూన్ ఎలా పెడతావు?' అంటూ కొందరు తనపై దాడి చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. పిటిషనర్‌కు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. వికారాబాద్ డైట్ కాలేజీ రోడ్డులో ఫెరోజ్ ఖాన్ అనే వ్యక్తి 'ప్రిన్స్ మెన్స్ అండ్ వుమెన్స్ పార్లర్' పేరుతో సెలూన్ షాప్ నడుపుతున్నాడు. గత నెల 21న రమేశ్ అనే వ్యక్తితో పాటు దాదాపు 70 మంది ఆ షాప్ దగ్గరకు వచ్చి 'నాయీ బ్రాహ్మణుడివి కాకుండా సెలూన్ షాప్ ఎలా పెడతావు'? అంటూ దూషిస్తూ దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించిన ఫెరోజ్ ఖాన్.. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఇరువైపులా వాదనలు విన్న జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం.. దర్యాప్తు చేపట్టి నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది.

### ఏసీబీ కేసులు ఎదుర్కొంటున్న వారికి పోస్టింగ్, పదోన్నతి వద్దు

- ముఖ్యమంత్రికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక సంస్థ(ఏసీబీ) కేసులు ఎదుర్కొంటున్న అధికారులకు విచారణకు పూర్తయ్యే దాకా పోస్టింగులు, పదోన్నతులు ఇవ్వకూడదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఏసీబీ కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చెయ్యాలని కోరింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం ఓ లేఖ రాశారు. ఏసీబీ నమోదు చేసిన కేసుల విచారణలో తీవ్ర జాప్యం నెలకొంటుందని, చాలా కేసులు వీగిపోతున్నాయని ఎఫ్‌జీజీ తెలిపింది. ఫలితంగా ఏసీబీ కేసుల్లో శిక్ష పడుతుందనే భయం అధికారులకు లేకుండా పోయిందని పేర్కొంది. పెద్దపల్లి జిల్లా పంచాయతీరాజ్ ఏఈ జగదీశ్‌బాబు, వాణిజ్య పన్నుల శాఖ డీసీటీఓ డి.శ్రీనివాస్‌రెడ్డిపై ఏసీబీ కేసులు నమోదై, విచారణ కొనసాగుతుండగానే ఫోకల్ పాయింట్లలో పోస్టింగులు, పదోన్నతులు పొందారని తెలిపింది. ఇలాంటి కేసులను దీర్ఘకాలికంగా విచారణలో ఉంచడం వల్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని పోస్టింగులు, పదోన్నతులు పొందుతున్నారని వివరించింది. ఈ నేపథ్యంలో ఏసీబీ కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరింది.

## డ్రగ్స్ దందాలో పోలీసుల పిల్లలు

(మొదటి పేజీ తరువాయి)

డ్రగ్స్ కేసు నమోదైంది. ఈ కేసులో తేజ ఏ1గా ఉన్నారు. తేజ నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు ప్రధాన నిందితులు వాంగ్మూలం ఇచ్చినప్పటికీ.. నిజామాబాద్ పోలీసులు తేజ జోలికి వెళ్లలేదు. సూర్యతో తేజకు వ్యాపార భాగస్వామ్యం ఉందని, సూర్య కాల్ లిస్టులో డ్రగ్స్ డీల్‌లో భాగస్వామ్యులైన పలువురి నంబర్లు బయటపడటంతో ఒక్కొక్కరినీ ఈగల్ బృందాలు విచారిస్తున్న క్రమంలో తేజ సంగతి వెలుగులోకి వచ్చింది. తన బ్యాచ్‌లో పోలీసు అధికారుల సంతానం కూడా ఉండటంతో సూర్య మూడేళ్లుగా డ్రగ్స్ దందా యథేచ్ఛగా నడిపించాడని, కొందరు రాజకీయ నాయకుల పుత్రరత్నాలు, మరికొంత మంది సెలబ్రిటీలు సూర్య కాల్ లిస్టులో ఉన్నట్లు ఈగల్ గుర్తించింది. ఈ కేసులో అరెస్టు అయిన వారి సంఖ్య పదికి చేరింది. సూర్యతోపాటు హర్ష, యశ్వంత్, జశ్వంత్, నవదీప్, పవన్, రాహుల్, ఫుడ్ బ్లాగర్ సూర్య, తేజ, మోహన్‌లను ఈగల్ బృందాలు అరెస్టు చేశాయి. సూర్య తరచుగా డ్రగ్స్ తీసుకోవడానికి అనుమతించిన 9 పబ్‌లపై ఇప్పటికే సైబరాబాద్ ఈగల్ టీం కేసులు నమోదు చేసి, నోటీసులు జారీచేసింది. సూర్యను వారం రోజులు కస్టడీకి తీసుకున్న సైబరాబాద్ ఈగల్ బృందాలు.. అతని ఆర్థిక లావాదేవీలు, కొరియర్ చానల్స్, డిజిటల్ ఫుట్ ప్రింట్‌ను గుర్తించే దిశలో చర్యలు తీసుకుంటున్నాయి. ఈ కేసుకు సంబంధించి సూర్య పూర్తిగా నోరు విప్పితే పబ్‌ల లోగుట్టు, రహస్య గదుల్లో పార్టీలు జరిగే తీరు.. అందులో పాల్గొన్న పెద్దల పుత్రరత్నాల పేర్లు బయటపడే అవకాశాలున్నాయి.

## భార్యా భర్తల పంచాయితీలో ఘర్షణ

కత్తులు, కర్రలతో ఇరు కుటుంబాల దాడులు

ఇద్దరి మృతి.. నలుగురికి గాయాలు


మల్లేశ్;


గణేశ్

సుల్తానాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య పంచాయితీలో ఘర్షణ జరిగి ఇరు కుటుంబాలు కత్తులు, కర్రలతో దాడి చేసుకున్నాయి. ఈ వివాదంలో ఇద్దరు చనిపోయారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం తారకరామనగర్‌కు చెందిన మోటం సారయ్య కుమారుడు మారయ్యకు పెద్దపల్లికి చెందిన లక్ష్మికి 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ దంపతుల మధ్య ఆరు నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు, పెద్ద మనుషుల మధ్య పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలో మంగళవారం పెద్దపల్లి, ఓదెల మధ్య ఉన్న సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి పెట్రోల్ బంక్ దగ్గరున్న ఖాళీ స్థలంలో పంచాయితీకి ఏర్పాటు చేశారు. దీనికి ఇరు కుటుంబాల వారు, బంధువులు హాజరయ్యారు. పంచాయితీలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా ఒక్కసారిగా లక్ష్మి తరఫు వారు కత్తులు, కర్రలతో దాడికి దిగారు. గాయపడిన వారిని సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మోటం మల్లేశ్(35) చనిపోయాడు. ఈయన మారయ్య సోదరుడు. లక్ష్మి తరఫున పంచాయితీకి వచ్చిన పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన గాండ్ల గణేశ్(32) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘర్షణలో నలుగురు గాయపడ్డారు.

# ఇద్దరు కేజీబీవీ విద్యార్థినుల ఆత్మహత్య

## మరో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం.. ఒకేరోజు మూడు ఘటనలు.. అన్నీ కేజీబీవీల్లోనే!

- తరగతి గదిలో ఉరివేసుకున్న విద్యార్థిని
- ఇంట్లో ఉరివేసుకున్న మరో అమ్మాయి
- భవనంపై నుంచి దూకిన మరోవిద్యార్థిని
- ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థుల ఇబ్బందులు


తనుషా;


నవీంద్ర (ఫైల్)

మునగాల/భానుపురి/పరిగి/ కేటీదొడ్డి/ వరంగల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంకో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. 3 ఘటనలూ ఒకే రోజున జరగడం.. ముగ్గురూ కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)లో చదువుతున్నవారే కావడం విషాదకరం. సూర్యాపేట జిల్లా మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన నిమ్మ వెంకటేశ్వర్లు, వసుంధర దంపతుల కుమార్తె తనూష మహాలక్ష్మి (15).. నడిగూడెంలోని కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. సోమవారం రాత్రి 10 గంటల వరకు స్టడీ హవర్ క్లాసులో చదువుకుంది. తర్వాత తోటి విద్యార్థులతో కలిసి హాస్టల్ గదికి వెళ్లి నిద్రించింది. మంగళవారం ఉదయం తనూష కనిపించకపోవటంతో విద్యార్థులు పాఠశాల సిబ్బందికి చెప్పారు. అంతా కలసి ఆమెకోసం వెతకగా.. పదో తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. విషయం తెలుసుకుని పాఠశాలకు వచ్చిన తనూష తల్లిదండ్రులు.. కుమార్తె మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తన కుమార్తెకు 10 రోజుల క్రితం జ్వరం రావటంతో ఇంటికి తీసుకువెళ్లామని, జ్వరం తగ్గటంతో పాఠశాల వద్ద దించి వెళ్లామని తనూష తండ్రి చెప్పారు. ఆమె ఆరోగ్యం గురించి వాకబు చేసేందుకు సోమవారం మధ్యాహ్నం పాఠశాలకు వస్తే.. మంగళవారం పొద్దున టిఫిన్ తీసుకుని రా డాడీ అని చెప్పిందని, కానీ ఆమె మృతివార్త విని గుండెల్లో పిడుగుపడిందని బోరుమన్నారు. తనూజ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### వేధింపులు భరించలేక.. బడికి వెళ్లక..

ఓ యువకుడి వేధింపులు భరించలేక వికారాబాద్ జిల్లా పరిగి మండలం యబాజీగూడకు చెందిన కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యబాజిగూడకు చెందిన పద్మమ్మ, జంగయ్య దంపతుల రెండో కుమార్తె నవీంద్ర (16) పాలమాకుల కేజీబీవీలో పదో తరగతి చదువుతోంది. తండ్రి చనిపోగా, తల్లి కూలిపనులకు వెళుతూ పిల్లలను పోషించుకుంటోంది. అదే గ్రామానికి చెందిన నవీన్ అనే యువకుడు పాఠశాల వద్దకు వెళ్లి నవీంద్రను కలిసేందుకు తరచు ప్రయత్నించేవాడు. ఈ అంశం ప్రిన్సిపాల్ దృష్టికి వెళ్లడం, ఇబ్బందికరంగా మారడంతో.. నవీంద్రను పాఠశాల నుంచి పంపించివేశారు. దీనితో ఆమె ఇంటి దగ్గరే ఉంటోంది. సోమవారం తల్లి వేరే గ్రామానికి వెళ్లి తిరిగొచ్చే సరికి.. ఇంటి దగ్గర ఉన్న షెడ్డులో నవీంద్ర ఉరివేసుకుంది. నవీన్ వేధింపులతోనే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందంటూ మృతురాలి తల్లి పద్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### ఇంటిపై బెంగతో.. మానసికంగా కుంగి!

నారాయణపేట జిల్లా భూత్పూర్‌కు చెందిన సాయిశ్రుతి గద్వాల జిల్లా కేటీదొడ్డి మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం పాఠశాలలోని మొదటి అంతస్తు నుంచి ఆమె కిందకు దూకింది. గాయపడిన ఆమెను పాఠశాల సిబ్బంది వెంటనే గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు.. వెన్నెముకకు తీవ్రగాయమైనట్టు గుర్తించి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు పంపించారు. పాఠశాల స్పెషలాఫీసర్ పద్మావతి మాట్లాడుతూ.. సాయిశ్రుతి కొన్ని రోజులుగా ఇంటి విషయాలతో మానసికంగా కుంగిపోతోందని పేర్కొన్నారు. ఆమె భోజనం కూడా సరిగా చేయడం లేదని తెలిసిందన్నారు. ఈ క్రమంలో నీరసంతో కళ్లు తిరిగి, భవనంపై నుంచి కిందపడినట్టు అనిపిస్తోందన్నారు.

### బాధ్యత రేవంత్‌రెడ్డిదే:కేటీఆర్

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యార్థుల మరణాలు, ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఏడాదిలో కలుషిత ఆహారంతో వేలమంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని, 100 మందికి పైగా మరణించడానికి ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని ఎక్స్ వేదికగా ఆరోపించారు. ఇన్ని విషాద ఘటనలు జరుగుతున్నా విద్యా శాఖ బాధ్యతలు చూస్తున్న రేవంత్‌రెడ్డి కనీసం సమీక్షించకపోవడం నియంతృత్వ, అమానవీయ పాలనకు నిదర్శనమని విమర్శించారు. "రేవంత్ కనీసం ఒక తండ్రిగా ఆలోచించాలి. ప్రభుత్వమే విషంపెడితే ఆ చిన్నారులు ఎవరికి చెప్పుకోవాలి? తన పిల్లలకు అలాంటి విషాహారం పెడితే రేవంత్‌రెడ్డి ఊరుకుంటారా?ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఆయన పిల్లలుంటే చూసీచూడనట్లు ఉంటారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. గురుకులాల్లో దారుణాలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు.

### గురుకులాల్లో ఏమిటీ సమస్య?

రాష్ట్రంలో 1,023 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పాఠశాలలు, 495కేజీబీవీ, 267ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 6.5లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల గురుకుల పాఠశాలల విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడుతుండటం తల్లిదండ్రుల్లో ఆందోళన రేపుతోంది. కొన్నేళ్లుగా గురుకులాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు కుటుంబాలకు దూరంగా ఉండటం, అనారోగ్యానికి గురైతే పట్టించుకునేవారు లేకపోవడం, మానసికంగా అందని సాంత్వన వంటివాటితో.. హాస్టల్‌లో ఉండలేక, ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం గురుకులాల్లో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నా క్షేత్రస్థాయిలో లోపాలు విద్యార్థులకు శాపంగా మారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. కాగా, విధుల్లో నిర్లక్ష్యం వహించి 45 మంది విద్యార్థినుల అస్వస్థతకు కారణమయ్యారంటూ నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండ ఎస్టీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వేదాద్రిని కలెక్టర్ ఇలాత్రిపాఠి సస్పెండ్ చేశారు.

## ప్రత్యూష భర్త, ఆయన ప్రియురాలు, అత్తామామ అరెస్టు

- ఇన్‌స్టా ఇన్‌ఫ్లుయెన్సర్‌తో భర్త చనువుగా ఉండటంపై ప్రత్యూష మనస్తాపం
- చెప్పినా పట్టించుకోని అత్తామామలు
- ప్రత్యూష ఆత్మహత్య కేసులో వివరాలు వెల్లడించిన కాజీపేట ఏసీపీ

హసన్‌పర్తి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దంతవైద్యురాలు ప్రత్యూష ఆత్మహత్యకు కారకులయ్యారనే ఆరోపణలకు సంబంధించి ఆమె భర్త డాక్టర్ సృజన్‌ను, అత్తామామలు అల్లాడి మధుసూదన్, పుణ్యవతి దంపతులను, సృజన్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ బానోతు శ్రుతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మంగళవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం.. వరంగల్ మట్టెవాడకు చెందిన తంజావూరు పద్మావతి విజయ్‌కుమార్ దంపతుల కూతురు ప్రత్యూష (35)ను హసన్‌పర్తికి చెందిన మధుసూదన్ పుణ్యవతి దంపతుల చిన్నకుమారుడు డాక్టర్ సృజన్‌కు ఇచ్చి 2017లో పెళ్లి జరిపించారు. వివాహ సమయంలో కట్నకానుకల కింద సృజన్‌కు ప్రత్యూష తల్లిదండ్రులు రూ.30 లక్షల నగదు, 30 తులాల బంగారం, కారు ఇచ్చారు. సృజన్-ప్రత్యూషకు జానూష (7), జైస్వికాస్ (7 నెలలు) కూతుళ్లున్నారు. సృజన్ వరంగల్ కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజిస్టు, సిటి సర్జన్‌గా పనిచేస్తున్నారు. ప్రత్యూష ఆరెపల్లిలోని ఎన్ఎస్ఆర్ అపోలో ఆస్పత్రిలో దంతవైద్యురాలిగా చేస్తున్నారు. సృజన్ పనిచేస్తున్న మెడికవర్ ఆస్పత్రి నిర్వాహకులు ఏడాది క్రితం ఆస్పత్రిలో పనిచేస్తున్న స్పెషలిస్టు డాక్టర్లను ఇంటర్వ్యూ చేసేందుకు హనుమకొండ రెవెన్యూ కాలనీకి చెందిన బానోతు శ్రుతిని పిలిపించారు. అప్పటి నుంచి సృజన్-శ్రుతి మధ్య పరిచయం పెరిగింది. ఇద్దరూ చాటింగ్ చేసుకునేవారు. ఈ విషయంలో ప్రత్యూష-సృజన్ మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ప్రత్యూష తన అత్తామామలకు చెప్పినప్పటికీ పట్టించుకోకపోగా ఆయన్నే సమర్థించడంతో ఆమె మనస్తాపం చెందారు. అంతేకాకుండా బానోతు శ్రుతి తనతో మాట్లాడిన తీరూ ఆమెను తీవ్ర మనోవేదనకు గురిచేసింది. ఈ నెల 12వ తేదీ శనివారం సృజన్ తల్లిదండ్రులు... జానూష, జైస్వికాస్‌ను తీసుకొని భద్రాచలంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. 13న సృజన్ తన స్నేహితులతో కలిసి బొగత జలపాతానికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఆయన రాగానే ప్రత్యూష గదిలోకి వెళ్ళి గడియవేసుకున్నారు. భర్త వెళ్లి పిలిచినప్పటికీ ఆమె నుంచి సమాధానం రాలేదు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా ప్రత్యూష చీరతో ఉరివేసుకున్న స్థితిలో కనిపించారు. సృజన్ వెంటనే తన స్నేహితులైన శివరామ్ దంపతులను పిలిచి తలుపు పగులగొట్టి ప్రత్యూషను ఆరెపల్లిలోని ఎన్ఎస్ఆర్ అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రత్యూష తల్లి పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు భర్త సృజన్, అత్తామామలు మధుసూదన్ పుణ్యవతి, బానోతు శ్రుతిపై కేసు నమోదు చేశారు. మంగళవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# కాపుకాచి.. కాల్చి చంపి..

## కాంగ్రెస్ మెదక్ జిల్లా ఎస్సీ సెల్ నేత మారెల్లి అనిల్ దారుణ హత్య

మెదక్/ కొల్చారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎస్సీ సెల్ మెదక్ జిల్లా కార్యదర్శి మారెల్లి అనిల్ (28) దారుణ హత్యకు గురయ్యారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ సమావేశానికి హాజరైన ఆయన.. తిరిగి వస్తుండగా మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామ సమీపంలో దుండగులు కాల్చి చంపారు. అనిల్ నడుపుతున్న కారు కల్వర్టును ఢీకొని ఉండటంతో.. అది రోడ్డు ప్రమాదమని పోలీసులు తొలుత భావించారు. పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు మృతదేహం దుస్తులు తొలగిస్తుండగా బుల్లెట్ గాయాలను గుర్తించారు. రియల్ ఎస్టేట్ వివాదాలే ఈ హత్యకు కారణం కావొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారమే అనిల్ పుట్టినరోజు అని, ఇలా శవమై తిరిగి వస్తాడని ఊహించలేదంటూ మెదక్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఆయన తల్లి యేసమ్మ కన్నీరు మున్నీరయ్యారు.

### పక్కాగా కాపుకాసి కాల్పులు

కొల్చారానికి చెందిన మారెల్లి అనిల్ సంగాయిపేటలో పెట్రోల్ బంక్ నడిపించడంతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో భూములకు సంబంధించి పలువురితో అనిల్‌కు వివాదాలు ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఓ భూవివాదంలో ఏపీలోని రాయలసీమకు చెందిన ఓ వ్యక్తి కారును అనిల్ స్వాధీనం చేసుకున్నారని సమాచారం. అయితే అనిల్ సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ సమావేశానికి హాజరయ్యారు. రాత్రి తిరుగు ప్రయాణంలో ఉండగా హత్యకు గురయ్యారు. దుండగులు పక్కాగా రెక్కీ చేసి, పథకం ప్రకారం హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో ఓ కారుతో ఆగంతుకులు వేచి ఉన్నారని సమీపంలోని ఓ రైస్ మిల్లు సీసీ కెమెరా ఫుటేజీలలో గుర్తించారు. వారు అనిల్ కారును అడ్డగించి, నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి ఉంటారని అంచనా వేస్తున్నారు. అనిల్ తప్పించుకునే ఉద్దేశంతో కారును వేగంగా ముందుకు పోనివ్వడంతో ఎదురుగా ఉన్న కల్వర్టును ఢీకొని ఉంటారని చెబుతున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. దేహంలో నాలుగు బుల్లెట్లు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. దీనితో పోలీసులు క్లూస్‌టీం, ఫోరెన్సిక్ నిపుణులతో ఘటనా స్థలాన్ని పరిశీలించి, నాలుగు బుల్లెట్ కాట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఘటనా స్థలాన్ని ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ కేసు దర్యాప్తు కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. కాగా, రాయలసీమతో పాటు హైదరాబాద్‌కు చెందిన పలువురు అనుమానితులను పోలీసులు అదుపులో తీసుకున్నట్టు తెలిసింది. అనిల్ హత్యను కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి ఖండించారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్‌పై..

## గవర్నర్‌కు ఆర్డినెన్స్ ఫైలు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు వీలుగా.. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018లో సవరణకు రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా గవర్నర్ కార్యాలయానికి చేరింది. ఆ చట్టంలోని సెక్షన్ 285 (ఏ)ను సవరించాలని మంత్రివర్గం నిర్ణయం మేరకు ప్రభుత్వం ఈ ఫైలును గవర్నర్‌కు పంపింది. గవర్నర్ జిష్ణుదేవ్ దాన్ని పరిశీలించనున్నారు. నిపుణులతోనూ ఆయన చర్చించనున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే అన్ని సామాజికవర్గాల రిజర్వేషన్లూ కలిపి 50 శాతం మించరాదని గతంలో పలు కేసుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అదే సమయంలో రిజర్వేషన్లను పెంచుకునేందుకు ప్రత్యేక సమయాల్లో పెంచుకునేందుకు అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే చట్టసవరణ చేసి, రాష్ట్రంలోని బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని సర్కారు నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 285 (ఏ)లోని 50 శాతం సీలింగ్ అనే పదాన్ని తొలగించడంతోపాటు, ఇతర సెక్షన్లలోనూ పలు సవరణలు చేయనుంది. ఈ విషయాన్నే పేర్కొంటూ గవర్నర్‌కు ఫైలును పంపింది. అలాగే రాష్ట్రంలో రిజర్వేషన్లను పెంచాల్సిన ఆవశ్యకతతో పాటు..కులగణన వివరాలను కూడా గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించినట్టు తెలిసింది. 2018 పంచాయతీరాజ్ చట్టం రాష్ట్ర పరిధిలోనిదే కావడంతో గవర్నర్ దగ్గర ఆలస్యం జరగదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్స్ రాగానే రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయనుంది. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటైన ప్రత్యేక కమిషన్ మరోసారి రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి ఇవ్వనుంది. ఆ కమిషన్ గతంలోనే ఒకసారి ప్రభుత్వానికి ఈ వివరాలు ఇచ్చినప్పటికీ.. అవి సుప్రీంకోర్టు సూచించిన 50శాతం రిజర్వేషన్లు మించరాదన్న నిబంధనకు లోబడి ఉనాయి. ఇప్పుడు ప్రభుత్వం వాటిని పెంచేందుకు ఆర్డినెన్స్‌ను తీసుకురానుండడంతో బీసీలకు 42శాతం ప్రకారం రిజర్వేషన్ల కేటాయింపు, అన్ని కులాల రిజర్వేషన్లు కలిపి ఏ మేరకు వస్తాయనే వివరాలను కమిషన్ తేల్చనుంది. దీనిపై సమగ్ర నివేదికను వారంరోజుల్లో ప్రభుత్వానికి అందించనున్నట్టు తెలిసింది. కాగా ఇప్పటికే వార్డు సభ్యులకు గ్రామం యూనిట్‌గా, సర్పంచ్‌కు మండలం, ఎంపీపీలకు, ఎంపిటీసీలకు జిల్లా, జడ్పీ చైర్మన్‌లకు రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని మొత్తం 5-6 రకాల రిపోర్టులను రూపొందించారు. దీని ప్రకారమే మళ్లీ కొత్త నిబంధనలను, 42శాతం రిజర్వేషన్ల మేరకు రూపొందించనున్నట్టు సమాచారం.

## సహజీవనం చేశాక లైంగికదాడి కేసు చెల్లదు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ రంజిత్‌పై కేసు కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అన్ని విషయాలు తెలిసీ ఒక వ్యక్తితో సహ జీవనం చేశాక.. తనపై లైంగిక దాడి చేశారని ఆరోపించలేరని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ మేరకు లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ టీ.రంజిత్‌పై నమోదైన కేసును కొట్టేసింది. ఫిర్యాదుదారు మహిళ మేజరై ఉండి సహ జీవనం చేశాక తనపై అత్యాచారం చేశారని ఆరోపించడం సరి కాదని, దీనికి పురుష భాగస్వామిని బాధ్యుడ్ని చేయడం సమంజసం కాదని స్పష్టం చేసింది. ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) విద్యార్థిని (29) ఫిర్యాదుతో అసిస్టెంట్ ప్రొఫెసర్ టీ రంజిత్ (49)పై పోలీసులు లైంగికదాడి కేసు పెట్టారు. తనకు వివాహమైనట్లు తెలిసీ రెండేళ్లు సహజీవనం చేసి, ఇప్పుడు తనపై లైంగికదాడి కేసు పెట్టడం చెల్లదని రంజిత్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం విచారించింది. ఇదే మహిళ గతంలో తనతో సహ జీవనం చేసిన బీ కేశవ్‌కుమార్ అనురాగ్ అనే వ్యక్తిపైనా పెట్టిన కేసును సుప్రీంకోర్టు కొట్టేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఫిర్యాదుదారు మహిళ మేజరై ఉండటంతోపాటు పిటిషనర్ రంజిత్‌కు వివాహం అయిందని.. ఇంకా విడాకులు తీసుకోలేదని తెలిసీ ఎలా సహజీవనానికి అంగీకరించారని ప్రశ్నించింది. దీంతోపాటు ఫిర్యాదుదారు మహిళ గతంలోనూ ఇదే తరహాలో కేసులు పెట్టిన నేపథ్యంలో కేసు కొట్టేస్తున్నామని పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84.
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.